ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 22-3-2018 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 221 రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నారీ.. నీకేది దారి!

2016లో దేశవ్యాప్తంగా 12% పెరిగిన అత్యాచారాలు



- తెలుగు రాష్ట్రాల్లో మహిళలపై భర్తల దాడులు అధికం
- 5వ స్థానంలో తెలంగాణ, 7వ స్థానంలో ఏపీ
- పట్టణ నిరుద్యోగిత తెలంగాణలో అధికం
- బడిలో చేరుతున్న పిల్లల శాతంలో అట్టడుగున ఏపీ
- దేశవ్యాప్తంగా మహిళల పేరిట 32 శాతం డిపాజిట్లు
- కేంద్ర నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దేశంలో మహిళలకు చాలా అంశాల్లో పురుషులతో సమానత్వం దక్కడం లేదని.. వారిపై దాడులు, అత్యాచారాల వంటివి పెరుగుతూనే ఉన్నాయని తాజా నివేదిక స్పష్టంచేసింది. ఇల్లాలికి ఇంట్లో నుంచే ముప్పు పొంచి ఉందని.. అత్యధికంగా భర్త, బంధువుల నుంచి దాడులు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. మొత్తం మహిళల ఆత్మహత్యల్లో గృహిణులవే అధికంగా ఉండటం మరో విషాదం. దేశవ్యాప్తంగా మహిళలు, పురుషుల స్థితిగతులపై కేంద్రం ప్రభుత్వం వివిధ సంస్థలు, మార్గాల్లో జరిపే అధ్యయనాలను క్రోడీకరించి 2016కు సంబంధించి కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ నివేదిక-2017ను తాజాగా విడుదల చేసింది. అనేక అంశాల్లో రెండు వర్గాలను పోలుస్తూ నివేదికను రూపొందించింది. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించేందుకు విధాన నిర్ణయాలు తీసుకోవడానికి.. పథకాలు, ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు ఉపకరిస్తాయని ఆ శాఖ తెలిపింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- దేశంలో 2015తో పోలిస్తే 2016లో అత్యాచారాలు 12 శాతం పెరిగాయి. అన్ని నేరాల్లోకెల్లా అత్యాచారాల పెరుగుదల శాతం అధికంగా ఉంది.
- మొత్తం మహిళలపై నేరాల్లో.. భార్యపై భర్త దాడి చేసినట్లు నమోదైన వాటిని శాతాల ఆధారంగా చూస్తే... తెలంగాణ 5, ఏపీ 7వ స్థానంలో ఉన్నాయి. ఈ తరహా నేరాలు (మిగతా 2లో)



శాసనమండలిలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

స్వేచ్ఛ కావాలి

ఏడు రంగాల్లో రాష్ట్రాలకు పూర్తి అధికారం ఇవ్వాలి

- మిషన్ భగీరథ, కాకతీయలకు రూ.24 వేల కోట్లు అడిగితే.. కేంద్ర ప్రభుత్వం రూ.24 కూడా ఇవ్వలేదు
- అప్పులు దావత్‌ల కోసం కాదు
- మండలిలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

దేశంలో విద్య, వైద్యం, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి తదితర ఏడు రంగాలను కేంద్ర ప్రభుత్వ అధీనం నుంచి తప్పించి.. వాటిపై రాష్ట్రాలకే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ డిమాండ్ చేశారు. ప్రత్యక్ష పన్నుల్లో రాష్ట్రం నుంచి వెళ్తున్న నిధులతో పోలిస్తే వస్తున్న నిధులు తక్కువగానే ఉన్నాయన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడం లేదని.. ఇతర మార్గాల ద్వారా సమీకరించుకునేందుకూ నిబంధనలు సడలించడం లేదని దుయ్యబట్టారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు బాగున్నాయని కేంద్రమే ప్రశంసించిందని.. ఈ మేరకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలని కోరితే, రూ.24 కూడా ఇవ్వలేదని (మిగతా 2లో)

"బడ్జెట్‌లో అప్పులు అనే మాట ఇప్పుడో పెద్ద జోక్. అప్పులు ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం. బడ్జెట్‌పై ప్రతిపక్షాలు పరిణతితో కూడిన విశ్లేషణ చేయడం లేదు. భాజపా పాలిత రాష్ట్రాలు అప్పులు తీసుకోవడం లేదా? కేంద్ర ప్రభుత్వమూ రుణాలు తీర్చేందుకు మూడో వంతు నిధులను బడ్జెట్‌లో పేర్కొంది. అంటే కేంద్రమూ దుబారా చేస్తోందా? మేము తీసుకొస్తున్న అప్పులను దావత్‌లు, సొంత సంతోషాలకు ఖర్చుచేయడం లేదు. ఇప్పటికైనా విపక్షాల ఆలోచనా ధోరణి మారాలి" -ముఖ్యమంత్రి కేసీఆర్

రాజ్యసభ ఎన్నికల్లో తెదేపా, సీపీఎం.. ఓటింగ్‌కు దూరం

- తెరాసకా లేక నోటాకా.. నేడు నిర్ణయించనున్న భాజపా 2లో

వెంకట్‌రెడ్డి, సంపత్‌లకు ఓటు హక్కు లేదు

- స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం 11లో

కనిష్క్ కుచ్చుటోపీ

బ్యాంకులకు రూ.వెయ్యి కోట్లు ఎగవేత

- గత ఏడాది మేలోనే దుకాణం సర్దేసి విదేశాలకు పరారైన భూపేష్ కుమార్ జైన్
- ఆభరణాల వ్యాపార సంస్థకు రూ. 824 కోట్ల రుణాలిచ్చిన 14 బ్యాంకుల సహా వ్యవస్థ
- ఎస్‌బీఐ ఫిర్యాదుతో.. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు

దిల్లీ: దేశంలో మరో భారీ ఆర్థిక నేరం! నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ, రొటోమాక్ యజమాని విక్రమ్ కోఠారీల మోసాలను తలపించేలా మరో బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ మన దేశ బ్యాంకులకు టోకరా వేసింది. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర బకాయిలను చెల్లించకుండానే కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం దేశం నుంచి పరారైంది. ప్రస్తుతం వారు మారిషస్‌లో ఉన్నట్లు (మిగతా 2లో)



భూపేష్ జైన్



బుధవారం దిల్లీలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసిన తెరాస ఎంపీలు

కోటాపై ప్రకటన చేయాల్సిందే

- కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించండి
- సభాపతికి తెరాస ఎంపీల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: శాసనసభలో తెలంగాణ ప్రభుత్వం తీర్మానం చేసి పంపించిన రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం ప్రకటన చేయాల్సిందేనని తెరాస ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని సభాపతి సుమిత్రా మహాజన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారమిక్కడ తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు సీతారాం నాయక్, దయాకర్, బాల్క సుమన్, నగేశ్, బీబీపాటిల్, వినోద్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాసులురెడ్డి తదితరులు సభాపతితో భేటీ అయ్యారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు గిరిజనులు ఎస్సీ, ఎస్టీల జనాభా శాతం పెరిగిందని ఆ మేరకు రిజర్వేషన్లు పెంచుకొనే హక్కు రాష్ట్రానికి ఇవ్వాలని తెలిపారు. ఈ అంశంపై తాను నిర్ణయం తీసుకోలేనని సంబంధింత మంత్రిత్వశాఖకు సమాచారమిస్తానని సభాపతి వారితో అన్నారు. సభ సజావుగా సాగేలా సహకరించాలని ఆందోళన విరమించాలని ఆమె కోరగా దీనికి తెరాస ఎంపీలు నిరాకరించారు. రిజర్వేషన్ల విషయంలో న్యాయబద్ధమైన (మిగతా 2లో)



ఫేస్‌బుక్‌కు భారత్ హెచ్చరిక

- ఎన్నికల్లో జోక్యాన్ని సహించబోమని వెల్లడి
- అవసరమైతే జుకెర్‌బర్గ్‌కు సమన్లు పంపుతామని వ్యాఖ్యలు
- కేంబ్రిడ్జ్ అనలిటికా సేవలను ఉపయోగించుకున్నారంటూ భాజపా, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు 2లో

10 నెలలు.. 20 వేల కోట్లు

- ఇదీ 'కాళేశ్వరం' లెక్క
- అప్పుడే లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యే అవకాశం

ఈనాడు - హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి మల్లన్న సాగర్ వరకు నీటిని మళ్లించే పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఈ పనులు పూర్తి చేయాలంటే సుమారు రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు చేయాలి. మరికొన్ని పనులను ఈ ఏడాది ఆఖరుకు, కొన్ని పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.15 వేల కోట్లు ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేయగా, రానున్న పది నెలల్లోనే రూ.20 వేల కోట్లకు పైగా అవసరమవుతుంది.

ప్రాణహిత- చేవెళ్ల పునరాకృతిలో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకం నిర్మాణ వ్యయం రూ.80,500 కోట్లు. భూసేకరణ, పునరావాసం తదితరాలు పోను 28 ప్యాకేజీల పనులను రూ.60,922.49 కోట్లకు గుత్తేదారులతో ఒప్పందం చేసుకొంది. ప్రాణహిత, గోదావరి నదులు కలిసిన తర్వాత మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మించి అక్కడి నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించే పనులు.. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు, ఇక్కడి నుంచి మల్లన్న సాగర్ వరకు నీటిని మళ్లించే పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనులు ఓ మోస్తరుగా సాగుతున్నాయి. ఈ పథకంలో కొన్ని పనులను అక్టోబరు నాటికి, మిగిలినవి ఈ ఏడాది ఆఖరుకు పూర్తి చేస్తామని మంత్రి హరీశ్‌రావు బుధవారం శాసనసభలో ప్రకటించారు. ఈ మేరకు జరగాలంటే నెలకు కనీసం రూ.రెండు వేల కోట్లు ఈ ప్రాజెక్టుపైనే ఖర్చు చేయాల్సి ఉంటుంది.



ఇదీ పనుల తీరు

- మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించాలంటే మూడు బ్యారేజీలు, మూడు లిఫ్టులు పూర్తి చేయాలి. ఈ పనులు పూర్తవ్వాలంటే ఇప్పటి వరకు చేసిన ఖర్చుపోనూ రూ.ఏడు వేల కోట్లు వ్యయం చేయాలి. ఇందులో అన్నారం బ్యారేజి, లిఫ్టు పనులు ముందంజలో ఉన్నాయి. బ్యారేజికి గేట్ల బిగింపు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. మిగిలిన గేట్లను అమర్చే పనిని కూడా వేగవంతం చేయాలని హరీశ్‌రావు ఆదేశించారు.
- అన్నారం పంపుహౌస్ వద్ద 8 పంపులు అమర్చాల్సి ఉంది. జూన్ నాటికి నాలుగు పంపులను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.
- సుందిళ్ల బ్యారేజి, లిఫ్టు (మిగతా 2లో)

ఏప్రిల్ నెలాఖరుకల్లా కొత్త రేషన్ కార్డులు

- డీలర్ల కమీషన్ పెంపునకు యోచన 11లో
- అసెంబ్లీలో మంత్రుల వెల్లడి

జూబ్లీహాలుకు పూర్వవైభవం

- అక్కడే కలెక్టర్ల సమావేశాలు
- ప్రముఖులకు విందులు 11లో
- సీఎం, మంత్రుల కార్యాలయాల్లో మార్పులు
- సీఎం కేసీఆర్ ఆదేశాలు
- తాను రాజకీయాల్లోకి రావడానికి జూబ్లీహాలు స్ఫూర్తినిచ్చిందని వెల్లడి

కళాశాలలుగా 27 గురుకుల పాఠశాలలు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ తరగతులు ప్రారంభం
- కొత్తగా 405 కొలువుల మంజూరు 5లో

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు జవాన్లు, ఇద్దరు పోలీసులు మృతి
- ఐదుగురు ఉగ్రవాదుల హతం
- రెండురోజుల పాటు కొనసాగిన ఎదురు కాల్పులు



కుప్వారా జిల్లాలో ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతాన్ని చుట్టుముట్టిన భద్రతా సిబ్బంది

శ్రీనగర్: జమ్ము-కశ్మీర్‌లో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు నడుమ భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు భద్రతా సిబ్బంది మృతిచెందారు. వీరిలో ముగ్గురు ఆర్మీ జవాన్లు కాగా, మరో ఇద్దరు పోలీసులు. మరికొందరు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ఎదురు కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమైనట్లు డీజీపీ ఎస్.పి.వాయిద్ వెల్లడించారు. కుప్వారా జిల్లా హల్మత్‌పోరా అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం మొదలైన కాల్పులు బుధవారం రాత్రి వరకూ కొనసాగాయి. నియంత్రణ రేఖకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ ఘటనా స్థలం ఉంది. సైనిక దళాలపై మిలిటెంట్లు విరుచుకుపడటంతోనే ఎదురు కాల్పులకు దిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సీఆర్‌పీఎఫ్, సైనిక దళాలు మూకుమ్మడిగా ఆరాంపోరా, హల్మత్‌పోరా అటవీ ప్రాంతాల్లో ఉగ్రవాదుల కోసం జల్లెడ పట్టాయి. మసీదులో తలదాచుకున్న నలుగురు ఉగ్రవాదులు.. ఆ తర్వాత (మిగతా 2లో)

ఇదీ సంగతి!



సిర్పూరు మిల్లుకు సిరి

- జేకే పేపర్స్‌కు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు
- రెండునెలల్లో అన్ని అనుమతులు జారీ
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: కుమురం భీమ్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో మూతపడిన కాగితపు మిల్లు పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. మిల్లు యాజమాన్య సంస్థ జేకే పేపర్స్ లిమిటెడ్‌కు రూ.వేయి కోట్లకు పైగా భారీ ఎత్తున రాయితీలు ప్రకటిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల్లో పరిశ్రమను పునఃప్రారంభించేందుకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్స్‌లను జారీ చేయాలని ఆదేశించింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇప్పటికే రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధణ పనులు ప్రారంభం కాగా తాజాగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు ఈ అవకాశం దక్కింది. సిర్పూరు కాగితపు మిల్లు 2014 అక్టోబరులో మూతపడింది. దీంతో మూడువేల మందికి పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు. పరిశ్రమను పునరుద్ధరించాలని కార్మిక కుటుంబాలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీనిపై ప్రభుత్వం యాజమాన్యంతో చర్చలు జరిపింది. తమకు రూ. 628 కోట్ల మేరకు పెట్టుబడి సాయం అందిస్తే మళ్లీ పరిశ్రమను నిర్వహిస్తామని (మిగతా 2లో)



సిర్పూరు కాగజ్‌నగర్ మిల్లు

నిబంధనలను 'నీట్'గా తప్పించారు

- నీట్ రాయని 50 మంది విద్యార్థులకు సీట్లు
- యునాని కళాశాల మాయాజాలం
- ప్రవేశాలను రద్దు చేయాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశం 2లో

TG

2031 నాటికి బెంగళూరులో కేప్‌టౌన్ తరహా నీటి కొరత!

సీఎస్ఈ హెచ్చరిక

దిల్లీ: దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ లాగా బెంగళూరు 2031 నాటికి నీటి కొరతతో విలవిల్లాడిపోయే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జూన్-జులై నాటికల్లా కేప్‌టౌన్‌లోని కుళాయిల్లో నీటి చుక్కన్నది కనిపించకుండా మాయమైపోయే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వెల్లువెత్తుతున్నాయి. బెంగళూరుకు కూడా ముమ్ముందు ఇదే ముప్పు ఎదురుకావచ్చని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) నివేదికను ఉటంకిస్తూ 'డౌన్ టు ఎర్త్' పత్రిక హెచ్చరించింది. 'బెంగళూరులోని జలాశయాలు, వనరులు 79 శాతం తగ్గిపోయాయి. ఇష్టారాజ్యంగా పెరిగిపోతున్న పట్టణీకరణ, దురాక్రమణలే ఇందుకు కారణం. బెంగళూరులో జలసూచీ దారుణంగా పడిపోయింది. బెంగళూరు జనాభా 2031 నాటికి 2కోట్లకు మించిపోయే అవకాశముందని సీఎస్ఈ పేర్కొంది.

నిబంధనలను 'నీట్'గా తప్పించారు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి



అల్-అరీఫ్ యునాని కళాశాల భవనం

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఫాతిమా వైద్య కళాశాలలోని కొందరు విద్యార్థులు మోసపోయినట్లే.. హైదరాబాద్‌లో ఓ యునాని వైద్య కళాశాల చేతిలో విద్యార్థులు వంచనకు గురయ్యారు. డొనేషన్లను చెల్లించి ఈ కళాశాలలో చేరిన విద్యార్థుల అడ్మిషన్లను ఇప్పుడు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రద్దు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నీట్ పరీక్ష రాయని విద్యార్థులకు వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం సీట్లను కేటాయించడమే కారణం.

హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట సమీపంలోని బండ్లగూడలో అల్-అరీఫ్ యునానీ కళాశాలలో బాచిలర్ ఆఫ్ యునాని మొదటి సంవత్సరం మెడిసిన్ సీట్లు వంద ఉన్నాయి. గతంలో బ్యాచిలర్ ఆఫ్ యునాని మెడిసిన్ సెట్ కింద పరీక్షలు రాసిన విద్యార్థులకే అడ్మిషన్లు ఇచ్చేవారు. మారిన నిబంధనలకు అనుగుణంగా ఈ కళాశాలలో అడ్మిషన్లకు కూడా నీట్ రాసిన విద్యార్థులే అర్హులని మెడికల్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసింది.

కళాశాల మాయాజాలం

ఇదే సమయంలో యునాని కళాశాల యాజమాన్యం సరికొత్త ఎత్తుగడ వేసింది. కళాశాలలోని 100 సీట్లలో 50 సీట్లు కన్వీనర్ కోటా కింద నీట్ రాసిన విద్యార్థులకే మొదటి ఏడాదికి అడ్మిషన్ ఇచ్చింది. యాజమాన్య కోటా 50 సీట్లను నిబంధనలకు విరుద్ధంగా నీట్ రాయని విద్యార్థులతో భర్తీ చేసింది. 2017-18 విద్యా సంవత్సరానికి ఈ అడ్మిషన్లు జరిగాయి. ఇప్పుడు వారంతా మొదటి సెమిస్టర్ రాయడానికి సిద్ధమవుతున్నారు. ఈ అడ్మిషన్లపై ఫిర్యాదు అందడంతో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పరిశీలించి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. అసలు నీట్ రాయని 50 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారంటూ వర్సిటీ అధికారులు ఆగ్రహం వక్తంచేశారు. ఈఅడ్మిషన్లను రద్దు చేయాలని వారం కిందట సంబంధిత కళాశాల యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చింది.

నమ్మించి వంచించి..

నీట్ రాకపోయినా కూడా అడ్మిషన్లు తీసుకోవచ్చని ఈవిషయంలో ప్రభుత్వం తమకు ప్రత్యేక అనుమతి ఇచ్చిందంటూ యాజమాన్యం నమ్మించిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షల్లో డొనేషన్లు వసూలు చేసిందని అంటున్నారు. 50 సీట్లకు సంబంధించి డొనేషన్ల కింద రూ.కోట్లలోనే వసూలైనట్లు చెబుతున్నారు.

దీనిపై ఆరోగ్య వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ సుధాకర్‌ను 'ఈనాడు' వివరణ కోరగా నీట్ రాయకుండానే నిబంధనలకు విరుద్ధంగా 50 మంది విద్యార్థులను అల్-అరీఫ్ యునాని కళాశాల యజమాన్యం చేర్చుకుందన్నారు. అడ్మిషన్లను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. దీనిపై కళాశాల పాలకవర్గ కార్యదర్శి సెహసానుల్ హక్‌ను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అడ్మిషన్లను రద్దు చేయాలని ఆరోగ్య వర్సిటీ ఆదేశించిన మాట వాస్తవమేనని అంగీకరించారు. నీట్ రాయకపోయినా అడ్మిషన్లు ఇచ్చుకోండని.. దీనిపై తరువాత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుందంటూ అధికారులు హామీ ఇవ్వడంతోనే అడ్మిషన్లు చేశామన్నారు. అడ్మిషన్లను రద్దు చేయవద్దని వర్సిటీ అధికారులను కోరినట్లు చెప్పారు.

రాజ్యసభ ఎన్నికల్లో తెదేపా, సీపీఎం ఓటింగ్‌కు దూరం

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉండాలని తెలుగుదేశం, సీపీఎం నిర్ణయించాయి. ఈ రెండు పార్టీలకు కలిపి ప్రస్తుతం ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు. తెరాస,కాంగ్రెస్‌కు సమదూరంగా ఉంటున్నామని, తమ పార్టీ ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉంటారని తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ ఓ ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎవరికీ ఓటేయవద్దని పార్టీ నిర్ణయించిందని, ఓటింగ్‌లో పాల్గొనబోమని సీపీఎం ఎమ్మెల్యే రాజయ్య చెప్పారు. భాజపా ఎమ్మెల్యేలు ఐదుగురు బుధవారం సమావేశమై ఎన్నికలకు దూరంగా ఉండాలా, ఓటింగ్‌లో పాల్గొంటే ఎవరికి వేయాలని చర్చించారు.. మద్దతు కావాలని ఏ పార్టీ కోరలేదని, గురువారం నిర్ణయం తీసుకుంటామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. 'కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతివ్వం.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో భాజపా అభ్యర్థులకు తెరాస మద్దతిచ్చింది. ఓటింగ్‌కు హాజరైతే తెరాసకా లేక నోటాకా గురువారం నిర్ణయిస్తాం' అని ఓ ఎమ్మెల్యే తెలిపారు.

ఫేస్‌బుక్‌కు భారత్ హెచ్చరిక

దిల్లీ, వాషింగ్టన్, న్యూయార్క్: ఎన్నికల ప్రక్రియల్లో అక్రమ మార్గాల ద్వారా జోక్యం చేసుకుంటే సహించబోమని దిగ్గజ సోషల్ మీడియా వేదిక ఫేస్‌బుక్‌ను భారత్ గట్టిగా హెచ్చరించింది. కఠిన చర్యలు తీసుకునేందుకూ వెనుకాడబోమనీ తెలిపింది. అవసరమైతే ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కూ సమన్లు పంపుతామని స్పష్టీకరించింది. ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని అమెరికా సహా పలు దేశాల్లో ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బ్రిటన్ సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా'' ఉపయోగించుకుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రకంపనలు భారత్‌లోనూ కనిపించాయి. కేంబ్రిడ్జ్ అనలిటికా సేవలను ఉపయోగించుకున్నారంటూ భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలు గుప్పించుకున్నాయి. ఈ అంశంపై పార్లమెంటు భవన సముదాయంలో ఐటీ, న్యాయ శాఖల మంత్రి రవి శంకర్‌ప్రసాద్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'ఓ విషయాన్ని చాలా స్పష్టంగా చెబుతున్నా. పత్రికా, భావప్రకటన స్వేచ్ఛలకు మేం పూర్తిగా మద్దతు పలుకుతున్నాం. సామాజిక అనుసంధాన వేదికలపై స్వేచ్ఛగా ఆలోచనలు పంచుకోవడంలోనూ ఎలాంటి అభ్యంతరాలూలేవు. అయితే.. భారత ఎన్నికల ప్రక్రియలను అక్రమ మార్గాల్లో ప్రభావితంచేసేందుకు ఫేస్‌బుక్ సహా ఏ సామాజిక అనుసంధాన వేదిక ప్రయత్నించినా సహించేదిలేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. "జుకెర్‌బర్గ్ ఓ విషయం గుర్తుపెట్టుకో. ఫేస్‌బుక్‌కు మేం స్వాగతం పలుకుతున్నాం. అయితే ఏమైనా సమాచార దుర్వినియోగం జరిగినట్లు తేలితే.. ఊరుకోబోం. ఐటీ చట్టం కింద సమన్లు జారీచేసేందుకూ వెనకాడం'అని ఆయన హెచ్చరించారు.

'రాహుల్‌ను పైకి ఎత్తేందుకే...'

కేంబ్రిడ్జ్ అనలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధముందని రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. '2019 సార్వత్రిక ఎన్నికల్లో అనలిటికా సేవలు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధంచేసింది. సమాచారాన్ని దుర్వినియోగంచేస్తూ ఓటర్లకు ఎర వేయాలని అనుకుంది. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి సామాజిక అనుసంధాన వేదికల్లో ప్రాచుర్యం పెంచేందుకు ఈ సంస్థపైనే ఆధారపడాలని భావించింది. శృంగారం, అవినీతి, నకిలీ వార్తలను ఎరగావేసి ఎన్నికలను ప్రభావితం చేసేందుకు అనలిటికా ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ కూడా అదే బాటలో నడవాలనుకుంటోందా?'అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. అంతేకాదు అనలిటికా మాజీ సీఈవో అలెగ్జాండెర్ నిక్స్‌ను రాహుల్ ఎన్నిసార్లు కలిశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వీటిపై రాహుల్ స్పందించాలని పట్టుబట్టారు.

భాజపానే ఉపయోగించుకుంది: కాంగ్రెస్

భాజపా విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. అనలిటికా సేవలను కమలనాథులే ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తింది. బిహార్, గుజరాత్, హరియాణా, ఝార్ఖండ్, మహారాష్ట్రలతోపాటు మరికొన్ని రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఈ సంస్థ సాయం తీసుకున్నారని ఆరోపించింది. అంతేకాదు భాజపా ప్రతిష్ఠాత్మక "మిషన్ 272 ప్లస్'' లక్ష్యం వెనకున్నదీ ఈ సంస్థేనని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై పార్టీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా మాట్లాడారు. తాము ఎప్పుడూ అనలిటికాతో కలిసి పనిచేయలేదని నొక్కిచెప్పారు. అంతేకాదు భారతీయ సంస్థ ఒవెలినా బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఓబీఐ) సంస్థతో అనలిటికాకు సంబంధముందని చెప్పారు. ఓబీఐ సేవలను 2009లో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలన్నింటినీ భాజపా ఐటీసెల్ విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఖండించారు.

కనిష్క్ కుచ్చు టోపీ

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. సహవ్యవస్థకు నేతృత్వం వహించిన ఎస్‌బీఐ చివరకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని ఆశ్రయించింది. ఎస్‌బీఐ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీబీఐ బుధవారం ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, నిందితుల నివాసాల్లో సోదాలను ప్రారంభించింది. దర్యాప్తు సంస్థ తన ఎఫ్ఐఆర్‌లో కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ ప్రమోటర్ డైరెక్టర్ భూపేష్‌కుమార్ జైన్, డైరెక్టర్ నీతాజైన్, తేజ్‌రాజ్ అచ్చా, అజయ్‌కుమార్ జైన్, సుమిత్ కేడియా, గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులను నిందితులుగా పేర్కొంది. చెన్నైకి చెందిన కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బంగారు ఆభరణాలను తయారుచేసి 'క్రిజ్' బ్రాండ్ పేరుతో 2014 వరకూ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా విక్రయించేది. 2015 నుంచి వ్యాపార సరళిని మార్చుకుని పెద్ద పెద్ద దుకాణాల వారికి ఆభరణాలను సరఫరా చేయటం ప్రారంభించిందని ఎస్‌బీఐ ఫిర్యాదులో పేర్కొంది. 2008లో ఆ సంస్థ రుణఖాతాలన్నీ ఐసీఐసీఐ బ్యాంకు నుంచి ఎస్‌బీఐకి మళ్లాయి. ఆ తర్వాత ఎస్‌బీఐ నేతృత్వంలోని 14బ్యాంకుల సహవ్యవస్థ కనిష్క్ యాజమాన్యానికి రుణాలిస్తూ వచ్చాయి. 2017 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ.824.15కోట్లుగా తేలింది. వడ్డీతో కలిపి రూ.1000 కోట్లకు చేరి ఉండవచ్చని అంచనా. బ్యాంకు రుణాలద్వారా సమకూరిన డబ్బును కనిష్క్ యజమాన్యం దారి మళ్లించినట్లు తెలుస్తోంది.

మోసపోయామని తెలుసుకుందిలా...

తన వ్యాపారాల కోసం కనిష్క్ సంస్థ 2007 నుంచే బ్యాంకుల నుంచి దఫదఫాలుగా రుణాలను తీసుకొంటోంది. అయితే, 2017 నవంబరు 11న ఎస్‌బీఐ తొలుత కనిష్క్ మోసం గురించి ఆర్‌బీఐకి తెలిపింది. ఆ తర్వాత రెండు నెలలకు సహవ్యవస్థలోని బ్యాంకులన్నీ ఆ విషయాన్ని ఆర్‌బీఐకి వెల్లడించాయి. 2017 మార్చిలో కనిష్క్ 8 బ్యాంకులకు వడ్డీల చెల్లింపులో బకాయిపడింది. ఆ మరుసటి నెలలోనే సహవ్యవస్థలోని 14 బ్యాంకులకూ రుణాల చెల్లింపులను నిలిపివేసింది. ఆ తర్వాత సంస్థ యాజమాన్యం బ్యాంకులకు అందుబాటులో లేకుండా పోయింది. 2017 మే 25న కనిష్క్ కార్పొరేట్ కార్యాలయం, ఆభరణాల తయారీ కర్మాగారం, షోరూమ్‌లకు వెళ్లిన బ్యాంకర్లకు అవన్నీ తాళాలు బిగించి, మూతపడిన స్థితిలో దర్శనమిచ్చాయి. అన్ని బ్యాంకుల్లో కలిపి మొత్తం రూ.824.15 కోట్ల మేర మోసం జరిగిందని, అయితే, 156.65 కోట్లకు సమానమైన పూచీ/హామీలు మాత్రమే బ్యాంకు వద్ద ఉన్నాయని ఎస్‌బీఐ పేర్కొంది.

కనిష్క్‌కు రుణాలిచ్చిన బ్యాంకులు..

బ్యాంకు	రుణం (రూ.కోట్లలో)
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా	215
పంజాబ్ నేషనల్ బ్యాంక్	115
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	50
సిండికేట్ బ్యాంక్	50
బ్యాంక్ ఆఫ్ ఇండియా	45
ఐడీబీఐ బ్యాంక్	45
యూకో బ్యాంక్	40
తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్	37
ఆంధ్రా బ్యాంక్	30
బ్యాంక్ ఆఫ్ బరోడా	30
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	25
ఐసీఐసీఐ బ్యాంక్	25
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	20
కార్పొరేషన్ బ్యాంక్	20

హైదరాబాద్‌షా



- దేశంలోనే నాణ్యమైన జీవనానికి అత్యం అనువైన నగరం

ఈనాడు, హైదరాబాద్: దేశంలో నాణ్యమైన జీవనానికి అనువైన నగరాలుగా హైదరాబాద్, పుణెలు మొదటి స్థానంలో నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ నగరాల్లో పరిస్థితులను అధ్యయనం చేసిన మెర్సర్స్ సంస్థ మన దేశంలో హైదరాబాద్, పుణెలకు మొదటి స్థానాన్ని ఇచ్చింది. వరుసగా నాలుగో ఏడాది కూడా హైదరాబాద్ ఈ సర్వేలో ప్రథమ స్థానం దక్కించుకోవడం విశేషం. తక్కువ నేరాల రేటు, వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌ను ప్రథమ స్థానంలో నిలపగా.. చక్కటి గృహవసతి, వినియోగదారుల వస్తువుల లభ్యత వంటి అంశాల్లో పుణె ముందుంది. హైదరాబాద్, పుణెలు కొత్త టెక్నాలజీ హబ్‌లుగా గుర్తింపు పొందాయి. వీటి తర్వాత స్థానాల్లో బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా, దిల్లీ ఉన్నాయి. ప్రపంచ ర్యాంకింగ్‌లో ఆస్ట్రియా రాజధాని వియన్నా ప్రథమ స్థానం సాధించింది. హైదరాబాద్, పుణె 142వ స్థానంలో, బెంగళూరు 149, చెన్నై 151, ముంబై 154, కోల్‌కతా 160, దిల్లీ 162 స్థానాల్లో నిలిచాయని మెర్సర్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. పారిశుద్ధ్యానికి సంబంధించిన ర్యాంకింగ్లో దేశంలో బెంగళూరుకు మొదటి స్థానం దక్కింది. చెన్నై, పుణె, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, దిల్లీ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

కోటాపై ప్రకటన చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

డిమాండే చేస్తున్నామని కేంద్రమంత్రి గడ్కరీకి ఎంపీలు తెలిపారు. అనంతరం సీతారాం నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీలు వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ... మా హక్కుల కోసమే పోరాడుతున్నామని.. హామీలు అమలయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు పెంచుకొనే హక్కు రాష్ట్రాలకే ఉండాలన్నారు.

సిర్పూరు మిల్లుకు సిరి

(మొదటి పేజీ తరువాయి)

జేకే పేపర్స్ లిమిటెడ్ ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపసంఘం పలు దఫాల సమావేశమై మిల్లు పునరుద్ధరణకు అవసరమైన సాయం చేయాలని ప్రభుత్వానికి ఈ నెల 2న సిఫార్సు చేసింది. దీనికి 14న సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశం ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా భారీ పరిశ్రమల విభాగంలో కర్మాగారం పునరుద్ధరణ కోసం యాజమాన్య సంస్థకు వర్తించేలా సత్వర సాయాన్ని ప్రకటిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

ఇవీ రాయితీలు, ప్రోత్సాహకాలు

- పదేళ్లపాటు పూర్తిగా జీఎస్టీ మినహాయింపు
- మూలధన పెట్టుబడిలో 20 శాతం (రూ.50 కోట్ల పరిమితి) చెల్లింపు
- పదేళ్ల పాటు సుబాబాల్, యూకా కొనుగోళ్లలో రాయితీలు
- కొత్త పెట్టుబడులపై ఏటా 2 శాతం చొప్పున అయిదేళ్ల పాటు వడ్డీ చెల్లింపు
- కర్మాగారం ఉత్పత్తులు మార్కెట్ ధరపై ప్రభుత్వానికి సరఫరా చేయడానికి అనుమతి
- సంస్థ వ్యాపార కార్యకలాపాలపై స్టాంపు డ్యూటీ అన్ని రకాల పన్నుల మినహాయింపు
- పదేళ్లపాటు విద్యుత్ పన్ను రద్దు
- యూనిటుకు రూ.3 చొప్పున మూడేళ్ల పాటు విద్యుత్ రాయితీ.
- సంస్థ బకాయిలన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

స్వేచ్ఛ కావాలి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రాజకీయాల కోసం విమర్శలు చేయడం మానుకోవాలని.. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపించకూడదని సూచించారు. బుధవారం శాసనమండలిలో బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు.

రాష్ట్రాలకే వదిలేయాలి...

"గద్వాల జిల్లా గట్టు మండలంలోని ప్రాథమిక పాఠశాలతో కేంద్రానికి సంబంధమేంటి? వ్యవసాయం, ఆరోగ్య రంగాన్ని రాష్ట్రాలకే ఎందుకు వదిలిపెట్టరు? పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి పనులు చేయాల్సింది రాష్ట్రాలే. ఆయా పథకాలు అమలు చేసేందుకు రాష్ట్రాల్లో పూర్తిస్థాయి కేంద్ర అధికారులు ఎవరైనా ఉంటారా?. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు అయినా ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయాలన్న ఆలోచన చేయలేదు. రాజకీయాల కోసం ఏదైనా మాట్లాడవచ్చు. కానీ సభలో బాధ్యతతో వ్యవహరించాలి. బడ్జెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉండే స్పష్టంగా చెప్పాలి. వాటిని సరిచేసుకుంటాం. అంతేగానీ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకూడదు. రైతులు పెట్టుబడి సాయం కావాలని అడగలేదు. కానీ, మేమే వారికి ఎకరాకు రూ.8 వేలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో నిధులు పేర్కొన్నాం. తెలంగాణ ఆరోగ్య విధానం బాగుందని కేంద్ర అధికారులు అధ్యయనానికి వచ్చారు. తెలంగాణ నమూనా ఆరోగ్య పథకం అమలుకు సూచనలు చేస్తామని సీడీ తీసుకెళ్లారు. మంచిని అందరూ అభినందించాలి. ఉన్నదీ.. లేనిదీ.. ఒకే గాటన కట్టకూడదు. రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారంటూ తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లొద్దు. బెంగాల్‌లో ఏటా రూ.48 వేల కోట్లు అప్పులు చెల్లిస్తున్నామని అక్కడి సీఎం నాతో చెప్పారు.

ఆలోచనలు ఎన్నటికి మారేను..!

దేశానికి ఏటా దేవుడిస్తున్న నీళ్లు 70 వేల టీఎంసీలు. వ్యవసాయ భూమి దాదాపు 40 కోట్ల ఎకరాలుంది. 30 కోట్ల ఎకరాలకు నీటివసతి కల్పించినా.. 40 వేల టీఎంసీలు చాలు. కానీ, దేశంలో పడిన వర్షపు నీటిని సక్రమంగా వినియోగించుకోకపోవడంతో విలువైన నీటి వనరులు సముద్రం పాలవుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ దిశగా ఒక్క ఆలోచనా చేయలేదు. ఇన్నేళ్లు అవుతున్నా కావేరి సమస్య పరిష్కరించలేదు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఏర్పాటై 14 ఏళ్లు గడుస్తున్నా నిర్ణయాలు తీసుకోవడం లేదు. ఏమైనా అంటే కరవు వచ్చిందని, ఎడారిగా మారిపోతుందని అంటారు. నేటికీ చాలా గ్రామాల్లో తాగునీటి వసతిలేదు. చైనా దూరదృష్టి ఎలా ఉందంటే.. దక్షిణ చైనా నుంచి ఉత్తర చైనాకు 1600 టీఎంసీల నీటిని తీసుకెళ్లేందుకు పైపులైన్లు నిర్మించారు. ఈ ప్రాజెక్టు రెండేళ్ల క్రితమే పూర్తయింది. మన దేశంలో ప్రభుత్వాల ఆలోచనలు ఎన్నడు మారాలి? కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కేసులు వేసినా పట్టుదలతో ఎదుర్కొని అనుమతులు సాధించి ప్రాజెక్టును పూర్తిచేస్తున్నాము. జులై నాటికి దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. దేశంలో 70 వేల టీఎంసీలను సక్రమంగా వినియోగించుకుంటే వ్యవసాయానికి సాగునీరు, ప్రజలకు తాగు నీటిని ఇవ్వొచ్చు.

అభివృద్ధి బాగుంటేనే అప్పులొస్తాయి..

రాష్ట్రం నూతన విధానాలతో ముందుకు వెళ్తోంది. అందుకే 22 శాతం వృద్ధిరేటుతో ఉంది. కేంద్ర జీడీపీలో 49.50 శాతం అప్పులు ఉంటే... రాష్ట్ర జీఎస్‌డీపీలో ఆ వాటా 19 నుంచి 20 శాతం మాత్రమే. అభివృద్ధి, అప్పుల తిరిగి చెల్లింపు బాగుంటేనే అప్పులు వస్తాయి. నిర్ణీత గడువులోగా అప్పులను నూరుశాతం చెల్లిస్తున్నాము. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు క్రమశిక్షణ పాటిస్తున్నాము. అమెరికా ఆదాయం 14 ట్రిలియన్ డాలర్లు అయితే అప్పులు 14.5 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నాయి. జపాన్ ఆదాయంతో పోలిస్తే అప్పుల వాటా 250 శాతంగా ఉంది. చైనా కూడా అప్పులు చేసి మౌలిక సదుపాయాలపై ఖర్చుచేసింది. మన దేశంలో వాజ్‌పేయీ హయాంలో పేర్కొన్న రోడ్ల పనులు కూడా ఇంకా కొనసాగుతున్నాయి. మన దగ్గర ఒక లారీ వేగం సగటున గంటకు 26 కి.మీ. మాత్రమే. అభివృద్ధి ఇలా ఉంటే దేశం ఎన్నడు బాగుపడాలి" అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

10 నెలలు.. 20 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పనులు కలిపి యాభై శాతం వరకు పూర్తయ్యాయి. ఇక్కడ కూడా నాలుగు పంపులను జూన్ నాటికి అమర్చాలన్నది లక్ష్యం.

- మేడిగడ్డ బ్యారేజి నిర్మాణంలో 26.55 శాతం పని మాత్రమే జరిగింది. లిఫ్టు పని 37 శాతం అయ్యింది. లిఫ్టులో సివిల్ పనులు పూర్తయితే పంపులు, మోటార్లు అమర్చడమే ప్రధానం.
- మేడిగడ్డ లిఫ్టులో 11 పంపులకుగాను జూన్ నాటికి ఐదు, మిగిలినవి డిసెంబరుకల్లా అమర్చాలన్నది లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజి నిర్మాణం పూర్తికాకపోయినా పంపులు అమర్చడం, ఈ పంపుహౌస్ నుంచి అన్నారం బ్యారేజికి నీటిని మళ్లించే కాలువ పనిని పూర్తి చేస్తే కొంత నీరివ్వడానికి అవకాశం ఉంటుంది.
- ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు నీటిని తరలించే మూడు ప్యాకేజీల పనులను కూడా పూర్తి చేయాలి. మొదటి ప్యాకేజీలో ఏడు పంపులకుగాను జూన్ నాటికి నాలుగు, డిసెంబరు నాటికి అన్నింటినీ అమర్చాలన్నది లక్ష్యం. ఈ పని ప్రారంభమే కాలేదు. తర్వాత ప్యాకేజీలో ఉన్న సొరంగ మార్గం దాదాపు పూర్తయ్యింది. ఆ తర్వాత ప్యాకేజీలో కూడా 80 శాతం పూర్తయ్యింది. ఇప్పటికే రెండు మోటార్లు కూడా అమర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.
- మధ్యమానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు నీటిని మళ్లించే పనులు 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. అయితే రిజర్వాయర్లన్నీ ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. వచ్చే వర్షాకాలంలో నీటిని మళ్లించాలంటే కొన్ని పంపులైనా బిగించాల్సి ఉంటుంది.

మొత్తంగా నాలుగు నుంచి ఐదు నెలల గడువు మాత్రమే మిగిలింది. ఈలోగా పనులు పూర్తి చేయడం, అవసరమైన నిధులు సకాలంలో విడుదల చేయడం రెండూ సవాలుతో కూడుకున్నవే.

అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం ఈ ఏడాది చివరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్న పనుల వివరాలివీ..

పని	ఒప్పందం విలువ (రూ.కోట్లలో)	చేసిన పని విలువ (రూ.కోట్లలో)	పూర్తయిన పని శాతం
మేడిగడ్డ బ్యారేజి	2,008.96	535.45	26.55
మేడిగడ్డ ఎత్తిపోతల	3,174.22	1,168.77	36.82
అన్నారం బ్యారేజి	1,464.93	983.24	67.12
అన్నారం ఎత్తిపోతల	1,804.58	888	49.21
సుందిళ్ల బ్యారేజి	1,444.34	786.23	54.44
సుందిళ్ల ఎత్తిపోతల	2,051.19	822.96	40.12

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

కొండ ప్రాంతంలోకి పరుగులు తీస్తుండగా మంగళవారం రాత్రి భద్రతా సిబ్బంది వారిని మట్టుబెట్టారు. కాల్పులకు తెగబడిన మరో ఉగ్రవాదిని బుధవారం అంతమొందించినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన భద్రతా సిబ్బందికి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఘనంగా నివాళులర్పించారు.

గ్రహం అనుగ్రహం

22-3-2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
పంచమి: మ. 2-08 తదుపరి షష్ఠి
కృత్తిక నక్షత్రం: సా. 6-25 తదుపరి రోహిణి
అమృత ఘడియలు: సా. 4-06 నుంచి 5-38 వరకు
వర్జ్యం: ఉ. 6-54 నుంచి 8-26 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-07 నుంచి 10-55 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-43 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-07; సూర్యాస్తమయం: సా.6-07

మయన్మార్ అధ్యక్షుడు హితిన్ క్యా పదవికి రాజీనామా చేశారు. అధ్యక్ష విధులు, బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దేశ అధ్యక్ష కార్యాలయం ఫేస్‌బుక్‌వేదికగా దీన్ని ప్రకటించింది.

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా అసోంలో 58.7, పశ్చిమబెంగాల్‌లో 42.3, తెలంగాణలో 39.2, ఏపీలో 25.1 శాతం జరిగాయి. మొత్తమ్మీద 3.38 లక్షల నేరాలు నమోదవగా 3 శాతం వరకట్న నిరోధక చట్టం కింద ఉన్నాయి.

- మొత్తం కేసుల్లో 67 శాతమే విచారించి పరిష్కరించారు. కోర్టులో విచారణ ప్రారంభమైనవి 2.60 లక్షలుంటే వీటిలో 1.7 శాతానికే శిక్షలు పడ్డాయి. అత్యాచారం కేసుల్లో 3.1 శాతం నిందితులకు శిక్షలు పడ్డాయి. వరకట్నహత్యల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.
- దేశవ్యాప్తంగా 2016లో జరిగిన అత్యాచార ఘటనల్లో బాధితుల వయసును పరిశీలిస్తే.. 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్నవారు 42 శాతమున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ వయసువారిపైనే అధికంగా లైంగిక దాడులు జరిగాయి. తెలంగాణలో ఈ వయసు తరవాత 12-16 ఏళ్ల మధ్య ఉన్న బాలికలపై ఎక్కువగా అత్యాచారాలు జరిగాయి.

ఆత్మహత్యల్లో గృహిణులే అధికం

- దేశంలో ఆత్మహత్య చేసుకుంటున్న మహిళల్లో గృహిణులు అధికంగా 53, విద్యార్థినులు 10, రోజువారీ కూలీలు 8, స్వయం ఉపాధి పొందుతున్నవారు 5శాతమున్నారు.
- ఆత్మహత్య చేసుకుంటున్న పురుషుల్లో స్వయం ఉపాధి పొందేవారు 25, రోజువారీ కూలీలు 22, రైతులు 13, ఉద్యోగులు 10, నిరుద్యోగులు 10 వ్యాపారులు 9, విద్యార్థులు 5, ఇతరులు 26 శాతమున్నారు.


నారీ.. నీకేది దారి!

32 శాతం డిపాజిట్లు మహిళలవే...

- దేశంలో 2016 మార్చి నాటికి.. వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లలో 32 శాతం మహిళల పేరుతోనే ఉన్నాయి.
- బ్యాంకు ఉద్యోగుల్లో జాతీయ స్థాయిలో సగటున 22 శాతం మహిళలే.

గ్రామీణ మహిళలే వ్యాపారంలో ముందు...

- దేశవ్యాప్తంగా అన్ని రకాల వ్యాపార సంస్థల్లో గ్రామీణంలో 24 శాతం, పట్టణాల్లో 19 శాతమే మహిళలవి. అత్యధికంగా మణిపూర్ గ్రామాల్లో 82, పట్టణాల్లో 77 శాతం వ్యాపార సంస్థలను స్త్రీలే నడుపుతున్నారు.
- తెలంగాణలో 31 శాతం వ్యాపార సంస్థలు మహిళల అధీనంలో ఉన్నాయి. (పట్టణ ప్రాంతాల్లో 49, గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతం). ఏపీలో 27 శాతం వ్యాపార సంస్థలు మహిళలవి (గ్రామాల్లో 30, పట్టణాల్లో 21 శాతం). చాలా రాష్ట్రాలకన్నా తెలుగు రాష్ట్రాల్లో మహిళ నేతృత్వంలోని సంస్థలు తక్కువగా ఉండటం గమనార్హం.



పట్టణ ప్రాంత మహిళలకు ఉపాధి కరవు

- పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలకు ఉపాధి లభించడం లేదు. 2015-16 చివరికి దేశవ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వారిలో మహిళల్లో 5.8, పురుషుల్లో 3 శాతం నిరుద్యోగులున్నారు.
- నిరుద్యోగిత శాతంలో జాతీయ స్థాయి పట్టణ ప్రాంతాల సగటుకన్నా తెలంగాణలో అధికంగా ఉంది. తెలంగాణ పట్టణ మహిళల్లో 14.5%, పురుషుల్లో 3.1% నిరుద్యోగులున్నారు. ఏపీలో గ్రామీణ పురుషుల్లో (3.5%) మాత్రమే జాతీయస్థాయికన్నా ఎక్కువగా నిరుద్యోగులున్నారు.
- కుటుంబ నియంత్రణ పాటిస్తున్న మహిళల జాతీయ సగటు 53.5% అత్యధికంగా పంజాబ్‌లో 75.8 శాతం.
- 2015-16లో ప్రాథమిక పాఠశాలల్లో చేరిన పిల్లలు జాతీయస్థాయిలో 99.2 శాతముంటే అతి తక్కువగా ఏపీలో 84.5 శాతమున్నారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	40.0	26.0
హన్మకొండ	40.0	23.5
ఆదిలాబాద్	39.0	19.1
కరీంనగర్	38.8	23.0
మెదక్	38.4	21.1
నిజామాబాద్	38.0	33.0
రామగుండం	38.0	21.4
మహబూబ్‌నగర్	37.9	26.0
సూర్యాపేట	36.0	26.0
ఖమ్మం	36.0	23.0

ఉద్యోగ నైపుణ్యం..ఇంజినీరింగ్‌లోనే అధికం

- 52 శాతంతో ప్రథమ స్థానం
- ఫార్మసీలోనూ పెరుగుతున్న నైపుణ్యాలు
- ఎంబీఏలో మాత్రం గతేడు కంటే 3 శాతం తగ్గుదల
- భారత నైపుణ్య నివేదిక-2018లో వెల్లడి

ఈనాడు-హైదరాబాద్: ఇతర కోర్సుల అభ్యర్థుల కంటే ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారిలోనే ఉద్యోగ నైపుణ్యం అధికం. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 52 శాతం మందికి ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు ఉన్నాయి. భారత నైపుణ్య నివేదిక-2018(ఐఎస్ఆర్) తేల్చిచెప్పిన వాస్తవమిది. ఒక వైపు ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత కొరవడుతుందని, ఉద్యోగానికి కావాల్సిన అర్హతలు 30 శాతం బీటెక్ అభ్యర్థుల్లో మాత్రమే ఉంటున్నాయని నాస్కామ్ తదితర పలు సంస్థలు చెబుతుండగా.. ఐఎస్ఆర్ 2018 నివేదిక మాత్రం నైపుణ్యంలో వారే ముందంజలో ఉన్నారని చెబుతుండటం గమనార్హం. అఖిల భారత సాంకేతిక విద్యామండలి, భారత పరిశ్రమల సమాఖ్య, పీపుల్స్ స్ట్రాంగ్, వీబాక్స్, యూఎన్‌డీపీ, భారత విశ్వవిద్యాలయాల సంఘం(ఏఐయూ), పియర్‌సన్ సంస్థలు సంయుక్తంగా భారత నైపుణ్య నివేదిక-2018ను రూపొందించాయి. ఇందులో భాగంగా వీబాక్స్ ఉద్యోగ నైపుణ్య పరీక్ష(వెస్ట్) పేరిట దేశవ్యాప్తంగా వివిధ రకాల కోర్సులను అభ్యర్థిస్తున్న 5.10 లక్షల మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. అందులో 29 రాష్ట్రాల్లోని 5,200 విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులున్నాయి. 13 రంగాలకు చెందిన 130 పరిశ్రమలు పాల్గొన్న ఇండియా హైరింగ్ ఇంటెంట్ సర్వే అంశాలనూ పరిగణనలోకి తీసుకున్నారు. దీని ఆధారంగా రూపొందించిన నివేదికను తాజాగా కేంద్రం విడుదల చేసింది. ఆ ప్రకారం 52 శాతం మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు ఉన్నట్లు తేలింది. ఇది మిగిలిన కోర్సులు పూర్తి చేసిన వారి కంటే అధికం. ఫార్మసీ విద్యార్థుల్లోనూ నైపుణ్యం పెరుగుతోంది. ఎంబీఏలో మాత్రం 2017 కంటే 3 శాతం తగ్గినట్లు తెలిపింది. మొత్తంమీద గత ఐదేళ్లలో ఉద్యోగ నైపుణ్యం 34 శాతం నుంచి 45 శాతానికి పెరిగినట్లు తేల్చింది.

దిల్లీకి మొదటి స్థానం

ఈ నివేదిక ప్రకారం గతేడు కంటే అన్ని రాష్ట్రాల ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యం పెరగగా.. అందులో దిల్లీ మొదటి స్థానంలో నిలిచింది. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పెరగడానికి కారణం గత కొద్ది సంవత్సరాలుగా ఏఐసీటీఈ తీసుకుంటున్న చర్యలేనని కేంద్ర మానవ వనరుల శాఖ వెల్లడించింది. పాఠ్య ప్రణాళికలో మార్పులు చేయడం, ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి చేయడం, అధ్యాపకులకు శిక్షణ, పరిశ్రమలకు తగినట్లు శిక్షణ ఇవ్వడం తదితర కారణాలు ఉన్నాయని పేర్కొంది.

డప్పు-చెప్పు వృత్తిదారులకు పింఛనుపై సమావేశం

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛను సౌకర్యంపై బుధవారం శాసనసభా కమిటీ హాలులో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నేతలు వంగపల్లి శ్రీనివాస్, సుంకపాకదేవయ్య, యాతాకుల భాస్కర్, మేడి పాపయ్య, రేగుంట సునీల్, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. డప్పు- చెప్పు వృత్తిదారులకు పింఛను అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

ఏఐఈపీఎఫ్ఎస్ఎఫ్ చీఫ్ ప్యాట్రన్‌గా ఎంపీ వినోద్‌కుమార్

ఈనాడు, దిల్లీ: ఆల్ ఇండియా ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ స్టాఫ్ ఫెడరేషన్ (ఏఐఈపీఎఫ్ఎస్ఎఫ్) చీఫ్ ప్యాట్రన్‌గా తెరాస ఎంపీ వినోద్‌కుమార్ ఎంపికయ్యారు. బుధవారమిక్కడ 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి హాజరైన ఈపీఎఫ్ ఉద్యోగులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా వినోద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్ హాజరయ్యారు. కేంద్ర కార్మికశాఖ నూతనంగా ప్రవేశపెట్టనున్న లేబర్‌కోడ్ అమలు విధానంపై కేంద్రమంత్రితో చర్చించారు. తొలి కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేసినట్లు వినోద్ తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడిగా రమణ్‌పాండే, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మోహన్ కుమార్, సెక్రటరీ జనరల్‌గా రాంబాబు, ప్యాట్రన్‌గా రాంకిషోర్ త్రిపాఠి, సలహాదారుగా రాజేశ్‌కుమార్ శుక్లాలను ఎన్నుకున్నారు.



దిల్లీలో ఈపీఎఫ్ సిబ్బంది సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వినోద్

వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు

ఇద్దరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మరో పదిహేను నిమిషాలలో గమ్యస్థానానికి చేరుకోనుండగా వారిని విధి వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న కారు వ్యవసాయ బావిలోకి దూసుకుపోవడంతో ఇద్దరు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ గణేషనగర్‌కు చెందిన సుధాకర్ తన కోడలు భవాని, మనవడు వివాన్, మనవరాలు సాన్విలతో కలిసి మారుతీ ఆల్టో కారులో కోడలు స్వగ్రామమైన శంకరపట్నం మండలం తాడికల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలోనే వీరి కారు కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై హుజూరాబాద్ మండలం సింగాపూర్ సమీపంలోకి చేరుకోగానే ఒకేవైపుగా ముందుకు దూసుకెళ్లి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎదురుగట్ల సుధాకర్(70), వివాన్(5)లు అక్కడికక్కడే మృతి చెందగా భవాని(27), సాన్వి(3)లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో కారులో ఉన్నవారిని తాళ్ల సహాయంతో బయటకు తీశారు. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుధాకర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ సహాయకులుగా పని చేసి పదవీ విరమణ పొందినట్లు తెలిపారు.



క్రేన్ సహాయంతో బావిలో నుంచి బయటకు తీస్తున్న కారు

ప్లాస్టిక్ రహిత ప్రణాళిక

- సీసాలతో ప్రవేశిస్తే రూ.20.. వెళ్లేటప్పుడు ఇస్తే సొమ్ము వాపస్
- తెలంగాణ అటవీశాఖ నిర్ణయం

ఈనాడు-హైదరాబాద్: అర్బన్ పార్కులు, జలపాతాలు, ఇతర అటవీప్రాంతాలను దశల వారీగా ప్లాస్టిక్ రహితంగా మార్చాలని తెలంగాణ అటవీశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్లాస్టిక్ సీసాలతో ప్రవేశించే వారి నుంచి రూ.20 వసూలుచేసి..తిరిగి వెళ్లేటప్పుడు వాటిని ఇస్తే నగదు చెల్లించే నిబంధన అమలు చేయాలని నిర్ణయించింది. ఈవిధానం ఇప్పటికే కేరళలో అమల్లో ఉండగా..దీన్ని ఇక్కడా వర్తింపజేయాలని ప్రపంచ అటవీ దినోత్సవం(మార్చి 21) సందర్భంగా తెలంగాణ అటవీశాఖ నిర్ణయం తీసుకుంది. తొలిదశలో హైదరాబాద్‌లోని పట్టణ ఉద్యానవనాల్లో దీన్ని అమలుచేయనున్నారు. సిబ్బంది, ఇతర సౌకర్యాల్ని దృష్టిలోపెట్టుకుని దశలవారీగా అన్ని ఉద్యానవనాలకూ విస్తరిస్తామని పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు. మరోవైపు హైదరాబాద్ శివారు కండ్లకోయ పట్టణ అటవీపార్కులో పక్షుల కేంద్రం పనుల ప్రారంభం అనంతరం అటవీశాఖ మంత్రి జోగు రామన్న అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ప్లాస్టిక్ వల్ల కలుగుతున్న అనర్థాలు, పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పుపై చర్చించారు.



నీటి కోసం.. బండెడు కష్టాలు

తాగు నీరు దొరకడం రోజురోజుకూ గగనమవుతోంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నం వాసులకు నీటి కష్టాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామంలోని బోర్లు అన్నీ ఎండిపోవడంతో గత్యంతరం లేక.. నీటి కోసం 4 కి.మీ. దూరం గాయిద్‌పల్లిలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు ఎడ్ల బండ్ల మీద డ్రమ్ములతో వెళ్తున్నారు. రోజువారీ అవసరాలకు రెండు సార్లు బావివద్దకు వెళ్లాల్సిందే. అన్ని పనులు మానుకొని నిత్యం నీటి కోసమే పోరాడాల్సిన పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు.

-ఈనాడు, ఆదిలాబాద్

రెండోరోజూ తెరాస నమూనా పోలింగ్

రాజ్యసభ ఎన్నికలపై నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఎమ్మెల్యేల కోసం బుధవారం రెండోరోజూ నమూనా పోలింగ్‌ను నిర్వహించింది. శాసనసభా ప్రాంగణంలోని తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో దీనిని నిర్వహించారు. శాసనసభ సమావేశం ముగిసిన వెంటనే మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యాలయానికి వచ్చి నమూనా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఎమ్మెల్యేలకు జాగ్రత్తలు సూచించారు. పార్టీ అభ్యర్థులు జోగినపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్ హాజరయ్యారు.

నేడు తెలంగాణభవన్‌లో...: రాజ్యసభ ఎన్నికల కోసం మూడోరోజు గురువారం సైతం నమూనా పోలింగ్ నిర్వహించాలని తెరాస నిర్ణయించింది. తెలంగాణభవన్‌లో ఇది జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనికి హాజరయ్యే ఎమ్మెల్యేలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది.

సాగర్ కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ కుడి కాల్వకు అధికారులు బుధవారం నీటి విడుదలను నిలిపివేశారు. ఎన్నెస్పీ సీఈ సునీల్ మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల నిమిత్తం కుడికాల్వకు కృష్ణా బోర్డు 7 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించగా, వాటిని అవసరం ఉన్నప్పుడు వాడుకుంటామని ఏపీప్రభుత్వం తెలియజేయడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు చెప్పారు. ఎడమకాల్వకు యథావిధిగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కుడికాల్వకు ఈనెల ఒకటినుంచి నీటి విడుదల ప్రారంభించారు. బుధవారానికి సాగర్ జలాశయానికి 17,093 క్యూసెక్కుల నీరు వస్తుండగా మట్టం 522.20 అడుగుల వద్ద ఉన్నట్లు సీఈ తెలిపారు.

ఈనాడు

చట్టం స్ఫూర్తికి ఎత్తుపీట


దేశంలో హక్కుల ఉల్లంఘన జరుగుతూ ఉంటే తాను మౌన ప్రేక్షక పాత్రకు పరిమితం కాలేనన్న సర్వోన్నత న్యాయస్థానం తాజా వ్యాఖ్యలు- సదుద్దేశంతో రూపొందిన చట్టం దురుపయోగం కావడం పట్ల ధర్మాగ్రహాన్ని ప్రస్ఫుటీకరిస్తున్నాయి. షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం కింద తప్పుడు కేసులు జోరెత్తుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, సుప్రీం ధర్మాసనం కీలక ఉత్తర్వుల జారీకి తెరతీసింది. బాంబే హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుభాష్ కాశీనాథ్ మహాజన్ అనే ప్రభుత్వ ఉద్యోగి వేసిన అప్పీలు విచారణలో ధర్మాసనం పలు చేదు నిజాల్ని ధ్రువీకరించింది. ఈ చట్టం కింద ఎందరో అమాయకులు నిందితులుగా నిలవాల్సి వస్తోందని, విధి నిర్వహణలో ప్రభుత్వ సేవకులూ బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్న కోర్టు మాటల్లో- 'వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి, వేధింపులకు గురిచేయడానికి శాసననిర్మాణం జరగలేదు'! పుట్టుకను హేళన చేస్తూ తమను అవమానించారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే తొలుత ప్రాథమిక దర్యాప్తు చేపట్టాలని, నిర్ణీత పద్ధతిలో ముందస్తు అనుమతులతోనే అరెస్టులు చేయాలని ధర్మాసనం కొత్తగా గిరిగీసింది. కేసు ఉద్దేశపూర్వకంగా బనాయించినదని న్యాయమూర్తి భావించిన పక్షంలో ముందస్తు బెయిలు ఇవ్వగల వెసులుబాటునూ కల్పించింది. వెరసి, ఇకమీదట- ఎస్సీ ఎస్టీ చట్టం కింద ఎకాయెకి అరెస్టులు కుదరవన్నది ధర్మాసనం 89 పేజీల ఉత్తర్వుల సారాంశం. ఎస్సీ ఎస్టీలను ఫోనులో దూషించినా నేరమేనని, అందుకు గరిష్ఠంగా అయిదేళ్ల కారాగారం తప్పదని నాలుగు నెలల క్రితం ఇదే సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. దళితులూ గిరిజనులపై మౌఖిక, భౌతిక దాడుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్న న్యాయస్థానమే నేడా చట్టం కింద అమాయకులు వేధింపులకు గురికారాదన్న మానవీయ భావనకు ఎత్తుపీట వేసింది. తద్వారా, సమవర్తి పాత్రను సమర్థంగా పోషించినట్లయింది!

చట్టం దృష్టిలో సమానత్వాన్ని గాని, శాసనాలు ప్రసాదించే సమాన రక్షణను గాని ఏ పౌరుడికీ నిరాకరించరాదని భారత రాజ్యాంగంలోని పద్నాలుగో అధికరణ నిర్దేశిస్తోంది. దేశ పౌరులందరికీ సమానంగా న్యాయం సమకూరడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆదేశిక సూత్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. ఆ స్ఫూర్తి నుంచి ఆవిర్భవించిన 1989నాటి ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపై గురుతర బాధ్యత మోపింది. అణగారిన వర్గాలకు గౌరవప్రద జీవనం కల్పించే లక్ష్యంతో తెచ్చిన చట్టం క్రమేపీ రాజకీయ కక్ష సాధింపు పరికరంగా దిగజారడం దురదృష్టకరం. ధర్మాసనం ఉటంకించిన జాతీయ నేర రికార్డుల సంస్థ (ఎన్‌సీఈఆర్‌బీ) గణాంకాలు, క్షేత్రస్థాయి అవ్యవస్థను సూచిస్తున్నాయి. ఎస్సీ ఎస్టీ చట్టం కింద 2015లో నమోదైనవాటిలో 15-16 శాతం తప్పుడు ఫిర్యాదులేనన్న యథార్థం నివ్వెరపరుస్తోంది. కోర్టుల పరిశీలనకు వచ్చిన కేసుల్లో 75 శాతం మేర నీరుకారిపోతున్నాయి. 2013-15 మధ్య ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ్ బంగ వంటిచోట్ల ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదైన కేసులలో నేరనిర్ధారణ 10 శాతం లోపేనని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తప్పుడు కేసుల ఉరవడి కళ్లకు కడుతున్నా చట్ట నిబంధనల్ని సవరించే యోచనేదీ లేదని అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్ సింగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నెల్లాళ్ల క్రితం సుప్రీంకోర్టుకు నివేదించింది. ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛగా జీవించే హక్కుందని, ఏ కారణంగానైనా ఎవరూ దాన్ని కోల్పోవడం సహించరానిదంటున్న సుప్రీం ధర్మాసనం మానవీయ సంస్కరణల స్ఫూర్తికి- తమవంతుగా ప్రభుత్వాలిప్పుడు గొడుగు పట్టాల్సి ఉంది!

దుర్వినియోగం ఎంత నిజమో, అసలు అటువంటి కఠిన నిబంధనలతో కూడిన చట్టం పుట్టుకకు కారణమైన అమానుష సామాజిక దమనకాండ అంతకన్నా బాధాకర వాస్తవం. దళితులపై దాడులు పెరుగుతున్నాయని, సకాలంలో కేసులు నమోదు కావడం లేదని జాతీయ ఎస్సీ కమిషన్ ఇటీవలే తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. సామాజిక, ఆర్థిక బహిష్కరణ, కులం పేరుతో దూషణ, శిరోముండనం, మీసాలు తొలగింపు, మెడలో చెప్పులతో ఊరేగింపు... తదితరాల్ని నేరాలుగా పేర్కొంటూ 2015లో సవరణలు చేపట్టాల్సి రావడం- కొనసాగుతున్న వివక్షకు, అగని వేధింపులకు ప్రబల దృష్టాంతం. నిరుడు మధ్యప్రదేశ్‌లో దళితుల మంచినీటి బావిలో కిరోసిన్ కలిపిన ఘటన, తెలుగు గడ్డపైనే వాకపల్లి ఉదంతం వంటివి దళితులు గిరిజనులపై హింసాదౌర్జన్యాలది అంతులేని కథగా నిరూపిస్తున్నాయి. ఎస్సీ ఎస్టీల రాజ్యాంగబద్ధ హక్కుల్ని నూరుశాతం మేర పరిరక్షించగలిగితేనే అందరూ సమానులమన్న సుందర భావన సాకారమవుతుంది. అందుకోసం- వేధింపులు, దాడులకు గురైన బాధితులందరికీ ఆర్థిక, సామాజిక పునరావాసం కల్పించడంతోపాటు ప్రత్యేక ఉప ప్రణాళికల అమలుకూ ప్రభుత్వాలు నిబద్ధత చాటాలి. విద్య, వైద్య రంగాల్లో బడుగుజన పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మానవాభివృద్ధి సూచీల్లో [illegible]కలు- ఆదేశిక సూత్రాల అమలుకు పెద్దపీట వేయడంలో ప్రభుత్వాల వరస వైఫల్యాలనే బోనెక్కిస్తున్నాయి. నిమ్నవర్గాల ప్రయోజనాల్ని కంటికి రెప్పలా కాపాడుకునే క్రమంలో ఏ దశలోనూ కులం అడ్డుగోడ కారాదని, కక్షలూ వేధింపులకు తావుండరాదన్న సువిశాల దృక్పథం సర్వోన్నత న్యాయస్థానం తాజా స్పందనలో ఉట్టిపడుతోంది. ప్రభుత్వాల వాస్తవిక కార్యాచరణ తదనుగుణంగా రాటుతేలితే, రాజ్యాంగ నిర్మాతలు అభిలషించిన సమన్యాయం సాకారమయ్యేందుకు బాటలు పడతాయి!



తరుగుతున్న జలం తల్లడిల్లుతున్న జనం



వెలుకూరి వీరయ్య


ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది నిర్వహించే ప్రపంచ జల దినోత్సవానికి 'నీటి సమస్యకు ప్రకృతి సిద్ధమైన పరిష్కారం' అనే ఇతివృత్తాన్ని ప్రకటించింది. 21వ శతాబ్దంలో ప్రపంచ దేశాలు నీటిసవాళ్లను ఎలా ఎదుర్కోవాలో చర్చించి, పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా జలసంరక్షణ, అభివృద్ధి, పొదుపుగా వినియోగం తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలి. మారిన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ సురక్షితమైన నీరు అందించటం అసాధ్యమవుతోంది. 'సమ్మిళిత అభివృద్ధి కోసం జలాలు' నినాదంతో 2018 నుంచి 2028 వరకు పదేళ్లపాటు నీటి నిర్వహణ తీరుతెన్నులకు ప్రాధాన్యం ఇవ్వాలని 2016 డిసెంబరులో ఐరాస నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 67 కోట్లకు పైగా ప్రజలకు తాగటానికి, గృహావసరాలకు సురక్షితమైన నీరు లభించడం లేదు. గత్యంతరం లేక వీరు కలుషిత నీటిని వాడి రోగాల బారిన పడుతున్నారు.

తగ్గుతున్న నీటి లభ్యత

భూతలంపై సుమారు 70 శాతం సముద్రాలు, నదుల రూపంలో నీరు ఆవరించి ఉంది. భూమిపై సుమారు 140 కోట్ల ఘన కిలోమీటర్ల నీటి పరిమాణం ఉన్నట్లు అంచనా. ఇంత పెద్ద మొత్తంలో నీరు ఉన్నప్పటికీ, తాగడానికి గుక్కెడు నీటి కోసం ప్రజలు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. భూతలంపైగల మొత్తం 140 కోట్ల ఘన కిలోమీటర్ల నీటి పరిమాణంలో 97.3 శాతం (136.2 కోట్ల ఘన కిలోమీటర్లు) సముద్రాల ఉప్పునీటి రూపంలో ఉంది. మిగిలిన 2.7 శాతం (3.8 కోట్ల ఘ. కి.మీటర్లు) మంచినీటిలో అధికభాగం ధ్రువప్రాంతాల్లో మంచు రూపంలో గడ్డకట్టుకొని నిరుపయోగంగా ఉంది. మంచినీటిలో కేవలం ఒక్క శాతం అంటే 38 లక్షల ఘన కిలోమీటర్ల నీరు మాత్రమే మానవాళి వినియోగానికి అందుబాటులో ఉంది. ఈ కొద్దినీరైనా సమానంగా అందితే అది జనాభా అవసరాలకు సరిపోతుంది. కానీ నీటి లభ్యత దేశాల మధ్య, ప్రాంతాల మధ్య మారుతుండటం వల్ల సమస్య జటిలమవుతోంది. దేశంలో భూతలంపై గల సగటు వార్షిక జల లభ్యతను (నదీ జలాలను) 1,86,900 కోట్ల ఘన మీటర్లుగా అంచనా వేశారు. రుతుపవన ఆధారిత వాతావరణం, స్థలాకృతి, భూవిజ్ఞాన సంబంధిత పరిమితుల వల్ల ఏటా 69,000 కోట్ల ఘనమీటర్ల నీరు మాత్రమే జలాశయాల్లో నిల్వ చేయవచ్చునని నిర్ధారించారు. దీనికి అదనంగా 432 ఘన మీటర్ల భూగర్భజలం సైతం అందుబాటులో ఉంది. దేశంలో అందుబాటులో ఉండే భూతల, భూగర్భ జలాల మొత్తం పరిమాణం 1,12,200 (69,000+43,200) కోట్ల ఘనమీటర్లు.

దేశంలో భూతల ప్రవాహ రూపంలో ఉన్న 1,869 ఘన కిలోమీటర్లు దాదాపు స్థిరమైన పరిమాణమనే చెప్పాలి. 1951లో జనాభా 36.11 కోట్లుగా ఉన్నప్పుడు, సగటు తలసరి నీటి లభ్యత 5,176 ఘనమీటర్లు. 2017 నాటికి జనాభా 135.3 కోట్లకు పెరిగి తలసరి నీటిలభ్యత 1,382 ఘనమీటర్లకు తగ్గిపోయింది. 2050 నాటికి జనాభా 164 కోట్లకు పెరుగుతుందని అంచనా. అప్పుడు తలసరి నీటిలభ్యత 1,140 ఘన మీటర్లకు తగ్గిపోతుంది. వార్షిక తలసరి నీటి లభ్యత 1,700 ఘనమీటర్ల కంటే తక్కువగా ఉన్న ప్రాంతాలను 'నీటి ఒత్తిడి' ప్రాంతాలనీ, 1000 ఘనమీటర్లకు తక్కువగా గల ప్రాంతాలు నీటి కొరత ప్రాంతాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఆ ప్రకారం చూస్తే దేశం ఇప్పటికే నీటి ఒత్తిడి గల స్థాయికి చేరుకుంది. భవిష్యత్తులో జనాభా పెరిగి, తలసరి నీటిలభ్యత 'నీటి కొరత' ప్రమాణాలకు తగ్గిపోయే ప్రమాదముంది. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ వార్షిక వర్షపాతం 966 మిల్లీమీటర్లు. అనంతపురం జిల్లాలో కనిష్ఠంగా 554, కోస్తా జిల్లాల్లో గరిష్ఠంగా 1217 మిల్లీమీటర్ల వరకు ఉంటుంది. గోదావరి, కృష్ణా, పెన్న వంటి పెద్ద నదులేగాక, నాగావళి, వంశధార, చంపావతి, శారద, వరాహ, తాండవ, ఏలేరు, ఎర్రకాల్వ, తమ్మిలేరు, రామిలేరు వంటి మరో 37 మధ్య, చిన్న తరహా నదులు జలాన్ని అందిస్తున్నాయి. ఈ నదులలో నిర్దిష్టంగా లభ్యమయ్యే 1,916 శతకోటి ఘనపుటడుగులు (టీఎమ్‌సీ)కు తోడు, మరో 355 టీఎమ్‌సీలు భూగర్భజలంలో, మొత్తం 2271 టీఎమ్‌సీల నీరు రాష్ట్రంలో అందుబాటులో ఉంటుంది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలు తాగునీటికి, మరికొన్ని ప్రాంతాలు సాగునీటికి ఇబ్బంది పడుతున్నాయి. ఇందుకు కారణం ఈ జలరాశి అన్ని ప్రాంతాలకూ సమానంగా విస్తరించి ఉండక పోవడం, దాన్ని సక్రమంగా నిర్వహించుకొని, సమర్థమంతంగా వినియోగించుకోలేకపోవడం! రాష్ట్రంలోని మొత్తం 199 లక్షల ఎకరాల సేద్యయోగ్యమైన భూమిలో ప్రస్తుతం 101 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉంది. నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తయితే, అదనంగా సుమారు మరో 36 లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. మిగిలిన 62 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి గల అవకాశాలను అధ్యయనం చేయాలి. ఇందుకోసం నదుల అనుసంధానం, వరద నీటిని కొరత ప్రాంతాలకు మళ్లించడం, వాననీటి





నేడే ప్రపంచ జలదినోత్సవం



సంరక్షణ, భూగర్భ జలాలను పెంపొందించుకోవడం, సమర్థంగా నీటిని వినియోగించుకోవడం, పంట మార్పిడి తదితర ప్రక్రియలను చేపట్టడం అవసరం.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రాణహిత నది గోదావరిలో కలిసిన తరవాత మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మించి 180 టీఎమ్‌సీల నీటిని వెనక్కు ఎల్లంపల్లికి మళ్లించడంతోపాటు, భూగర్భజలంతో కలిపి 225 టీఎమ్‌సీల నీటిని వినియోగించుకొని కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలిపి 37 లక్షల ఎకరాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. హైదరాబాద్ మహానగరానికి తాగునీటికి 30 టీఎమ్‌సీలు, పారిశ్రామిక అవసరాలకు 16 టీఎమ్‌సీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు పది టీఎమ్‌సీలు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం సాగునీటి రంగానికి చేసిన వ్యయంలో 40 శాతానికిపైగా దీనికే ఖర్చు చేసింది. 12.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి నీటి సరఫరాకు డిండి ఎత్తిపోతల, ఖమ్మం జిల్లా అవసరాలకు సీతారామ ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, దేవాదుల తదితర ప్రాజెక్టుల కింద చెరువులను నింపడంతోపాటు ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. వెనకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా 40 టీఎమ్‌సీలకు పైగా నీటిని విడుదల చేసింది. చిన్ననీటివనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన 'మిషన్ కాకతీయ' పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. నాలుగు దశల్లో 28,652 చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 17వేల చెరువుల పనులు పూర్తయ్యాయి. మరో వైపు ఇంటింటికి పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు 'మిషన్ భగీరథ'ను చేపట్టింది.

సంరక్షణ ప్రక్రియలు

కొన్ని నదీ పరీవాహక ప్రాంతాల్లో అతివృష్టి వల్ల వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కారణంగా నీటికొరత ఏర్పడుతోంది. వీటిని నివారించడానికి 1960లో డాక్టర్ కె.ఎల్.రావు 2,640 కిలోమీటర్ల పొడవైన కాలువ ద్వారా గంగా నదీజలాలను కావేరికి మళ్లించడానికి 'గంగ-కావేరి' అనుసంధాన పథకాన్ని రూపొందించారు. అంతకంటే ముందు 4,200 కిలోమీటర్ల పొడవైన హిమాలయ ప్రాంత కాలువను, 9,300 కిలోమీటర్ల పొడవైన ద్వీపకల్ప కాలువతో అనుసంధించడానికి కెప్టెన్ దస్తూర్ 'గార్లెండ్ కాలువ' పథకాన్ని రూపొందించారు. ఇవి ఆచరణయోగ్యం కావంటూ కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. వరదలు, కరవులను నివారించడానికి, నదుల అనుసంధానాన్ని చేపట్టాలని సుప్రీంకోర్టు 2002 అక్టోబరు 31న కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు అప్పటి కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు నేతృత్వంలో ఎనిమిది మందితో కమిటీని ఏర్పాటుచేశారు. ప్రవాహ పరిమాణం ఎక్కువగా ఉన్న 14 హిమాలయ నదులను, తక్కువగా గల 16 ద్వీపకల్ప నదులతో అనుసంధించడానికి జాతీయ ప్రణాళిక రూపొందించారు. ఇవి అంతర్రాష్ట్ర నదులు కావడంవల్ల రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం కొరవడి, నదుల అనుసంధాన ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. వర్షాకాలంలో రుతుపవనాలు, ఇతర కాలాల్లో మంచు కరగటం ఫలితంగా ఉత్తర భారతంలో జీవనదులైన బ్రహ్మపుత్ర, గంగ నదుల్లో ఏడాది పొడుగునా ప్రవాహం ఉంటోంది. దక్షిణ భారతదేశంలోని మహానది, గోదావరి, కృష్ణ, పెన్న తదితర నదుల్లో వానలు కురిసినప్పుడే అధికంగా నీరుంటుంది. ఇతర కాలాల్లో ప్రవాహం అరకొరగానే ఉంటుంది.

నీటిలో సుమారు రెండు శాతం మాత్రమే నదులు, సరస్సులు, చిత్తడి నేలలు తదితర భూతల వనరులలో ఉండగా, మిగిలిన నీటిలో ఎక్కువ భాగం భూగర్భంలోనే ఉంది. ఏటా వాననీరు ఇంకుతున్నందు వల్ల భూగర్భ జల పరిమాణం క్రమంగా పెరుగుతోంది. నీటి ఉనికి, లోతు, ఆర్థిక కారణాలవల్ల భూగర్భంలో ఉన్న నీటిని పూర్తిగా వెలికితీయడం సాధ్యపడదు. గృహావసరాలు, వ్యవసాయం, పరిశ్రమలకు పెరుగుతున్న అవసరాలను తీర్చేందుకు భూగర్భజలాల్ని వినియోగించుకోవలసిన అవసరం ఉంది. తోడినకొద్దీ భూగర్భ జలమట్టం తగ్గిపోతుంది. నిరంతర ప్రక్రియగా వాన నీటిని భూమిలోకి చొప్పించడం ద్వారా భూగర్భ జలమట్టం తగ్గిపోకుండా చూడాలి. ఆ నీటిని అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగించుకోవాలి. అల్పవర్ష ప్రాంతాల్లో అడవులు పెంచి, తద్వారా వర్షపాత సాంద్రతను పెంచడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. దీనివల్ల వర్షపాతం పెరిగి సాగు, తాగునీరు, పరిశ్రమలకు కావలసిన నీరు లభిస్తుంది. అల్ప వర్ష ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల కింద తుంపర, బిందు వంటి సూక్ష్మ సాగునీటి విధానాలను అమలు చేయాలి. తద్వారా 50 నుంచి 60 శాతం నీటిని పొదుపు చేసుకోవచ్చు. రైతులకు అవసరమైతే రాయితీ ఇవ్వడం ద్వారా ఇలాంటి సాగు విధానాలను కొనసాగించాలి. 2004-05లో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ నియమించిన సంఘం సమర్పించిన నివేదికలో నదీవ్యవస్థను సక్రమస్థితిలో ఉంచాలంటే, దానిలో కనీస ప్రవాహం ఉండేటట్లు చూడాలని సిఫార్సు చేసింది. నదులపై అవసరమైన చోట్ల జలాశయాలను నిర్మిస్తే, జీవ నదుల్లోనే కాక, ఇతర నదుల్లోనూ పర్యావరణ పరిరక్షణకు అవసరమైన కనీస ప్రవాహం కొనసాగించడానికి వీలవుతుంది. ప్రకృతి సిద్ధమైన జలసంరక్షణ ప్రక్రియల ద్వారా నీటి సమస్యలను చాలావరకు పరిష్కరించవచ్చు!

(రచయిత- సాగునీటి రంగ నిపుణులు)



వీరేంద్ర కపూర్

నీరవ్‌పై నిరర్థక రభస

నీరవ్ మోదీ- పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై అరుపులు కేకలతో పార్లమెంటు అమూల్య సమయం పదేపదే వృథా అవుతోంది. గౌరవనీయ పార్లమెంటు సభ్యులు వాగ్వివాదంలో అంతూ పొంతూలేని టెలివిజన్ చర్చలను మించిపోయారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడొక ముఖ్యమైన తేడా ఉంది. టీవీ ఛానళ్లు సొంత ఖర్చుతో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, పార్లమెంటు సభ్యులు ప్రజాధనంతో కాలహరణం చేస్తున్నారు. పదేపదే అడ్డుతగులుతూ సభలు తరచూ వాయిదా పడటానికి కారకులవుతున్నారు. సభ విచ్ఛిన్నమైన ప్రతిసారీ పార్లమెంటు సభ్యుల జీతభత్యాలను తెగ్గోయాలనే ప్రతిపాదన ఏమైందో వారికే తెలియాలి. నీరవ్ మోదీ కుంభకోణం పేరు చెప్పి పార్లమెంటును స్తంభింపజేసిన కాంగ్రెస్ పార్టీ, నీరవ్‌కి పాలక పార్టీ పెద్దలతో సంబంధాలున్నట్లు నిరూపించే ఏ చిన్న సాక్ష్యాన్నీ సమర్పించలేకపోయింది! ఇందిరాగాంధీ జమానా మొదలుకొని యూపీఏ పాలన వరకు ఫోన్ల ద్వారానే వ్యవహారం నడిపించడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుత ఎన్‌డీఏ పాలనలోనూ అలాగే జరుగుతున్నట్లు కాంగ్రెస్ నిరూపించగలదా అంటే అలాంటి అవకాశమే లేదని చెప్పాలి. ఏ సాక్ష్యాధారాలు లేకుండా నీరవ్ మోదీ-మెహుల్ చోక్సీల అక్రమాలతో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ముడిపెట్టడం కుదరదు!

పసలేని ఆరోపణలు

నీరవ్, చోక్సీలు వేల కోట్ల రూపాయల బ్యాంకు ధనం బొక్కేసి విదేశాలకు పలాయనం చిత్తగించారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారు పరారు కాకుండా నిరోధించడానికి పాస్‌పోర్టులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీస్తున్నాయి. ఇది అర్థరహిత ప్రశ్న. ఎటువంటి ఆరోపణలు లేని వ్యక్తుల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవడం చట్టపరంగా సాధ్యపడదని, అలాచేస్తే కోర్టుల మందలింపులకు గురికావలసి వస్తుందని ప్రతిపక్షాలకు తెలియదా? ఉదాహరణకు రాహుల్ గాంధీనే తీసుకుందాం. రూ.2,000 కోట్ల నేషనల్ హెరాల్డ్ ఆస్తుల కేసులో నిందితుడైన రాహుల్ ప్రస్తుతం బెయిలు మీద ఉన్నారు. ఒకవేళ ఆయన చెప్పాపెట్టకుండా విదేశాలకు పారిపోతే అందుకు మోదీ ప్రభుత్వాన్ని నిందించగలమా? అనుమానితులకు దేశం విడిచివెళ్లే ఆలోచన ఉందని ప్రభుత్వం ఫిర్యాదు చేసినంత మాత్రాన, కోర్టులు వారి అరెస్టుకు ఆదేశాలు జారీచేయవు. దోషి అని నిరూపణ కానంతవరకు నిందితుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడానికి ఒప్పుకోవు. ఇందువల్లనే గతంలో విజయ్ మాల్యా, లలిత్ మోదీలు దేశం విడిచివెళ్లగలిగారు. అంతెందుకు? కార్తి చిదంబరం క్రిమినల్ కుట్రకు పాల్పడ్డారని, నల్లధనాన్ని తెలుపులోకి మార్చడానికి తోడ్పడ్డారని నమ్మడానికి గట్టి ఆధారాలు ఉన్నా కూడా ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవడానికి న్యాయస్థానం



పార్లమెంటులో కాంగ్రెస్ అహేతుక వైఖరి

అంగీకరించలేదు. విదేశాలకు వెళ్లి సాక్ష్యాలను తారుమారుచేసే ప్రమాదం ఉందని తెలిసి కూడా న్యాయస్థానం ఇందుకు సమ్మతించలేదు.

మొత్తం మీద నీరవ్ మోదీ కుంభకోణంపై తక్షణం చర్చ జరిగే ఏర్పాటు చేసి ఉంటే వ్యవహారం ఇంత పెద్దదై ఉండేది కాదేమో? ఆ పనిచేయకపోవడం ద్వారా ప్రభుత్వమే ఇంత రభసకు తావిచ్చింది. అసలు ప్రభుత్వ పెద్దలకు నీరవ్-చోక్సీలతో ముడిపెట్టే బలీయ సాక్ష్యమేదీ చూపకుండానే ప్రతిపక్షం నానాయాగీ చేస్తోంది. ఏదో ఒక సందర్భంలో ప్రధాని మోదీ, చోక్సీని మెహుల్ భాయ్ అని సంబోధించారట. ప్రతిపక్షం అదొక్కటి పట్టుకుని ప్రధానిని ఇరికించాలని చూస్తోంది. ఆ మాటకొస్తే లాలు ప్రసాద్ యాదవ్ పశుగ్రాస కుంభకోణంలో నిందితుడని తెలిసీ ఏళ్లతరబడి ఆయనతో భుజాలు పూసుకొని తిరిగినవారి మాటేమిటి? లాలూకు తోడుగా వారెవరూ జైలుకు వెళ్లలేదుగా! సాటి గుజరాతీ అయిన మెహుల్‌ను సంప్రదాయం ప్రకారం భాయి అని ప్రధాని మోదీ సంబోధించారే తప్ప అంతకుమించి చెప్పుకోవడానికి మరేం లేదు. పోనీ, కాగితంపులి వంటి రాహుల్ గాంధీ వద్ద ప్రధాని మోదీని పీఎన్‌బీ కుంభకోణంతో ముడిపెట్టే సాక్ష్యాలేవైనా ఉంటే వాటిని 24 గంటలూ ప్రసారమయ్యే టీవీ ఛానళ్లలో చాటింపు వేయవచ్చుగా! ఈ కుంభకోణంతో మోదీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదు కనుకనే రాహుల్ ఆ పని చేయలేకపోతున్నారు. అసలు కాంగ్రెస్ హయాములో చెంచాగిరీ చేసినవారికే బ్యాంకుల్లో ఉన్నత పదవులు కట్టబెట్టేవారు. అప్పట్లో ఆర్థికమంత్రి వ్యక్తిగత సహాయకుడో లేక ప్రధానమంత్రి సహాయకుడో ఒక్క ఫోన్ కాల్ చేసి అంతేవాసులకు వందల కోట్ల రూపాయల రుణాలు విడుదల చేసేలా బ్యాంకులపై ఒత్తిడి తీసుకురాగలిగేవాడు. అదే ఇప్పుడు బ్యాంకుల పుట్టిముంచింది. రాహుల్ పార్టీ ఈ విధంగా అనేక ప్రభుత్వ బ్యాంకులను గుల్లచేసి, ఇప్పుడు తీరిగ్గా మోదీ ప్రభుత్వం మీద పడుతోంది!

మరోమాట

న్యాయమూర్తులకు దురుద్దేశాలు అంటగట్టడం, వారి నిజాయతీని శంకించడం ఈమధ్య ఎక్కువైంది. జడ్జి లోయా కేసు, కార్తి చిదంబరం కేసు ఇందుకు ఉదాహరణలు. ఈ రెండు కేసుల్లో న్యాయ వ్యవస్థ హుందాతనానికి, సంస్థాగత ప్రమాణాలకు భంగం వాటిల్లింది. మొదటి కేసులో న్యాయవాది కఠినమైన ప్రశ్నలన్నింటినీ కోర్టు తనకే వేస్తూ ప్రభుత్వ న్యాయవాది పట్ల మెతగ్గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. న్యాయస్థానం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని ఆయన ఉద్దేశం. న్యాయపరమైన అంశాలను లేవనెత్తడం ద్వారా కాక, చిల్లర ఆరోపణలతో ఆయన సమాచార సాధనాల్లో హడావుడి చేయడం నిజంగా చోద్యం. కార్తి కేసులోనూ నిందితుడి తరపు న్యాయవాది ఇలాంటి ఆరోపణలే చేశారు. న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాది చెప్పుచేతల్లో పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా, బ్రిటన్‌లలో కనుక న్యాయస్థానాలపై ఇలాంటి ఆరోపణలు చేస్తే పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుది. భారత్‌లో మాత్రం న్యాయమూర్తులకు చీమ కుట్టినట్లయినా లేదు. మన కోర్టుల్లో డిఫెన్స్ న్యాయవాదుల ధోరణి, లోక్‌సభలో పాలక పార్టీపై ప్రతిపక్షాల తీరును తలపిస్తోందంటే అతిశయోక్తి కాదు. దురుసు ప్రవర్తన ప్రతిపక్ష రాజకీయ నాయకులకు చెల్లుతుందేమో కాని, న్యాయవాదులకు చెల్లకూడదు కదా!

రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టును ఉపయోగించుకునే ధోరణి ఈ మధ్య ఎక్కువైంది. దీనికితోడు న్యాయమూర్తుల వ్యక్తిత్వంపైన, పనితీరు, నాణ్యతపైన సందేహాలు తలెత్తుతున్నాయి కూడా. న్యాయవ్యవస్థ ఎలాంటి అనుమానాలకు, ఆరోపణలకు, విమర్శలకు తావులేకుండా నడుచుకోవాల్సి ఉంది. అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి కూడా!

భక్తి గ్రంథం

భక్తి, జీవితం- వేర్వేరు కావు. మానవ జీవితంలో భక్తి ఓ అంతర్వాహిని. భక్తితత్వంలో కుల మతాల ప్రస్తావనే ఉండదు. దానికి వయోసంబంధ తారతమ్యతా లేదు. స్వరాలు వేరైనా, భక్తిభావన ఉద్దేశం ఒక్కటే. సర్వాంతర్యామి ముందు మోకరిల్లడం, భక్తిని స్వీకరించాలని కోరడం... అంతే!

సంజీవని వంటిది భక్తి. నిస్తేజం ఆవహించిన జాతిని అది చైతన్యపరుస్తుంది. పలు పాయలుగా మారి, జీవన సంస్కృతిలోకి చేరి, సమాజాన్ని ఉద్ధరిస్తుంది. ఆదిశంకరులు, భక్త కబీరు, గురునానక్ వంటివారు భక్తిని ఆలంబనగా చేసుకొని, జనచైతన్యానికి కృషి సాగించారు. జ్ఞానానికి తల్లి 'భక్తి' అంటారు రమణ మహర్షి. దేవతారాధనే భక్తి కాదు. అది జీవన విధానం. తల్లి దైవంతో సమానమంటాయి శాస్త్రాలు. అదే మాతృభక్తి. తండ్రి, ఆచార్యుడు సహా ప్రాణులందర్నీ దైవస్వరూపులుగా భావించాలని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి.

అపార భక్తితత్వాన్ని అలవరచుకోవడం వల్ల అమృతత్వం సిద్ధిస్తుందని హనుమంతుడు, మార్కండేయుడు వంటి చిరంజీవుల గాథలు వెల్లడిస్తాయి. భక్తినే యోగంగా మలచి శ్రీకృష్ణుడు గీతాబోధ చేశాడు. దైవనామ స్మరణ అనుక్షణం సాగాలి. అది లేని సమయమే మానవజీవితంలో నష్టభాగమని హనుమంతుడు ఒక సందర్భంలో రాముడితో అంటాడు. అర్ధ నిమిష కాలం భగవద్భక్తి లేకుండా గడిపినందుకు ప్రతిగా, త్రిలోకాధిపత్యం ఇచ్చినా నిజభక్తులు అంగీకరించరని భాగవతం చెబుతుంది.

మోక్ష సాధకులు తప్పనిసరిగా భక్తిమార్గాన్ని అవలంబించాలి. బ్రహ్మదేవుడు మోక్షప్రాప్తికి మూలాన్ని అన్వేషిస్తాడు. ధర్మదృష్టితో వేదాల్ని ఆమూలాగ్రం చదువుతాడు. భక్తితో తప్ప మోక్షం సాధ్యం కాదని చివరికి నిశ్చయించుకుంటాడు. భక్తి సోపాన అధిరోహణం వల్లనే పరమపదం సాధ్యమవుతుందని 'నారద భక్తిసూత్రాలు' విపులీకరిస్తాయి. జీవితాన్ని భక్తిగ్రంథంగా భావిస్తే, అందులోని ప్రతి పుటలోనూ పరమేశ్వర



సాక్షాత్కారం లభిస్తుంది. బాల్యం, యౌవనం, వృద్ధాప్యం... ఇలా అన్ని దశలూ భగవత్ ఆరాధనకు అనుకూలమే! ప్రహ్లాదుడు పసివాడిగా ఉండగానే మోక్షప్రాప్తికి నవవిధ భక్తిమార్గాల్ని బోధిస్తాడు.

శరీరంలో శక్తిసామర్థ్యాలు ఉన్నంతవరకు, కోరికలు మనిషిని విడిచిపెట్టవు. 'దైహిక వాంఛామగ్నుడినై నీమీద భక్తిని విడవలేను' అని రామదాసు అంటాడు. జీవిత చరమదశలో నీ దివ్యనామం స్మరించగలనో లేదో... అప్పుడు చేయాల్సిన నామస్మరణా ఈ క్షణమే చేసే భాగ్యాన్ని కలిగించాలని రాముణ్ని ప్రార్థిస్తాడు.

అన్నమాచార్యుడు పదకొండు రకాల భక్తిమార్గాల్ని ప్రబోధించాడు. దైవంతో సంబంధం గల ప్రతి ఒక్క చర్యా ఏదో ఒక భక్తి మార్గంలోకి చేరుతుంది. భగవంతుడికి తన భక్తులతో పాటు వారి భక్తుల పట్ల కూడా అత్యధికమైన అభిమానం అని భారతోక్తి. అన్నమయ్య ఇంకో అడుగు ముందుకు వేశాడు. ఎంత వెతికినా సామాన్యులకు హరిదర్శనం దుర్లభం. అందువల్ల హరిభక్తుల్నే భక్తితో పూజించాలంటాడు. 'ఆయన విలాసం ఆయనకు మాత్రమే తెలుసు' అంటాడా వాగ్గేయకారుడు. మనసులో తననే నమ్ముకున్న భక్తులకు ఎటువంటి హానీ జరగదని పరమాత్మ అభయమిచ్చాడు. రక్షణనిచ్చాడు. ఆ భక్తుల కథలమయమే భాగవతం!

బంగారం వంటి లోహాల్ని అగ్ని దహనం చేసినట్లే, భక్తుడు ఆర్తితో చేసే భగవన్నామస్మరణ పాపాల్ని దహిస్తుంది. పరమాత్మే మనసులో నిండిన వ్యక్తి, భక్తి అనే అమృతసాగరంలో తరిస్తాడు. అతణ్ని ఏవీ ప్రలోభపెట్టలేవని పురాణాల సారాంశం. తులసీదాసు రామచంద్రుడి దివ్యానుగ్రహమే కోరతాడు. శ్రీచరణ సన్నిధి తప్పించి ఎటువంటి సంపదల్నీ ఆశించనంటాడు. ప్రాణులన్నింటిలోనూ పరమేశ్వరుణ్ని దర్శించడమే నిజమైన భక్తి. ఆ భక్తుడే మోక్షాన్ని పొందగలడంటుంది 'వివేక చూడామణి'. దేవుణ్ని ప్రసన్నం చేసుకోవాలని, ఆయనకు ప్రియభక్తులం కావాలని అందరికీ ఉంటుంది. ఏ లక్షణాలున్న భక్తుడు తనకు ఇష్టమైనవాడో గీతాచార్యుడు తెలియజేశాడు.

ప్రాణికోటి పట్ల దయ కలిగినవాడు, స్థితప్రజ్ఞుడు, నిత్యసంతోషి అయిన భక్తుడే పరమేశ్వరుడికి ప్రీతిపాత్రుడు కాగలడు!

- జి.రామచంద్రరావు

కళాశాలలుగా 27 తెలంగాణ గురుకుల పాఠశాలలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని 27 పాఠశాలలను కళాశాలలుగా ఉన్నతీకరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో 13 బాలురు, 14 బాలికల పాఠశాలలున్నాయి. వాటిల్లో వచ్చే విద్యా సంవత్సరం (2018-19) నుంచే ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ తరగతులు ప్రారంభమవుతాయి. మొదట ప్రథమ సంవత్సరం తరగతులను ప్రారంభిస్తారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉంటాయి. వచ్చే ఏడాది కొత్తగా 2,160 ఇంటర్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఆపై సంవత్సరం ద్వితీయ సంవత్సరం తరగతులు కూడా మొదలవుతాయి. తరగతుల నిర్వహణ కోసం 405 కొత్త ఉద్యోగాలను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. అందుకు 2018-19 బడ్జెట్‌లో రూ.117.79 కోట్లు కేటాయించింది. 2017-18లో ఆరు గురుకుల పాఠశాలలను కళాశాలలుగా మార్చిన విషయం తెలిసిందే.



దొరికిన డబ్బులను వాటి యజమానికి అప్పగిస్తున్న బల్దియా కార్మికురాలు లక్ష్మీ

పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయితీకి ప్రశంస

చెత్తలో దొరికిన రూ.లక్షా 20వేలను వాటి యజమానికి అప్పగించిన వైనం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఓ పారిశుద్ధ్య కార్మికురాలు నిజాయితీకి నిదర్శనమీ సంఘటన... జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బల్దియాలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న మద్దెల లక్ష్మీ బుధవారం ఉదయం పట్టణంలోని కూరగాయల మార్కెట్లో ఊడుస్తుండగా నల్లరంగుతో ఉన్న కవరు కనిపించింది. అనుమానం వచ్చి దాన్ని పరిశీలించగా అందులో లక్షా ఇరవై వేల రూపాయల డబ్బుల కట్టలు కనిపించాయి. ఈ లోగా స్థానిక చికెన్ సెంటర్ యజమాని షేక్.జావీద్ వచ్చి డబ్బులు పోయాయంటూ లబోదిబోమన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన లక్ష్మీ తనకు దొరికిన డబ్బుల కవర్ విషయం చెప్పి అతనికి అందజేశారు. మంగళవారం రాత్రి తన దుకాణాన్ని మూసి వేసి ఇంటికి వెళ్లే సమయంలో చెత్త కవర్‌కు బదులు డబ్బులున్న కవర్‌ను చెత్త కుప్పలో పడేసి వెళ్లిపోయినట్లు జావీద్ చెప్పారు. బుధవారం ఉదయం దీన్ని గుర్తించి కంగారుగా మార్కెట్‌కు వచ్చి ఆందోళన చెందారు. కార్మికురాలు లక్ష్మీ నిజాయితీకి మెచ్చుకొని అమెకు జావీద్ రూ.5వేలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్‌కే జోషి

అనుమతులు పొందిన సంస్థలన్నీ పనులు ప్రారంభించాలి

పరిశ్రమల సమీక్షలో సీఎస్ ఎస్‌కే జోషి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఆహార శుద్ధి, చిల్లర వర్తకం, విద్యుత్తు వాహనాల కోసం ప్రత్యేక విధానాలను విడుదల చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వెల్లడించారు. రాష్ట్ర పారిశ్రామిక అనుమతులు స్వీయధ్రువీకరణ విధానం (టీఎస్ఐపాస్) కింద అనుమతులు పొందిన సంస్థలన్నీ సత్వరమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనుమతులు వచ్చాక ఆరు నెలల్లో పనులు చేపట్టని వాటి నుంచి సంజాయిషీ కోరాలని సూచించారు. పారిశ్రామిక అనుమతులతో పాటు ఆయా శాఖలకు సంబంధించిన పనులకు నిర్ణీత గడువు విధించాలన్నారు. పరిశ్రమల శాఖపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, కమిషనర్ నదీం అహ్మద్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, కొత్త విధానాలపై సత్వరమే ప్రత్యేక సమావేశం నిర్వహించి, ముసాయిదాలను సిద్ధం చేస్తామన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా రూ.1.24 లక్షల కోట్ల పెట్టుబడి విలువ గల 6,609 పరిశ్రమలకు అనుమతించామని, ఇందులో 4,382 పరిశ్రమలు ప్రారంభమయ్యాయని, వీటి ద్వారా 1.87 లక్షల మందికి ఉపాధి లభించిందని, మరో 684 పరిశ్రమలు పనులు చేపట్టే సన్నాహాల్లో ఉన్నాయన్నారు. సరళతర వ్యాపార నిర్వహణలో 372 సిఫార్సులకుగాను 362 ఆమోదం పొందాయని, మిగిలిన వాటిలో నాలుగు రాష్ట్రానికి వర్తించవని, మరో 6 త్వరలోనే ఆమోదం పొందుతాయన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత టీఐడియా ద్వారా 10,195 పరిశ్రమలకు అనుమతిలిచ్చామన్నారు. జహీరాబాద్ నిమ్జ్, ఔషధనగరి, వరంగల్ కాకతీయ జౌళి పార్కుల పనులను వేగిరం చేయాలన్నారు. ఈ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

23 నుంచి ఏఈఈ పోస్టులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టులకు మూడోవిడత ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈనెల 23 నుంచి ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో పరిశీలన కొనసాగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఆర్టీసీకి రూ. 200 కోట్లు విడుదల

తెలంగాణ ఆర్టీసీకి రూ. 200 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు బడ్జెటు కింద ఈమొత్తం విడుదల చేసింది. ఆర్టీసీ పెటుబడి పద్దు కింద ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది.

రూ.100 కోట్ల నష్టానికి 'టెండర్'!

- మక్కలు క్వింటా రూ.1600కి అమ్మితేనే గిట్టుబాటు
- రూ.1280కి ఇస్తే చాలంటున్న మార్క్‌ఫెడ్
- నేటితో ముగియనున్న టెండర్ దాఖలు గడువు
- బ్యాంకు రుణాలు కట్టలేక వదిలించుకునేందుకు తంటాలు

ఈనాడు - హైదరాబాద్

మొక్కజొన్న(మక్క) పంట క్రయవిక్రయాల్లో భారీ నష్టానికి టెండర్లు ఖరారు కానున్నాయి. గత వానాకాలం(ఖరీఫ్)లో రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తరఫున 'రాష్ట్ర సహకార మార్కెటింగ్ ఏజెన్సీ(మార్క్‌ఫెడ్) ఈ పంటను మద్దతు ధరకు కొన్నది. రూ. 450 కోట్ల అప్పులను బ్యాంకుల నుంచి తీసుకుని క్వింటాకు రూ. 1,425 చొప్పున రైతులకు చెల్లించింది. మొత్తం 30.50 లక్షల క్వింటాళ్లు కొని గోదాముల్లో నిల్వ చేసింది. అప్పులపై వడ్డీ భారం నెలనెలా పెరిగిపోతుండటంతో ఇతర పంటలకు మళ్లీ అప్పులు తీసుకోవడం ఈ సంస్థకు కష్టంగా మారింది. ఇప్పుడు క్వింటా రూ. 1600కు అమ్మితేనే నష్టం లేకుండా బయటపడవచ్చని తేల్చారు. బయటి మార్కెట్‌లో మక్కలకు డిమాండు లేదు. ఇప్పుడు మళ్లీ యాసంగి(రబీ) పంట మార్కెట్‌కు రావడం మొదలైంది. రబీ మక్కలను మరో 53 లక్షల క్వింటాళ్లు కొనడానికి రూ. 723 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. వానాకాలంలో కొన్న పంటను అమ్ముకోవడానికి టెండర్లు పిలిచి ఈనెల 22 వరకూ దాఖలు గడువిచ్చింది. క్వింటా కనీస విక్రయ ధర రూ. 1280గా టెండర్ ప్రకటనలో తెలిపింది. గత నెలలో ఒకసారి ఇదే ధరకు టెండర్లు పిలిస్తే రూ. 1150 మాత్రమే ఇస్తామని కొందరు టెండర్లు వేశారు. దీంతో ఈనెలలో మార్క్‌ఫెడ్ టెండర్లు పిలిచింది. రూ. 1280 చొప్పున అమ్మినా కనీసం రూ. 100 కోట్ల వరకూ నష్టం వస్తుందని అంచనా.



మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్‌లో మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ కొన్న మొక్కజొన్నలు

తిరిగి అమ్మితే ఏం చేయాలి

ప్రస్తుతం రబీ పంట మార్కెట్లకు రావడం మొదలైనందున పాత పంటను క్వింటాకు రూ. 1280కే అమ్మితే కొత్త పంటను రూ. 1425 చొప్పున మద్దతు ధర ఇచ్చి ఎవరు కొంటారని రైతులు వాపోతున్నారు. మార్క్‌ఫెడ్ నుంచి వ్యాపారులు రూ. 1280కి కొన్నవారు తిరిగి అదే పంటను తెచ్చి మార్క్‌ఫెడ్ రబీ పంట కొనుగోలుకు ఏర్పాటుచేసే కేంద్రాల్లో అమ్ముకుంటే క్వింటాకు రూ. 145 దాకా వారికి లాభం వస్తుంది. ఇలాంటివారిని అడ్డుకోకపోతే రబీ పంట కొనుగోలులో ప్రభుత్వానికి మళ్లీ నష్టం తప్పదు. 30 లక్షల క్వింటాళ్ల పాత పంట వస్తే కొత్త మక్కల ధర రూ. 1000కి పడిపోయే ప్రమాదముందని వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రమార్కెట్లలో రూ. 1250 నుంచి రూ. 1400 దాకా కొంటున్నారు. ఈ నేపథ్యంలో టెండర్ల ద్వారా అమ్మకాలు మొత్తం మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశాలున్నాయని ఓ అధికారి 'ఈనాడు'కు చెప్పారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు భారీగా ప్రోత్సాహకాలు

- మంత్రివర్గ ఉప సంఘ సమావేశంలో నిర్ణయం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలు పెద్దఎత్తున స్థాపించేందుకు ఔత్సాహిక, పారిశ్రామికవేత్తలకు రాయితీలివ్వడంతో పాటు, ప్రోత్సాహకాలు, ఇతర సహాయ సహకారాలను అందించాలని రాష్ట్ర మంత్రులు అభిప్రాయపడ్డారు. దీనికోసం ఓ విధానం, అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని నిర్ణయించారు. శాసనసభ కమిటీ హాలులో బుధవారం మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమైంది. పరిశ్రమలతో పాటు శీతల గిడ్డంగులు, ప్రయోగశాలలు, ప్రాసెసింగ్ యూనిట్లు, బీమా సౌకర్యం వంటివి కల్పించాలని పేర్కొన్నారు. సమావేశానికి కమిటీ ఛైర్మన్ పోచారం శ్రీనివాసరెడ్డి, సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు, టి.హరీశ్‌రావు, ఈటెల రాజేందర్, జగదీశ్వర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. రైతులు అధికంగా సాగు చేస్తున్న పత్తి పంటకు సరిపడా జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని.. కాకపోతే పత్తి ఎక్కువగా పండించే నల్గొండ జిల్లాలో ఇవి తక్కువగా ఉన్న విషయం చర్చకు వచ్చింది. వరి పంటకు అనుగుణంగా బియ్యం పరిశ్రమలున్నా అవి కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైనట్లు గుర్తించారు. వరి పండే ఇతర ప్రాంతాలలో వీటిని స్థాపించాలని అభిప్రాయపడ్డారు. బియ్యం నుంచి పిండి, నూనె, కేకులు, బిస్కెట్లు తయారుచేసే అనుబంధ పరిశ్రమలు స్థాపించాలని నిర్ణయించారు. మామిడి, బత్తాయి ప్యాకింగ్, ఫలరసాల పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. గొర్రెల మాంసం కటింగ్, ప్యాకింగ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తే ఎగుమతులకు ఆస్కారముంటుందన్నారు. ఈనెల 24న మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు. వివిధ అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, మార్కెటింగ్‌శాఖ సంచాలకులు లక్ష్మీబాయి, ఉద్యానశాఖ సంచాలకులు వెంకట్రామిరెడ్డి, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

బడా సంస్థలతో రూ.110 కోట్లు కట్టించిన జీఎస్టీ అధికారులు

- మూడు నెలలు సేవా పన్ను చెల్లించనందుకే..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలలు సేవా పన్ను చెల్లించకుండా ఎగవేసిన ప్రముఖ నిర్మాణ సంస్థలతో పాటు ఇతర సంస్థల నుంచి రూ. 110 కోట్లను హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ అధికారులు బుధవారం వసూలు చేశారు. హైదరాబాద్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలతో పాటు మొత్తం 75 సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడు నెలల ముందు సేవా పన్ను చెల్లించలేదు. ఉద్దేశపూర్వకంగా పన్ను కట్టలేదని హైదరాబాద్ జీఎస్టీ అధికారులు గుర్తించారు. ఆ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. అన్ని పన్నులు చెల్లించిన వారే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునేందుకు అర్హత పొందుతారు. సేవా పన్ను చెల్లించకుండానే కొన్ని సంస్థలు ఐటీసీ కూడా తీసుకున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జీఎస్టీ అధికారులు నోటీసులు జారీ చేయడంతోపాటు చర్యలకు ఉపక్రమించారు. సోమా ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ. 7 కోట్లు, గాయత్రి ప్రాజెక్ట్స్ (రూ. 6.67 కోట్లు), ఐవీఆర్‌సీఎల్ (రూ. 5.66 కోట్లు), రాంకీ ఇన్‌ఫ్రా (రూ. 5.72 కోట్లు), కోజెన్ లిమిటెడ్ (రూ. 5 కోట్లు), ఆర్వీ అసోసియేట్స్ (రూ. 3.80 కోట్లు), ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ (రూ. 3.35 కోట్లు), ఆర్ఆర్‌వీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ నుంచి రూ. 3.15 కోట్ల సేవా పన్ను బకాయిలు వసూలు చేశారు. మిగిలిన సేవా పన్ను బకాయిలను వడ్డీ, అపరాధ రుసుంతో కలిపి నెలాఖరులోపు వసూలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

గురుకుల సెట్‌కు 1.29లక్షల మంది పోటీ

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదోతరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న గురుకుల సెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 1.26 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 20తో దరఖాస్తు గడువు ముగిసింది. ఏప్రిల్ 8న ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు గురుకులాల సొసైటీ ఏర్పాట్లు చేస్తోంది. అత్యధికంగా నల్గొండ జిల్లా నుంచి 9907 మంది దరఖాస్తు చేసుకోగా, ఆ తరువాత రంగారెడ్డి జిల్లా నుంచి 8142 మంది పోటీపడుతున్నారు. అత్యల్పంగా జనగాంలో 1277 మంది పోటీలో ఉన్నారు.

తెలుగు బోధనకు విద్యా వలంటీర్లు

- 1,100 తెలుగేతర మాధ్యమ పాఠశాలల్లో నియామకం!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని తెలుగేతర మాధ్యమ పాఠశాలల్లో తెలుగు బోధనకు ప్రభుత్వం విద్యా వలంటీర్లను నియమించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోధనాంశంగా తెలుగు తప్పనిసరని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 25,960 ప్రభుత్వ పాఠశాలలుండగా..వాటిల్లో 1,100 ఉర్దూ, కన్నడ, తమిళం, మరాఠీ మాధ్యమ బడులున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ పరిధిలోని తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఇప్పటికే ఒకటో తరగతి తెలుగును బోధిస్తున్నారు. ఇతర మాధ్యమ బడుల్లో వారి మాతృభాషలో బోధన సాగుతోంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఆ పాఠశాలల్లో కూడా తెలుగు బోధించడం తప్పనిసరి.

ఇప్పటికిప్పుడు సాధ్యమా?

ప్రతి పాఠశాలలో తెలుగు పండిట్‌లను నియమించుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో.. అక్కడ తెలుగు బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తెలుగు బోధనకు తెలుగు పండిట్‌లను నియమిస్తుండగా..ప్రాథమిక (ఒకటి నుంచి అయిదో తరగతి) పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లే (ఎస్‌జీటీ) బోధిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు శాశ్వత ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టే అవకాశాలు లేనందున..తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను నియమించే అవకాశాలున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నారు. అయితే అందుకు ఎస్‌జీటీలను నియమిస్తారా? తెలుగు పండిట్‌లను నియమిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ఈ విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత దానిపై కసరత్తు ప్రారంభిస్తామని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

వారికి పాత పుస్తకాలేనా?

సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు విద్యాశాఖ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం కోసం ఇప్పటికే 80 శాతానికి పైగా పుస్తకాలు జిల్లాలకు చేరుకున్నాయి. ఇతర మాధ్యమ పాఠశాలలకు కూడా.. ఒకటో తరగతి తెలుగు మాధ్యమ తెలుగు పుస్తకాలనే పాఠ్య పుస్తకాల విభాగం పంపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఈనెల 20న జరిగిన సమావేశంలో తెలుగేతర మాధ్యమ విద్యార్థుల కోసం సులభంగా ఉండే పాఠ్య ప్రణాళికను రూపొందించాలని తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడమీలను ఆదేశించారు. దీన్నిబట్టి చూస్తే 2018-19 విద్యా సంవత్సరంలో వాళ్లు పాత పుస్తకాలనే చదవక తప్పదని స్పష్టమవుతోంది.

రథయాత్రను అనుమతించక పోవడంపై వీహెచ్‌పీ పిటిషన్

నిర్ణయాన్ని నేటికి వాయిదా వేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు చేపట్టిన శ్రీరామ రథయాత్ర కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. శ్రీరామ రథయాత్రకు అనుమతించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ వీహెచ్‌పీ తెలంగాణ కార్యదర్శి ఎం.గాల్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎం.సీతారామమూర్తి విచారణ చేపట్టి నిర్ణయాన్ని గురువారానికి వాయిదా వేశారు. అంతకుముందు వీహెచ్‌పీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఉగాది సందర్భంగా ఈ నెల 18న బాసర నుంచి యాత్ర ప్రారంభమైందని, ఇది 31న సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వద్ద ముగిసేలా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమ నిర్వహణకు పోలీసుల అనుమతికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. విద్యార్థుల వార్షిక పరీక్షలు జరుగుతున్నాయన్న కారణంగా అనుమతిని నిరాకరించారనగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్ని వాహనాల్లో, ఎంతమంది పాల్గొంటున్నారని ప్రశ్నించారు. ఇది పెద్ద ఊరేగింపు కాదని, 10 మంది కలిసి ప్రారంభించిన యాత్రలో ఒక్కో గ్రామం చేరుకోగానే గ్రామస్థులు పాల్గొంటారని, గ్రామం చివరికి వచ్చి వెనక్కి వెళుతుంటారన్నారు. కోర్టు విధించే షరతులకు అనుగుణంగా యాత్రను నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని నిఘావర్గాల సమాచారం మేరకు అనుమతిని నిరాకరించినట్లు చెప్పారు. అంతేకాక ఇది మైనారిటీల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి గురువారం నిర్ణయం వెలువరిస్తామంటూ వాయిదా వేశారు.

ఆలస్యం కానున్న 'యాదాద్రి' ఎంఎంటీఎస్?

- టెండర్ల ప్రక్రియను వాయిదా వేసిన ఆర్‌వీఎన్‌ఎల్
- సవరించిన అంచనాకు ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రధాన పుణ్యక్షేత్రం యాదాద్రికి రైలు సదుపాయం కల్పించే ఎంఎంటీఎస్-రెండో దశ విస్తరణ ఆలస్యమయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇప్పటికే ఈ పనులకోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్) టెండర్లు ఆహ్వానించింది. బుధవారం బిడ్లు తెరవాల్సి ఉండగా జరగలేదు. సవరించిన ప్రాజెక్టు అంచనా వ్యయానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. అయితే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని ఆర్‌వీఎన్‌ఎల్ వర్గాల సమాచారం. దీంతో బిడ్లు తెరిచే తేదీని మే 3కు వాయిదా వేసినట్లు తెలిసింది.

జులైలోనే సవరించిన అంచనా

ఎంఎంటీఎస్ రెండోదశలో భాగంగా వరంగల్ రహదారిలో ఘట్‌కేసర్ వరకు నిర్మాణం అవుతోంది. యాదాద్రి పుణ్యక్షేత్రం వెళ్లే భక్తుల కోసం ఈ ప్రాజెక్టును విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో రైల్వేశాఖ అంగీకరించింది. ఇందు కోసం రాయగిరి వరకు చేపట్టాల్సి ఉంది. నిర్మాణ వ్యయంలో మూడింట రెండొంతులు రాష్ట్ర ప్రభుత్వం, మిగిలింది ఆర్‌వీఎన్‌ఎల్ భరించేలా ఒప్పందం కుదిరింది. తొలుత యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు ప్రాథమిక అంచనా వ్యయం రూ. 330 కోట్లు. క్షేత్రస్థాయి అధ్యయనం తర్వాత అది రూ. 412 కోట్లకు పెరిగింది. దీనికి ఆర్‌వీఎన్‌ఎల్ జులైలోనే ఆమోదం తెలిపినా టెండర్లు పిలవడంలో ఆలస్యమయింది. ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. వీటి దాఖలుకు మార్చి 20తో గడువు పూర్తవగా 21న బిడ్లు తెరిచి వచ్చిన వాటిలో అర్హతల్ని తేల్చే ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. కానీ 20వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం రాకపోవడంతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల విడుదల ఆలస్యం అవుతుందని రైల్వేశాఖ చెబుతున్న నేపథ్యంలో యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ ఆలస్యం కాక తప్పదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టు స్వరూపం

- ★ మొత్తం దూరం: 33 కిమీ
- ★ ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు
- ★ స్టేషన్ల సంఖ్య: 5. ఘట్‌కేసర్, బీబీనగర్, పగిడిపల్లి, భువనగిరి, రాయగిరి.

టీఎస్‌ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను అరికట్టాలి: చాడ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: టీఎస్‌ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను అరికట్టి సంస్థను నష్టాల్లోంచి గట్టెక్కించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన మూడోరోజు దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. . వేతన సవరణ అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన డిమాండు చేశారు. దీక్షలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వెంకట్‌గౌడ్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' ప్రాజెక్టు కొత్తది కాదు

గోదావరి బోర్డుకు చెప్పిన తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కొత్తది కాదని తెలంగాణ.. గోదావరి నదీ యాజమాన్య బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ దుమ్ముగూడెం పథకాలను పునరాకృతి చేయడం ద్వారా సీతారామ ఎత్తిపోతల చేపట్టాం తప్ప కొత్తగా కాదని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు నివేదిక అందజేయాలని గోదావరి బోర్డు తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను కోరింది. దీనిపై ఖమ్మం జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ గోదావరి బోర్డుకు లేఖ రాసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఎక్కువ ఆయకట్టుకు ప్రయోజనం కలిగేలా రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను పునరాకృతి చేసి సీతారామ ఎత్తిపోతల చేపట్టామంటూ సంబంధిత వివరాలను నివేదించినట్లు సమాచారం.

ఉద్యోగుల ఆరోగ్య పథకం సీఈఓగా డా.మనోహర్

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్య పథకం నూతన ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా డా.మనోహర్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకూ ఉద్యోగుల ఆరోగ్య పథకం సీఈఓగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈఎస్ఐ సంయుక్త సంచాలకులు డా.కె.పద్మను ఆ పదవి నుంచి తొలగించింది. ఆమె స్థానంలో డా.మనోహర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే వర్తిస్తాయని పేర్కొన్నారు. డా.మనోహర్ ఇప్పటికే నిమ్స్ సంచాలకులుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓగా కొద్ది నెలల కిందటే అదనపు బాధ్యతలిచ్చారు. ఇప్పుడు తాజాగా ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్య పథకాన్ని కూడా ఆయనకే అప్పగించారు.

లైసెన్స్ సంస్థల ఎగుమతులకు ఎన్వోసీలు అవసరం లేదు

కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఔషధ పరిశ్రమలు తమ ఉత్పత్తుల ఎగుమతుల సందర్భంగా కేంద్ర ఔషధ ప్రామాణిక నియంత్రణ సంస్థ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్వోసీ) పొందాలనే నిబంధనను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం తొలగించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం అందించింది. ఎగుమతులకు సంబంధించిన బిల్లులను సమర్పించడంతో పాటు ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద లైసెన్స్ పత్రం ఉన్న సంస్థలకు దీనిని వర్తింపజేస్తామని పేర్కొంది. గత నెలలో జరిగిన బయో ఆసియా సదస్సు సందర్భంగా మంత్రి కేటీఆర్ ఎన్వోసీ సమస్యను జాతీయ ఔషధ నియంత్రణాధికారి ఈశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి ఆయన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు విన్నవించడంతో లైసెన్స్, బిల్లులు గల సంస్థలకు ఎన్వోసీలు అవసరం లేదని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కేటీఆర్ హర్షం: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. మందులు, టీకాల ఉత్పత్తితో ఔషధ రంగంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణకు ఈ నిర్ణయం ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. వైద్యపరికరాల ఉత్పత్తిని రాష్ట్రం ఇటీవలే ప్రారంభించిందని, దీని ద్వారా పెద్దఎత్తున ఎగుమతులు జరుగుతాయని.. ఎన్వోసీల మినహాయింపు వల్ల పరిశ్రమలకు లాభదాయకమని చెప్పారు. ఔషధరంగానికి సంబంధించిన మరో 12 ప్రధాన సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, వాటికి త్వరలోనే పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నామన్నారు.

న్యూటన్, డార్విన్‌ల సరసన హాకింగ్ సమాధి

31న కేంబ్రిడ్జ్‌లో అంత్యక్రియలు

లండన్: విశ్వఖ్యాతిని ఆర్జించిన సర్ ఐజాక్ న్యూటన్, ఛార్లెస్ డార్విన్‌లతో సమానంగా గౌరవిస్తూ.. ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ భౌతిక అవశేషాలను కూడా ఇక్కడి వెస్ట్‌మినిస్టర్ అబేలో ఈ సంవత్సరాంతంలో సమాధి చేయనున్నారు. ఈనెల 14న హాకింగ్ కన్నుమూసిన సంగతి తెలిసిందే. అంత్యక్రియలను మార్చి 31న నిర్వహించడానికి ఆయన కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈస్టర్ శనివారం సందర్భంగా కేంబ్రిడ్జ్‌లోని విశ్వవిద్యాలయ చర్చి అయిన గ్రేట్ సెయింట్ మేరీస్‌లో సంప్రదాయ బద్ధంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తమ తండ్రి ఎంతగానో ప్రేమించే ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు హాకింగ్ పిల్లలు టూసీ, రాబర్ట్, టిమ్ తెలిపారు. కేంబ్రిడ్జ్‌లో 50 ఏళ్లకు పైగా ఆయన నివసించి పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు.

రికార్డులో 'జి' ఉంటే ప్రభుత్వానిదేనా?

- యాజమాన్య హక్కులపై సివిల్ కోర్టుకెళ్లి తేల్చుకోండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లిలో కొనుగోలు చేసిన స్థలాలు ప్రభుత్వానివని భావిస్తున్నట్లయితే సిటీ సివిల్ కోర్టుకెళ్లి యాజమాన్య హక్కులను తేల్చుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. నాంపల్లిలోని ఆగాపూర్‌లో 558, 870 చదరపు గజాల స్థలం ప్రభుత్వానికి చెందినదని ఖాళీ చేయాలంటూ ఇచ్చిన నోటీసులపై కమల్ కిశోర్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి ఈ స్థలం కమల్ కిశోర్ అగర్వాల్‌దేనంటూ గతంలో తీర్పునిచ్చారు. దీనిపై ప్రభుత్వం అప్పీలు దాఖలు చేయగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 1963నాటి టౌన్ సర్వే లాండ్ రికార్డులో 'జి' అంటూ ఉందని, ఇది ప్రభుత్వ స్థలమైనందున ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. కాగా అదే 1963నాటి రికార్డులో ఆ స్థలం ఫతీమున్నీసాకు చెందినట్లుగా పేర్కొన్నారని, ఆమె నుంచి పిటిషనర్ కొనుగోలు చేశారని, రికార్డులో 'జి' అని రాసినంత మాత్రన స్థలం ప్రభుత్వానికి చెందుతుందా అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. రేపు మేమున్న ఇంటి స్థలం కూడా 'జి' అని రికార్డులో ఉందని ఖాళీ చేయమంటారా?, హక్కుల కోసం మేము కోర్టుల చుట్టూ తిరగాలా అంటూ ప్రశ్నించింది. స్థలంపై యథాతథస్థితిని కొనసాగించాలని, యాజమాన్య హక్కులపై సివిల్ కోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. యాజమాన్య హక్కుల కోసం ప్రభుత్వాన్ని సివిల్ కోర్టుకు వెళ్లడమనడం సరికాదన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. నాలుగువారాల్లో సివిల్ కోర్టును ఆశ్రయించని పక్షంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది.

రాజకీయ మార్పునకు సిద్ధంకండి..!

అభిమానులకు రజనీకాంత్ వీడియో సందేశం

ఈనాడు డిజిటల్, చెన్నై: తన వెనుక దేవుడు, ప్రజలు ఉన్నారని మంగళవారం వ్యాఖ్యానించిన సూపర్‌స్టార్ రజనీకాంత్... రాష్ట్రంలో రాజకీయ మార్పునకు సిద్ధం కావాలని అభిమానులకు బుధవారం దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. మక్కల్ మండ్రంలో పదవులు దక్కలేదని నిరుత్సాహ పడవద్దని, అందరూ ఐక్యంగా రాష్ట్రంలో భారీ రాజకీయ మార్పునకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ప్రారంభిస్తామని అందులో స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలని దేవుడు ఒక అవకాశం ఇచ్చాడని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
కలెక్టర్ కార్యాలయం, పెద్దపల్లి జిల్లా.

ప్రొ.నెం. బి1/2572/2017 తేది : 20/03/2018

ఫారము-సి

(భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలందు పారదర్శకత మరియు సముచితమైన నష్టపరిహారపు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం-2016 (రాష్ట్ర చట్టము 21/2017) ద్వారా సవరించబడిన, కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) క్రమము మరియు 19వ నిబంధనలననుసరించి (రూల్ 6/12 చూడుము)

ప్రకటన

పెద్దపల్లి జిల్లా, మంథని మండలములోని సిరిపురం గ్రామము పరిధిలో గల, ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి మొత్తం విస్తీర్ణము ఎ. 20.23 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా "కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సుందిళ్ల గ్రామము రామగిరి మండలము వద్ద గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మాణము చేయుటకు" కొరకు అవసరమైయున్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయడమైనది.

షెడ్యూలు

గ్రామము : సిరిపురం | మండలము : మంథని | జిల్లా : పెద్దపల్లి

క్రమ సం.	సర్వే నెం.	రకము (పట్టా/ ప్రభుత్వ భూమి)	భూమిరకం (తరి/ మెట్ట)	భూసేకరణ కింద విస్తీర్ణం (ఎకరాలలో)	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (నిర్మాణములు, చెట్లు వగైరా)
1	2	3	4	5	6	7
1	10	పట్టా	మెట్ట	0.21	పట్టాదారులు & అనుభవదారులు : కొనిపాక రామక్క, భర్త రాయపోచం, మల్లోజుల రాజబాబు, రేగళ్ల బుచ్చయ్య, గోదరి రాజం, తండ్రి పోచయ్య, గోదరి శంకర్, తండ్రి చంటయ్య, గోదరి ఎర్రక్క, తండ్రి పోచం, గోదరి మల్లమ్మ, భర్త లింగయ్య, అక్కపాక తిరుపతి, తండ్రి ఐలయ్య, అక్కపాక పోచం	2 చేలు
2	14	పట్టా	మెట్ట	0.29	పట్టాదారులు&అనుభవదారులు : పెర్కం మధునమ్మ, భర్త మధునయ్య, మెండే రాములు, తండ్రి భూమయ్య, పెర్కం మధునమ్మ, భర్త మధునయ్య, బండారి పాపయ్య, తండ్రి సమ్మయ్య	-
3	47	పట్టా	మెట్ట	1.24	పట్టాదారులు&అనుభవదారులు : మల్లోజుల కిషన్ రావు, తండ్రి రాజన్న	-
4	49	పట్టా	మెట్ట	1.12	పట్టాదారులు & అనుభవదారులు : కుమ్మరి శంకర్, తండ్రి మల్లయ్య, సుందిళ్ల బ్యారేజీ, కుమ్మరి మహేష్, తండ్రి గట్టయ్య, కుమ్మరి పోశక్క, భర్త చిలుకయ్య, కుమ్మరి లచ్చులు, గోదరి సంతోష్, తండ్రి రాజం, కుమ్మరి లస్మయ్య, తండ్రి కుమ్మరి, కుమ్మరి శంకర్, తండ్రి మల్లయ్య, వొడరి రాజయ్య, తండ్రి పోచం	-
5	50	ఇనాం/ ప్రభుత్వ భూమి	మెట్ట	0.37	పట్టాదారులు & అనుభవదారులు : గోదరి మధునయ్య, తండ్రి రాయపోచం, గోదరి సతీష్, తండ్రి శంకర్, పసపర్తి భూదేవి, తండ్రి రాజయ్య, గిట్టపల్లి మల్లేశ్వరి, భర్త సురేష్, వెన్నెలదేవి స్వరూప, భర్త రాములు	-
6	63	ప్రభుత్వ భూమి (పరం పోగు)	మెట్ట	2.14	పట్టాదారులు : గోదరి శంకర్, తండ్రి చంటయ్య, పెర్కం బానయ్య, తండ్రి గట్టయ్య, కుమ్మరి రాజయ్య, తండ్రి మల్లయ్య, గోదరి రామయ్య, తండ్రి పోచయ్య, పరంపోగు, అనుభవదారులు : గోదరి శంకర్, తండ్రి చంటయ్య, పెర్కం బానయ్య, తండ్రి గట్టయ్య, ఆకుదారి మహేష్, తండ్రి పోచం, కుమ్మరి పోశక్క, భర్త రామమల్లు, కుమ్మరి మహేష్, తండ్రి గట్టయ్య, కుమ్మరి లింగమ్మ, తండ్రి పోచం, కుమ్మరి శంకర్, తండ్రి మల్లయ్య, గోదరి రామయ్య, తండ్రి పోచయ్య	4-చేలు, 3-తాటి
7	70	పట్టా	మెట్ట	0.29	పట్టాదారులు & అనుభవదారులు : అరుణ లావణ్య, తండ్రి రాజం, కుమ్మరి మహేష్, తండ్రి గట్టయ్య	-
8	71	పట్టా	మెట్ట	0.31	పట్టాదారులు & అనుభవదారులు : గుడిపెల్లి చంద్రయ్య, తండ్రి రాజయ్య	-
9	72	పట్టా	మెట్ట	0.32	పట్టాదారులు & అనుభవదారులు : మండపల్లి మధు, భర్త పేరయ్య, గుడిపెల్లి చంద్రయ్య, తండ్రి రాజయ్య, జక్కరి రాయమల్లు, తండ్రి రాయలింగు, అక్కపాక మహేష్, తండ్రి లింగయ్య, అక్కపాక సతీష్, తండ్రి లింగయ్య, ఉడుత లచ్చయ్య, తండ్రి గట్టయ్య, జక్కరి లస్మయ్య, తండ్రి ముత్తయ్య	4-సపోటాలు
10	82	పట్టా	మెట్ట	0.34	పట్టాదారులు & అనుభవదారులు : జనంపెల్లి మల్లయ్య, జనంపెల్లి గట్టయ్య, అక్కపాక పేరుమల్లు, సమ్మల శ్రీనివాస్, జనంపెల్లి లలిత, భర్త లింగయ్య	-
11	83	పట్టా	మెట్ట	0.26	పట్టాదారులు & అనుభవదారులు : జనంపెల్లి గట్టయ్య, తండ్రి జనంపెల్లి	-
12	84	పట్టా	మెట్ట	2.27	పట్టాదారులు & అనుభవదారులు : అక్కపాక ఎల్లయ్య, తండ్రి పోచయ్య, అక్కపాక బానయ్య, తండ్రి మల్లయ్య, పుల్లె కిష్టయ్య, తండ్రి రాయలింగు, కన్నం రామస్వామి, తండ్రి సాయిలు, జోడు రమేష్, తండ్రి రాజేశం, ఆకుతోట వెంకటేశం, తండ్రి రామస్వామి, మల్లోజుల లక్ష్మీబాయి	1-చేను
13	85	పట్టా	మెట్ట	1.17	పట్టాదారులు : పాముగంటి అంజక్క, కొనిపేట రామక్క, భర్త రాయపోచం, జనంపెల్లి వెంకటేశం, తండ్రి రాజయ్య, జనంపెల్లి రాజేశం, తండ్రి రాజయ్య, మల్లోజుల లక్ష్మీ బాయి, ఆరెకల కొటేశ్వర్, తండ్రి లింగయ్య, జోడు రమేష్, తండ్రి రాజేశం, ఆకుతోట వెంకటేశం, తండ్రి రామస్వామి, అక్కపాక మధునమ్మ, భర్త లింగయ్య, అనుభవదారులు : పాముగంటి అంజక్క, కొనిపేట రామక్క, భర్త రాయపోచం, జనంపెల్లి వెంకటేశం, తండ్రి రాజయ్య, జనంపెల్లి రాజేశం, తండ్రి రాజయ్య, మల్లోజుల లక్ష్మీ బాయి, ముడిగళ్ల విలేద్, వొర్ర గట్టయ్య, ఆరెకల కొటేశ్వర్, తండ్రి లింగయ్య, జోడు రమేష్, తండ్రి రాజేశం, ఆకుతోట వెంకటేశం, తండ్రి రామస్వామి, అక్కపాక మధునమ్మ, భర్త లింగయ్య	-
14	117	పట్టా	మెట్ట	1.10	పట్టాదారులు & అనుభవదారులు : జోడు రమేష్, తండ్రి రాజేశం, పాముకంటియాజి, ఆకుతోట వెంకటేశం, తండ్రి రామస్వామి	10 ఈతలు
15	118	పట్టా	మెట్ట	0.24	పట్టాదారులు & అనుభవదారులు : ఎర్ర రాజయ్య, తండ్రి చిన్న పోచయ్య, వేల్పుల లింగమ్మ, భర్త కొమురయ్య, ఉరగొండ మల్లయ్య, తండ్రి ఎల్లయ్య, వొట్టు రామయ్య, తండ్రి వెంకటయ్య, వొట్టు మహేందర్, తండ్రి వెంకటయ్య, వొట్టు కిష్టయ్య, తండ్రి వెంకటయ్య, వొట్టు సత్యనారాయణ, తండ్రి వెంకటయ్య, వొట్టు ప్రభాకర్, తండ్రి వెంకటయ్య, వెల్లి మహేష్ కుమార్, తండ్రి రఘురాం రావు, వెల్లి శ్రీనివాస్ రావు, తండ్రి రామ రావు, వెల్లి విశ్వనాథ రావు, తండ్రి రఘురాం రావు	-
16	119	పట్టా	మెట్ట	0.18	పట్టాదారులు & అనుభవదారులు : ఎర్రడి గట్టయ్య, తండ్రి మల్లయ్య, బార్ల చీరయ్య, తండ్రి చీరయ్య, వేల్పుల లింగమ్మ, భర్త కొమురయ్య, సున్నపు పుల్లమ్మ, భర్త చిన్న సమ్మయ్య, సున్నపు సంపత్, తండ్రి పెద్ద సమ్మయ్య, సున్నపు శ్రీనివాస్, తండ్రి పెద్ద సమ్మయ్య, గొర్ల కుమారస్వామి, తండ్రి మల్లయ్య, గొర్ల సంతోష్ కుమార్, తండ్రి మల్లయ్య, పోతు ఇలాయి	10 ఈతలు
17	120	పట్టా	మెట్ట	0.18	పట్టాదారులు & అనుభవదారులు : ఎర్రడి గట్టయ్య, తండ్రి మల్లయ్య, బార్ల చీరయ్య, తండ్రి చీరయ్య, వొట్టు రామయ్య, తండ్రి వెంకటయ్య, వొట్టు మహేందర్, తండ్రి వెంకటయ్య, వొట్టు కిష్టయ్య, తండ్రి వెంకటయ్య, వొట్టు సత్యనారాయణ, తండ్రి వెంకటయ్య, వొట్టు ప్రభాకర్, తండ్రి వెంకటయ్య, సున్నపు పుల్లమ్మ, భర్త చిన్న సమ్మయ్య, సున్నపు సంపత్, తండ్రి పెద్ద సమ్మయ్య, సున్నపు శ్రీనివాస్, తండ్రి పెద్ద సమ్మయ్య, గొర్ల కుమారస్వామి, తండ్రి మల్లయ్య, గొర్ల సంతోష్ కుమార్, తండ్రి మల్లయ్య, పెండాల వెంకయ్య	20 తాటి
18	121	పట్టా	మెట్ట	1.05	పట్టాదారులు & అనుభవదారులు : మెండే విజయ, తండ్రి కిష్టయ్య, కనుకుల సత్తయ్య, తండ్రి వాలయ్య, పెల్లి సాంబ్రి, భర్త వసంత్ రావు	1- కంక, 1 ఈతు, 1- సెన్గింగ్, ఎక్ పోల్స్
19	122	పట్టా	మెట్ట	0.17	పట్టాదారులు & అనుభవదారులు : సున్నపు పెద్ద, భర్త మల్లయ్య, సున్నపు శ్యామల, భర్త తిరుపతి, రాంపెల్లి నర్సింహులు, తండ్రి రాంపెల్లి	-
20	123	పట్టా	మెట్ట	0.32	పట్టాదారులు & అనుభవదారులు : అక్కపాక మహేష్, తండ్రి లింగయ్య, అక్కపాక సతీష్, తండ్రి లింగయ్య	-
21	170	ప్రభుత్వ భూమి	మెట్ట	0.06	పట్టాదారులు & అనుభవదారులు : చీకట్ల ఐలక్క, భర్త రాజు, అక్కపాక పోచం, తండ్రి మల్లయ్య, సిల్ల పోశక్క, తండ్రి ఎల్లయ్య, గజ్జల పోచం, అక్కపాక రామయ్య, తండ్రి సర్వయ్య, పరంపోగు/ప్రభుత్వ భూమి, అనుభవదారులు : తండ్రి కనకయ్య, చిల్ల రాజయ్య, తండ్రి పోచయ్య, చిల్ల రాములు, తండ్రి పోచం, కొనిపేట కొమురయ్య, తండ్రి గట్టయ్య, అక్కపాక పోచయ్య, తండ్రి బానయ్య, వేల్పుల మల్లయ్య, తండ్రి మల్లయ్య, గొట్టెపల్లి రమాదేవి, భర్త రాజమల్లు, గొర్ల రాజలింగు, తండ్రి గంగయ్య, అక్కపాక మధునమ్మ, భర్త లింగయ్య, కొమిరెకుంట సత్తయ్య, తండ్రి రామయ్య, కుందెం సత్తయ్య, తండ్రి బాలయ్య, అక్కపాక రాజయ్య, తండ్రి రామయ్య, కొనిపేట రాజం, తండ్రి పోచాలు, కొనిపేట రాజేశం, తండ్రి పోచాలు, కొనిపేట లింగయ్య, తండ్రి పోచాలు, అక్కపాక మల్లయ్య, కొనిపేట రామయ్య, జనంపెల్లి మల్లయ్య	-
		మొత్తం		20.23		

ప్రొ.నెం. బి1/2407/2017 తేది : 20/03/2018

పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఉప్పట్ల గ్రామము పరిధిలోగల, ఈ దిగువ షెడ్యూల్‌నందు చూపబడిన భూమి మొత్తం ఎ.2-39 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా "కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పంప్ హౌజ్ నిర్మాణము, 160 టి.ఎం.సి. ల నీటిని అన్నారం బ్యారేజ్ నుండి సుందిళ్ల బ్యారేజ్‌లోనికి ఎత్తిపోయుట" కొరకు అవసరమైయున్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయడమైనది.

షెడ్యూలు

గ్రామము : ఉప్పట్ల | మండలము : మంథని | జిల్లా : పెద్దపల్లి

క్రమ సం.	సర్వే నెం.	రకము	భూమిరకం	విస్తీర్ణం	అనుభవదారు(ల) పేరు(లు)	ఇతర వివరములు
1	47	పట్టా	మెట్ట	2-39	పట్టాదారులు&అనుభవదారులు: జక్కని రాజమ్మ, భర్త రామచంద్రం, కొనిపేట స్వర్ణ, భర్త నాగరాజు, కొనిపేట శ్రీనివాస్, తండ్రి శ్రీనివాస్, దెస్నూరి మల్లయ్య, తండ్రి రాజయ్య, కార్యనిర్వాహక ఇంజనీరు నీటిపారుదల శాఖ కాళేశ్వరంప్రాజెక్టు, డివిజన్-2	4 చేను
			మొత్తము	2-39		

ప్రొ.నెం. బి1/1807/2017 తేది : 20/03/2018

పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గుంజపడుగు గ్రామము పరిధిలోగల, ఈ దిగువ షెడ్యూల్‌నందు చూపబడిన భూమి మొత్తం ఎ.5-00 గుంటలు భూమి ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా "కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పంప్ హౌజ్ నిర్మాణము, 160 టి.ఎం.సి. ల నీటిని అన్నారం బ్యారేజ్ నుండి సుందిళ్ల బ్యారేజ్‌లోనికి ఎత్తిపోయుట" కొరకు అవసరమైయున్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయడమైనది.

షెడ్యూలు

గ్రామము : గుంజపడుగు | మండలము : మంథని | జిల్లా : పెద్దపల్లి

క్రమ సం.	సర్వే నెం.	రకము	భూమిరకం	విస్తీర్ణం	అనుభవదారు(ల) పేరు(లు)	ఇతర వివరములు
1	784	సి.సి	మెట్ట	5.00	పట్టాదారులు&అనుభవదారులు: పోరండ్లకు, బోగి సంపత్, భర్త రాజారాం, ఎరుకల పోచమ్మ, భర్త లస్మయ్య, బోగి మల్లమ్మ, భర్త రాజయ్య, టి.శ్రీనివాసరెడ్డి, తండ్రి రామిరెడ్డి	
			మొత్తం	5.00		

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలందు పారదర్శకత మరియు సముచితమైన నష్టపరిహారపు హక్కు(తెలంగాణ సవరణ) చట్టం - 2016 (రాష్ట్ర చట్టం 21/2017) ద్వారా సవరించబడిన, కేంద్ర భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలందు పారదర్శకత మరియు సముచితమైన నష్టపరిహారపు హక్కు చట్టం, 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) ప్రకారము సంబంధిత భూయజమానులందరికీ తెలియచేయుటకు గాను జారీ చేయబడినది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్, పెద్దపల్లి మరియు భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, మంథని గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినము కార్యాలయ వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

సదరు చట్టం లోని సెక్షన్ 12 ననుసరించి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు మరియు భూ సేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, మంథని గారిని మరియు వారి సిబ్బంది సదరు భూములలో ప్రవేశించి, సర్వే మరియు ఇతర పనులు చేయుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టం లోని సెక్షన్ 11(4) ననుసరించి, భూ సేకరణకు ప్రతిపాదించిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేది నుండి షెడ్యూల్ లో ప్రకటించిన భూములకు సంబంధించి ఎటువంటి క్రయ విక్రయాలు, లావా దేవీలు/ తాకట్టు లేదా ఏ ఇతర లావాదేవీలు జరుపరాదని తెలియజేస్తినైనది.

ప్రతిపాదిత భూ సేకరణ పై ఏదైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల మరియు నష్టపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారము కొరకు ప్రభావితమైన/ప్రయోజనముగల వ్యక్తులందరూ, సదరు చట్టం లోని సెక్షన్ (15) ననుసరించి, ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేది నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారికి/భూ సేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, మంథని గారికి లిఖితపూర్వకముగా దాఖలు చేసుకోవచ్చును.

సం/-	సం/-	సం/-
భూసేకరణ అధికారి& రెవెన్యూ డివిజనల్ అధికారి, మంథని.	సంయుక్త కలెక్టర్, పెద్దపల్లి.	జిల్లా కలెక్టర్, పెద్దపల్లి.

గుర్తింపు కోసమే అయితే ఇదంతా ఎందుకు?

- ఆధార్‌పై కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- దృశ్యాత్మక వివరణకు అనుమతి కోరిన ప్రభుత్వం
- బినామీల ఏరివేతకు ఆధార్ దోహదం: ఏజీ

దిల్లీ: పౌరుల గుర్తింపు కోసమే అయితే ఆధార్ పథకం కింద వారి వ్యక్తిగత వివరాలన్నింటినీ క్రోడీకరించాల్సిన ఆవశ్యకత ఏం వచ్చిందని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. 'పౌరుల గుర్తింపే మీ ఏకైక లక్ష్యమైతే దానికి ఇంతకంటే సులువైన పద్ధతులు ఉన్నాయి. వ్యక్తిగత వివరాలన్నింటినీ గుదిగుచ్చి, కేంద్రీకృతంగా ఒకచోట ఉంచాల్సిన అవసరమేమిటి?... సింగపూర్‌ను చూడండి. అక్కడ ప్రతీ ఒక్క పౌరుడికీ చిప్ ఆధారిత గుర్తింపు పత్రం (ఐడీ కార్డు) ఉంటుంది. వారి వారి వ్యక్తిగత సమాచారమంతా ఆయా వ్యక్తుల వద్ద ఉంటుందే గానీ ప్రభుత్వ సంస్థల వద్ద కాదు' అని స్పష్టంచేసింది. ఆధార్ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది.

సమాచార భద్రతకు గట్టి చర్యలు: కేంద్రం తరపున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ వాదిస్తూ- ఆధార్‌లో సమాచార క్రోడీకరణ సాధ్యం కాదన్నారు. సమాచార భద్రతకు అవసరమైన చర్యలన్నింటినీ ప్రభుత్వం తీసుకొందని తెలిపారు. ఏ రూపంలోనూ సమాచారం బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆధార్‌పై అపోహలను, ప్రజల ఆందోళనను తొలగించడానికి వీలుగా 'భారత విశిష్ఠ గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ' (ఉడాయ్) తరపున దృశ్యాత్మక వివరణను సుప్రీంకోర్టులో ఇచ్చేందుకు అనుమతించాలని కోరారు. న్యాయస్థానం గదిలో ఇలాంటి సమర్పణ ఇవ్వాల్సిన అవసరం ఉందో లేదో చర్చించి గురువారం తమ అభిప్రాయం తెలియజేస్తామని సీజేఐ తెలిపారు. ఆధార్‌తో వ్యక్తుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన సహా పిటిషనర్లు లేవనెత్తిన విషయాలపై ప్రతివాదనలు వినిపించాలని ఏజీకి సూచించారు.

పింఛన్ పొందడానికి ఆధార్ ఎందుకు?: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పింఛన్ పొందేందుకు ఆధార్‌ను తప్పనిసరిగా పేర్కొనాలని ప్రభుత్వం చెప్పడంలో ఔచిత్యాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. ఏళ్ల తరబడి ప్రభుత్వంతో పనిచేసినవారి గుర్తింపులో సందేహం ఏముంటుందని అడిగింది. ఈ కారణంతో ఎవరికీ బకాయిలను చెల్లించకుండా ఆపేయకూడదని స్పష్టంచేసింది. 70-80 ఏళ్ల వారిని ఆధార్ కోసం ఒత్తిడి చేయడం తగదంది. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు ఆధార్ కోసం దరఖాస్తు చేయలేనంత మాత్రాన పింఛన్ ప్రయోజనాలు తిరస్కరించరాదంది. కొన్ని సంస్థలు తప్పిస్తే ఆధార్‌పై వ్యక్తులెవరూ కోర్టును ఆశ్రయించలేదని ఏజీ చెప్పారు. అసంపూర్తిగా మిగిలిన వాదనలు గురువారం కూడా కొనసాగుతాయి.

సిక్కు యువతకు .. పాక్ ఐఎస్ఐ శిక్షణ

- పార్లమెంటరీ సంఘానికి హోంశాఖ నివేదిక

దిల్లీ: భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రేరేపిస్తూ.. సిక్కు యువతకు పాకిస్థాన్‌లోని ఐఎస్ఐ శిక్షణ ఇస్తున్నట్లు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈమేరకు భాజపా సీనియర్ నేత మురళీమనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటు అంచనాల కమిటీకి హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలోని బృందం నివేదిక సమర్పించింది. 'కేంద్ర సాయుధ పోలీసు దళాలు, అంతర్గత భద్రత సవాళ్లు.. అంచనాలు, అనుక్రియ విధానాల'పై సమర్పించిన నివేదికలో పలు అంశాలను వివరించింది. "కెనడా, ఐరోపా, అమెరికాల్లో నివసిస్తున్న, స్థిరపడిన సిక్కులను తప్పుతోవ పట్టిస్తూ.. వారిని పాక్ ఐఎస్ఐ భారత్‌పైకి ఉసిగొలుపుతోంది. పంజాబ్‌లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కుట్రలకు గాను పాక్‌కు చెందిన సిక్కు ఉగ్రవాద ముఠాల కమాండర్లపై ఒత్తిడి పెంచుతోంది. ఈమేరకు ఖైదీలు, నిరుద్యోగ యువత, నేరస్థులు, దొంగ వ్యాపారం చేసేవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. నిఘాకు, చట్టాలను అమలుచేసే సంస్థలకు చిక్కకుండా సురక్షితమైన(సెక్యూర్డ్) సామాజిక మాధ్యమాలు, అంతర్జాల ప్రాక్సీ సెర్వర్లను ఉగ్రవాద సంస్థలు వినియోగిస్తున్నాయి. ఒంటరిగా ఉగ్రదాడులకు కూడా కుట్రలు పన్నుతున్నాయి. ఇది అంతర్గత భద్రతకు సవాల్‌గా మారింది. భారత్‌కు హాని తలపెట్టేందుకు పాక్‌లోని జైషే మహమ్మద్ (జేఈఎం) వేరుగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. భారత ఉపఖండంలో.. ఐఎస్, ఆల్‌ఖాయిదాలు భద్రతపరంగా కొత్త సవాళ్లు విసురుతున్నాయి. దేశంలోని అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాద సంస్థలతో కూడా ముప్పు ఉంది. వీటిలో 2004లో ఏర్పాటైన సీపీఐ(మావోయిస్ట్)దే ప్రధానపాత్ర.." అని నివేదికలో వివరించింది. ఈ పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నిశితంగా గమనిస్తూ.. అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు.. లష్కరే తోయిబా, జేఈఎం, ఇండియన్ ముజాహిదీన్ నుంచి వేరుపడిన సంస్థలు, సిమీ, అల్-ఉన్మాహ్ వంటివాటిపై భారత్ నిరంతరం దృష్టి సారించినట్లు పేర్కొంది.

2జీ కేసులో రాజా, కనిమొళిలకు దిల్లీ హైకోర్టు నోటీసులు

దిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేసులో టెలికాం మాజీమంత్రి ఏ.రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులకు దిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులిచ్చింది. ఈ కేసుకు సంబంధించి వారిని ప్రత్యేక న్యాయస్థానం విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన వ్యాజ్యంపై సమాధానాలివ్వాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను మే 25కు వాయిదా వేసిన న్యాయస్థానం ఆ తేదీలోగా సమాధానాలివ్వాలని పేర్కొంది. కాగా ఈ కేసులో ఇప్పటికే ఈడీ దాఖలు చేసిన వ్యాజ్యంపై కూడా జస్టిస్ ఎస్.పి.గార్గ్ ఇలాంటి ఆదేశాలే ఇచ్చారు. ఈడీ జప్తుచేసిన దాదాపు రూ. 223 కోట్ల ఆస్తులపై యథాతథ స్థితిని కొనసాగించాలని కోరుతూ దర్యాప్తు సంస్థ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) తుషార్ మెహతా దాఖలు చేసిన మధ్యంతర వ్యాజ్యంపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఏఎస్‌జీ విజ్ఞాపన మేరకు జప్తుపై యథాతథస్థితిని కొనసాగించేందుకు అనుమతిస్తూనే.. దీనిపై ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చారని న్యాయస్థానం ప్రశ్నించింది. గత ఏడాది డిసెంబరు 21న రాజా, కనిమొళి, కరుణానిధి భార్య దయాళు అమ్మాల్ సహా 17 మందిని సీబీఐ, ఈడీ కేసుల నుంచి విడుదల చేస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఉద్యోగుల పదవీవిరమణ వయోపరిమితి పెంపు యోచన లేదు: కేంద్రం

దిల్లీ: కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయసు పరిమితిని 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర సిబ్బందిశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. ప్రస్తుతం 60 ఏళ్లుగా ఉన్న కేంద్రప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయసు పరిమితిని పెంచుతారా అన్న ప్రశ్నకు ఆయన 'లేదు' అంటూ లిఖితపూర్వకంగా తెలియచేశారు.

ఎలాంటి నిర్ణయమూ లేదు!: సూర్యోదయ, సూర్యాస్తమయాల వేళల్లో ఉన్న వ్యత్యాసాల దరిమిలా మనదేశంలోని ఆయా ప్రాంతాల్లో రెండు నిర్దిష్ట వేళల (టైమ్‌జోన్ల)అమలు అంశంపై కేంద్రం ఇంతవరకూ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. కేంద్రసైన్సు, టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్ ఈ విషయాన్ని లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలియచేశారు. భాజపా సభ్యుడు వరుణ్‌గాంధీ అడిగిన ప్రశ్నకు మంత్రి హర్షవర్ధన్ స్పందిస్తూ... ఈ అంశంపై 2002లో ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి సంఘాన్ని నియమించిందన్నారు. అయితే, ఇందులో కొన్ని రకాల ఇబ్బందులున్న దరిమిలా ఆ సంఘం ఈ అంశంపై ఎలాంటి సిఫారసూ చేయలేదన్నారు.

అఫ్గాన్‌లో ఆత్మాహుతి దాడిలో 32 మంది బలి

కాబూల్: అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రసంస్థ మరోసారి ఘాతుకానికి ఒడిగట్టింది. పర్షియన్ నూతన సంవత్సర వేడుక 'నవ్రూజ్'ను జరుపుకొంటున్నవారిని లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి బాంబు దాడికి పాల్పడింది. షియా దర్గాకు వెళ్లే రహదారిపై బుధవారం జరిగిన ఈ ఘటనలో.. 32 మంది మృత్యువాత పడ్డారు. 50కు పైగా మంది క్షతగాత్రులయ్యారు. కాబూల్ విశ్వవిద్యాలయానికి ఎదురుగా ఉన్న ఓ ఆసుపత్రి ముందు ఈ పేలుడు సంభవించింది.

ఏప్రిల్ 2 నుంచి హెచ్1బీ దరఖాస్తుల స్వీకరణ

ప్రీమియం ప్రాసెసింగ్ తాత్కాలికంగా నిలిపివేత

వాషింగ్టన్: విదేశీ నిపుణులను ఉద్యోగాల రీత్యా అమెరికాకు అనుమతించే హెచ్1బీ వీసాల దరఖాస్తుల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అక్టోబరు 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి(2019) సంబంధించిన ఈ దరఖాస్తులను ఏప్రిల్ 2వ తేదీ నుంచి స్వీకరించనున్నట్లు అమెరికా పౌర వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. అయితే, అమెరికాలోని కంపెనీల అవసరాల రీత్యా సత్వరమే హెచ్1బీ వీసాలను మంజూరు చేసేందుకు వీలున్న ప్రీమియం ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు యూఎస్‌సీఐఎస్ ప్రకటించింది. ప్రీమియం ప్రాసెసింగ్‌కు అధిక రుసుములను చెల్లించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వీసా దరఖాస్తులను పరిశీలించేందుకే ప్రీమియం ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వివరించింది. అయితే, 2019 సంవత్సర పరిమితిలోకి రాని ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తులను వాటి అత్యవసరాన్ని బట్టి పరిశీలనలోకి తీసుకుంటామని తెలిపింది. హెచ్1బీ వీసా పొందిన దరఖాస్తుదారు మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండేందుకు అనుమతిలభిస్తుంది. ఆ గడువును ఆరేళ్ల వరకూ కూడా పొడిగించే వీలుంది. ఒక్కో ఆర్థిక సంవత్సరానికి 65వేల హెచ్1బీ వీసాలను మాత్రమే అమెరికా జారీ చేస్తుంది. యూఎస్‌సీఐఎస్ సమాచారం ప్రకారం 2007-17 మధ్య 22 లక్షల మంది భారతీయులు హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేశారు. అదే కాలానికి చైనీయుల నుంచి మూడు లక్షలా వెయ్యి దరఖాస్తులు వెళ్లాయి.

మకరందం
ఈనాడు
కరీంనగర్
7
గురువారం
మార్చి 22, 2018
makarandam@eenadu.in
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



పవిత్ర జీవితం కోసం, ముక్తి కోసం సాధన చేసే యోగులు రామునిలా జీవించాలని అనుకుంటారు. చుట్టూ ఉన్న పరిస్థితులు ఎప్పుడైనా మారొచ్చు. ఎలాగైనా ఉండొచ్చు. నిరీక్షించి.. కాలపరీక్షను ఎదుర్కోవడం వివేకవంతుల లక్షణం. రాముడూ అదే చేశాడు. ఎప్పుడూ ప్రణాళిక బద్ధంగానే జీవితం నడుస్తుందని భావించలేం. మన ప్రమేయం లేకుండా చికాకులు కలుగుతాయి. వాటికి కుంగిపోతే జీవితం గతి తప్పుతుంది. గుచ్చుకున్న ముల్లును నెమ్మదిగా తొలగించి ముందుకెళ్లాలి. అలా చేయగలిగితే అద్భుతమైన అనుభూతి మిగులుతుంది. ఏ విషయాన్నైనా సక్రమంగా నిర్వర్తించే సామర్థ్యం పెరుగుతుంది. రాముడిని ఆదర్శంగా తీసుకోవడం అంటే ఆరాధన కోసం కాదు. మన జీవితాలను మనమే ఉద్ధరించుకోవాలన్నది అందులోని పరమార్థం. త్యాగం, ధర్మం, దయ, పరాక్రమం రామునిలోని గొప్ప లక్షణాలు. వీటిని పెంపొందించుకోవాలని చెప్పేదే రామాయణం.

- సద్గురు జగ్గీ వాసుదేవ్

అందాల రాముడు అందువలన దేవుడు



రాముడిలో ఏమంత గొప్పదనం ఉంది?
మాయలు మంత్రాలు చూపించలేదు.
విశ్వరూపం ప్రకటించలేదు.
జీవితంలో ఎన్నో కష్టాలు... జరగరాని సంఘటనలు...
చిన్న వయసులోనే పినతల్లి స్వార్థానికి తండ్రిని పోగొట్టుకున్నాడు...
పట్టాభిషేక ముహూర్తానికే అడవుల బాట పట్టాడు...
తోడుగా, ఊరటగా నిలుస్తుందనుకున్న భార్యకు దూరమయ్యాడు...
కారడవుల్లో కన్నీళ్లతో వెతికాడు...
అంతులేని దుఃఖాన్ని గుండెల్లో మోస్తూనే రాక్షస వధ చేశాడు...
అందరిలాగే ఉద్వేగాలు, ఆలోచనలు, ఆవేదనలు అనుభవించాడు.
లోకమంతా తనను దేవుడని కీర్తిస్తున్నా తాను మాత్రం విస్పష్టంగా అహం దశరథాత్మజః - దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే' అని ప్రకటించాడు.
అయినా లోకమంతా ఆయననే ఎందుకు ఆదర్శంగా తీసుకుంది?
కారణం..


ఆయన ధర్మాన్ని సంపూర్ణంగా ఆచరించాడు. ధర్మానికి రూపునిస్తే రాముడి రూపం వస్తుందన్నంత పవిత్రంగా జీవించాడు. చేతికి అందివచ్చిన సింహాసనం దక్కక పోయినా, స్వయంగా భరతుడే వచ్చి రాజ్యానికి రమ్మని అడిగినా, ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన సీతను రావణుడు అపహరించినా, సందర్భమేదైనా కానీ.. ధర్మాన్ని విడిచిపెట్టలేదు. అందుకే రామయ్య ధర్మమూర్తి అయ్యాడు. లోకానికి ఒకేఒక్కడుగా నిలిచాడు.

- కప్పగంతు రామకృష్ణ

శాస్త్రధర్మం

తండ్రి మాట కోసం వనవాసానికి సీత, లక్ష్మణులతో కలిసి బయలుదేరాడు శ్రీరామచంద్రుడు. అయోధ్యలో పుత్రవియోగ దుఃఖంతో దశరథుడు మరణించారు. మేనమామ ఇంట్లో ఉన్న భరతుడు వచ్చి దశరథుడికి అంత్యక్రియలు పూర్తి చేశాడు. అన్నను వెతుక్కుంటూ అరణ్యానికి వెళ్లి, తండ్రి మరణవార్త తెలియజేశాడు. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోతాడు రామయ్య. పెద్దకుమారుడినైనా తండ్రికి ఉత్తరక్రియలు చెయ్యలేకపోయానని బాధపడతాడు. అక్కడికక్కడే శాస్త్రబద్ధంగా తండ్రి రూపానికి ఉత్తరక్రియలు చేసి, పిండితో పిండాలు చేసి, దర్భల మీద ఉంచబోయాడు. ఇంతలో బంగారు కంకణాలు ధరించిన ఓ హస్తం రాముడి ముందుకు వచ్చింది. తాను దశరథుడినని, పిండం తన చేతిలో పెట్టమని వాణి వినిపించింది. కానీ, రాముడు ఇందుకు ఒప్పుకోడు. శాస్త్రప్రమాణాలు అనుసరించి, దర్భల మీదే పిండాలు ఉంచుతాడు. నిజంగా నీవు దశరథుడవే అయితే, దర్భల మీద ఉంచిన పిండాలు స్వీకరించు. నేను మాత్రం శాస్త్ర ప్రమాణాన్ని పాటిస్తానని నిక్కచ్చిగా చెప్పాడు. తండ్రి వియోగ దుఃఖంలో ఉన్నసమయంలో కూడా **శాస్త్రధర్మాన్ని** తు.చ తప్పకుండా పాటించిన ఆదర్శమూర్తి రామచంద్రమూర్తి ఒక్కడే.

స్నేహధర్మం



మాయలేడి కారణంగా సీతమ్మను వదలి, పర్ణశాలను దాటి చాలా దూరం వస్తారు రామలక్ష్మణులు. ఇదే అదనుగా భావించిన రావణుడు మారు వేషంలో వచ్చి సీతమ్మను అపహరిస్తాడు. ఇదంతా గమనించిన జటాయువు రావణుడిని అడ్డగిస్తాడు. విశాలమైన తన రెక్కలే ఆయుధంగా చేసుకుని, రావణుడిని ముప్పుతిప్పలు పెడతాడు. సహనం నశించిన రావణాసురుడు జటాయువు రెక్కలు నరికివేస్తాడు. రెక్కలు తెగిన ఆ పక్షిరాజు నేలకూలుతాడు. కొన్నాళ్లకు సీతాన్వేషణ చేస్తూ అటుగా వచ్చిన రాముడికి జరిగిన వృత్తాంతం పూర్తిగా చెప్పి, రాముడి చేతిలోనే ప్రాణం విడుస్తాడు. తనకు క్షేమం కలిగించటానికి ప్రాణాలకు తెగించిన జటాయువును ఆప్తమిత్రుడుగా స్వీకరించి, అతడికి ఉత్తరక్రియలు స్వయంగా నిర్వహిస్తాడు రామయ్య. తాను క్షత్రియుడు. చేస్తున్నది వనవాసం. మరణించింది పక్షి. అయినప్పటికీ జటాయువుకు తాను స్వయంగా ఉత్తరక్రియలు చేసి, **స్నేహధర్మానికి** అసలైన అర్థాన్ని ఆచరణాత్మకంగా ప్రకటించాడా మహనీయుడు.

యుద్ధధర్మం

వాలి తన తమ్ముడైన సుగ్రీవుడి భార్య రుమను చెరబట్టాడు. తమ్ముడి భార్య కోడలితో సమానం. మామగారు తండ్రితో సమానం. తండ్రిలాగా కాపాడాల్సిన తమ్ముడి భార్యను కామంతో వాలి కోరుకున్నాడు. అంతేకాదు.. వాలి వనచరుడు. క్రూరత్వం కలిగిన వనచరాలను వేటాడటం క్షత్రియధర్మం. అంతేకాదు, ఎదుటివారి బలాన్ని తగ్గించే వరమాల వాలి మెడలో ఉంటుంది. దాన్ని ధరించిన సమయంలో వాలి ఎదుట ఎవరు నిలిచినా వారి శక్తి క్షీణిస్తుంది. కాబట్టే రాముడు చెట్టుచాటున దాగి, వాలిపై బాణాన్ని ప్రయోగించాడు. ఇది యుద్ధధర్మం. వాలి వధ ఘట్టంలో రాముడు **క్షత్రియ, యుద్ధ ధర్మాలను** పాటించాడు.

రావణ సంహారం తర్వాత విభీషణుడు రాముని వద్దకు వచ్చి, ఉత్తర క్రియలు నిర్వహించేందుకు అన్నగారి పార్థివ దేహాన్ని ఇమ్మని అడుగుతాడు. అప్పుడు రామచంద్రుడు మరణాంతాని వైరాని నివృత్తం నః ప్రయోజనం క్రియతామద్య సంస్కారః మమాప్యేష యథా తవ 'విభీషణా! శతృత్వం ఎంతటిదైనా అది చావుతో ముగిసిపోతుంది. సంధి కుదరకపోవడం వల్ల యుద్ధం చేయాల్సి వచ్చింది. మీ అన్నగారికి ఆచార విధి ప్రకారం ఉత్తర క్రియలు జరిపించు. ఇక నుంచి ఈయన నీకు మాత్రమే కాదు. నాకూ అన్నగారే' అంటాడు... ఇదీ రాముడి ధర్మవర్తన.


దయాధర్మం



సీతను రాముడికి అప్పగించమని హితబోధ చేసిన విభీషణుడికి రాజ్యబహిష్కరణ శిక్ష వేస్తాడు రావణుడు. సముద్రతీరంలో అపారమైన వానరసేనతో ఉన్న రామచంద్రుడి పాదాలను ఆశ్రయిస్తాడు విభీషణుడు. మరో ఆలోచన లేకుండా విభీషణుడికి అభయం ఇస్తాడు రామయ్య. అంతేకాదు, రావణుడిని చంపి విభీషణుడిని లంకా రాజ్యానికి రాజును చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ, సుగ్రీవుడు మొదలైన వారికి ఇదంతా ఇష్టం లేదు. ఏకాంతంలో ఉన్న రామయ్య దగ్గరకు వెళ్లి, విభీషణుడిని నమ్మవద్దని చెబుతారు. అతడు రావణాసురుడి దూత అంటూ హెచ్చరిస్తారు. అంతా విన్న రాముడు విభీషణుడే కాదు... చివరకు రావణుడే తనను ఆశ్రయించినా.. అతడికి కూడా అభయం ఇస్తానంటాడు. ఆశ్రయించిన ప్రాణులకు రక్షణ కల్పించటం క్షత్రియధర్మం. దయాధర్మం కూడా. వనవాసంలో ఉన్నా, చివరకు యుద్ధభూమిలో ఉన్నా **దయాధర్మాన్ని** రామయ్య విడిచిపెట్టలేదు.

మనుష్యధర్మం

రామరావణ సంగ్రామం ముగుస్తుంది. రావణుడు నేలకు ఒరుగుతాడు. ముల్లోకాలూ ఎంతో ఆనందిస్తాయి. వానరసేన చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఇంతలో బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమవుతారు. రాముడిని సాక్షాత్తు శ్రీమహావిష్ణు స్వరూపంగా స్తుతిస్తారు. 'నీది విష్ణు అంశ. వాస్తవానికి నువ్వు నిరాకారుడివి. అయినా సాకారుడిగా ఉన్నావు. సృష్టి, స్థితి, లయలు నీవే నిర్వహిస్తావు...' అంటూ రాముడికి దైవత్వాన్ని ఆపాదిస్తారు.



బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి చెప్పినా రాముడు తాను దైవాన్నని చెప్పుకోలేదు. తనకు దైవత్వాన్ని ఆపాదించుకోలేదు. 'ఆత్మానం మానుషం మన్యే... దశరథాత్మజః' అంటూ తాను కేవలం దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే. సాధారణ వ్యక్తిని మాత్రమే' అంటాడు. ఇదీ రామయ్య పాటించిన మనుష్యధర్మం. రామయ్య ఎక్కడా మాయలు, మంత్రాలు ప్రకటించలేదు. తాను దైవాన్నని చెప్పుకోలేదు. సాధారణ పౌరుడిలాగే రాజ్యభోగాలతో పాటు సుఖదుఃఖాలూ అనుభవించాడు. **మనుష్యధర్మాన్ని** పరిపూర్ణంగా పాటించిన అవతారమూర్తి శ్రీరాముడు.

సోదరధర్మం

రావణ వధ జరిగింది. లంకలో ఉన్న సీతాదేవిని తీసుకురావలసిందిగా విభీషణుడుకి వర్తమానం పంపించి, విశ్రాంతిగా కూర్చున్నాడు రామయ్య. దూరంగా ఓ స్త్రీమూర్తి వడివడిగా అడుగులు వేసుకుంటూ తన వైపే వస్తోంది. ఆమె ఎవరై ఉంటుంది? రాముడి ఆలోచన సాగుతుండగానే ఆమె ఎదురుగా వచ్చి నిలుచుంది. అమ్మా! నీవెవరు? ఎందుకిలా వచ్చావు? రక్తసిక్తమైన రణభూమిని చూస్తుంటే నీకు భయంగా అనిపించటం లేదా? నా వల్ల ఏదైనా సాయం కావాలా? అంటూ రామయ్య ఎంతో వినమ్రంగా ఆమెను అడిగాడు. అందుకామె సమాధానం ఇస్తూ, రామచంద్రమూర్తీ! నన్ను మండోదరి అంటారు. నీ చేతిలో మరణించిన రావణాసురుడి భార్యను. రామా! నీవు ధర్మమూర్తివనీ, ఏకపత్నీవ్రతుడవనీ, సీతను తప్ప మరే ఇతర స్త్రీ పేరు కూడా తలచవనీ విన్నాను. నా భర్త అనేకమంది స్త్రీలను చెరపట్టాడు. నీవంటి ఉత్తమ గుణసంపన్నుడైన యోధుడిని చూడాలనే కుతూహలంతో వచ్చాను. పరస్త్రీని చూడగానే వినమ్రంగా ఉన్నప్పుడే నీ ఔన్నత్యం అర్థమైంది. రామా! ధన్యురాలను. ఇక సెలవు. అంటూ నిష్క్రమించింది. ఇదీ.. **పరస్త్రీల పై రామయ్య చూపించే సోదరధర్మం.**

క్రీస్తు వాణి

మనం కోరుకునేది!

ఒక ఊళ్లో చాలా ప్రశాంతత. ఆ ఊరి గురించి బయటివారు చాలా గొప్పగా చెప్పుకుంటారు. గ్రామస్థులు ఎవరూ గొడవలు పడరు. కుటుంబాలు విడిపోవు. అందరూ కలిసి ఉంటారు. ఆ ఊళ్లో పోలీస్ స్టేషన్ కూడా లేదు. కొత్తవారు ఎవరైనా వస్తే.. ఆ ఊరిపెద్ద.. పొలిమేరకు వచ్చి.. గ్రామ నియమాలు చెప్పి దానికి ఇష్టపడితేనే వారిని ఊళ్లోకి రానిస్తారు.



ఇంతకీ ఆ నియమాలు ఏమిటి?

మన అవసరాల కోసం ఏ జాగ్రత్తలు పాటిస్తామో.. మన సహచరుల విషయంలోనూ అదే పాటించాలనేది ఆ ఊరి ప్రధాన నియమం. "ఇతరులు మీకు ఏం చేయాలని కోరుకుంటారో.. ఇతరులకు మీరు అదే చేయండి!" ఈ అద్భుతమైన ఉపదేశం ఇచ్చింది క్రీస్తు ప్రభువు. చిన్న వాక్యమే అయినా ఇందులో ఎంతో అర్థం ఉంది. ఇతరులు మనకు ఏం చేయాలని కోరుకుంటాం? 'ఆనందంగా ఉంచమ'ని. ఇతరులూ మన నుంచి అదే కోరుకుంటారు కదా! ఈ పద్ధతిని పాటిస్తే ఏ సమస్యలూ ఉండవు. సుస్థిరత, శాంతి వెల్లివిరుస్తుంది. ఆ ఊళ్లోనూ అదే నియమంగా పెట్టారు.

ఒక పొరుగువాడు నీస్థానంలో, నువ్వు అతని స్థానంలో ఉన్నప్పుడు.. అతడు నీకు హాని చేయాలని కోరుకుంటావా? అలాగే నీ నుంచి అతడు సహాయాన్ని కోరుతాడు, ప్రేమను ఆశిస్తాడు. సూక్ష్మంగా చెప్పాలంటే దీని అంతరార్థం నీ పొరుగువారిని ప్రేమించమని. మన నడత మెరుగు పరుచుకునేందుకు ఇది ప్రామాణికం.

సమస్త మానవాళి, శాంతియుత సహజీవనం చేయడానికి ప్రభువు చెప్పిన అద్భుత సూత్రం. సామాన్యుల నుంచి పాలకుల వరకు అందరూ ఆచరించదగ్గ మార్గం.

– డాక్టర్ ఎమ్.సుగుణరావు



రాఘవుడు పూజించిన రాముడు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో మూల సంస్థాన పూజలు ఎంతో ప్రత్యేకం. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులందరూ మూలరాముల పూజలు నిర్వహిస్తుంటారు. దీనిని సంస్థాన పూజ అంటారు. పీఠాధిపతులు ధార్మిక పర్యటనలో ఉన్నా.. వారి వెంట ఈ విగ్రహాలను తీసుకెళ్తారు. మూలరాముల విగ్రహం కృతయుగం నాటి నుంచి పూజలు అందుకుంటోందని చెబుతారు. బ్రహ్మ, ఆంజనేయుడు, జాబాలి రుషి తదితరులు దీనిని అర్చించారని మఠంలోని పండితులు చెబుతారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు పూజించడంతో ఈ విగ్రహానికి మూలరాములు అనే పేరు వచ్చిందట. కాలక్రమంలో సూర్యవంశానికి చెందిన గజపతి రాజు చెంతకు విగ్రహం చేరిందట. అక్కడి నుంచి మధ్వాచార్యులకు అందిందట. నాటి నుంచి మధ్వ సంప్రదాయంలో మూలరాముల విగ్రహ అర్చన కొనసాగుతోంది. రాఘవేంద్రస్వామి సైతం ఈ విగ్రహాన్ని అర్చించారని చెబుతారు. ఏకాదశి రోజున స్వామివారికి నైవేద్యంలేకుండా పూజలు చేస్తారు. శ్రీరామనవమి, దీపావళి పర్వదినాల్లో విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహిస్తారు.

– బాదిని ఉపేందర్

రామచంద్రుడి రాజనీతి

ఊరు పచ్చగా ఉంటే రామరాజ్యం!
వానలు సమృద్ధిగా కురిస్తే రామరాజ్యం!!
సమాజంలో శాంతి వెల్లివిరిస్తే రామరాజ్యం!!
రాముడు ఎలా పరిపాలించాడు..?
ఆయనకు పాలన మీద ఉన్న అవగాహనంతా ఆయన భరతుడిని కుశల ప్రశ్నలు అడిగే సమయంలో బహిర్గతమవుతుంది.

అన్నను తిరిగి రాజ్యానికి రప్పించేందుకు పరివారంతో కలిసి భరతుడు. అడవికి వెళ్లాడు. అప్పుడు రాముడు భరతుడిని "ఎలా ఉంటున్నావు? ఎలా పరిపాలిస్తున్నావు?" అని అడిగిన విశేషాలన్నీ అయోధ్యకాండ వందో సర్గలో ఉన్నాయి. అందులోని శ్లోకాల సారాన్ని చూస్తే రాజ్యపాలన మీద రాముడికి ఉన్న పట్టు అర్థమవుతుంది. ఈ సందర్భంగా భరతుడితో రాముడు అన్న మాటలు గుర్తు చేసుకుందాం.



మంత్రులు నీతిశాస్త్ర కోవిదులుగా, శూరులుగా ఉండాలి. మంత్రి మండలిలో ఏ ఒక్కరూ కూడా ప్రలోభాలకు లొంగకూడదు. మంచి ఆలోచనలు,, విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అసలు పాలకుడి దగ్గర ఉండే అమాత్యుడు ఎక్కువ నిద్రపోయే వాడై ఉండకూడదు. ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. రాజ్య రహస్యాలను ఎన్నడూ బయటపెట్టకూడదు. రాజకీయ, ఆర్థిక శాస్త్రాలు సంపూర్ణంగా తెలిసి ఉండాలి. పాలకుడికి కానీ, ఆయన చుట్టూ ఉన్న మంత్రులు, అధికారులకు కానీ ఎదుటివారిని చూడగానే వారి మనసు అంచనా వేయగలిగే శక్తి ఉండాలి.


- దేశంలో రైతు అవసరం ఎంతో ఉంటుంది. ఏ కారణాల చేతైనా రైతులు పన్నులు చెల్లించలేని స్థితిలో ఉంటే.. వారి నుంచి బలవంతంగా శిస్తు వసూలు చేయరాదు. ఈ విషయంలో ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రభుత్వాన్ని ప్రజలు అవమానిస్తారు. న్యాయాన్ని అతిక్రమించి అధిక పన్నుల భారాన్ని ప్రజలపై మోపకూడదు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు సకాలంలో చెల్లించాలి. ఆ జీతాలు వారి జీవన భృతికి సరిపోయేలా ఉండాలి.
- దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికులకు ప్రాధాన్యం ఇచ్చి తీరాలి. దేశభక్తి ఉన్నవారిని, మేధావులను, ప్రభుత్వం మీద అభిమానం ఉన్నవారిని ఎప్పుడూ గౌరవిస్తూ ఉండాలి. అలాగే వర్తక, వ్యాపారవేత్తలకు ప్రభుత్వం సహకార సంపత్తులను నిరంతరం అందించగలగాలి.
- పాలకుడనేవాడు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయం తీసుకోకూడదు. విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి.. ఆంతరంగికులతో చర్చించాకే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఇంతకు ముందు తరాలలో ఉన్నవారు రాజ్యాన్ని, ప్రజలను బాగా పరిపాలించి ప్రశంసలు అందుకొని ఉంటారు. అలాంటివారి అనుభవాలను, కార్యాలను పరిగణనలోకి తీసుకొని పాలన చేయడం ఉత్తమం.
- రాజ్యపాలనలో ఉండే 18 రకాల కార్యనిర్వాహకులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. అవసరమైన చోట పటిష్ఠమైన గూఢచర్య వ్యవస్థ ఉంచి జాగ్రత్త పడాలి. ఒక సార్వభౌముడిగా శ్రీరాముడు తన పాలనలో వీటన్నిటినీ ఆచరించాడు. అందుకే ఆనాటి అన్ని వర్గాల ప్రజలు ఎంతో హాయిగా ఉన్నారు.

– యల్లాప్రగడ మల్లికార్జునరావు

ఇస్లాం సందేశం

ఇంతే జీవితం!

ఒకవ్యక్తి కాలినడకన ఎటో వెళ్తున్నాడు. అది అడవి మార్గం. అలావెళుతూ ఉండగా.. వెనుక నుంచి ఏదో అలజడి వినిపించింది. వెనక్కి చూశాడు. అతడికి గుండె ఆగినంతపనైంది. ఓ పెద్దపులి తనవైపే వస్తోంది. భయంతో పరుగు ప్రారంభించాడు. అలా పరిగెడుతూ ఉండగా అతనికి ఓ పాడుబడిన బావి కనిపించింది. పిచ్చిమొక్కలు, తీగలతో అల్లుకుపోయిందా బావి. అందులోకి ఓ మర్రి ఊడ వేలాడుతూ ఉంది. దానిని పట్టుకొని లోనికి దిగడం మొదలుపెట్టాడు. కిందికి చూస్తే.. బావిలో ఓ మొసలి కనిపించింది. 'చచ్చాన్రా దేవుడా!' అనుకున్నాడు. ఇంతలో నల్లటి, తెల్లటి ఎలుకలు రెండు ఊడ కొరుకుతూ కనిపించాయి. పైకొస్తే పులి, కిందికి వెళ్తే మొసలి. అక్కడే ఉందామంటే.. ఎలుకలు పగబట్టాయి. ప్రాణం గుప్పిట్లో పెట్టుకొని వణికిపోతున్న ఆతడి దృష్టి పక్కనే చిన్న కొమ్మకు వేలాడుతున్న తేనెతుట్టెపై పడింది. తుట్టెలో నుంచి కిందికి జారుతున్న తేనెబొట్టును వేలితో అందుకొని నాకడం మొదలుపెట్టాడు. తేనె గ్రోలడంలో నిమగ్నమై.. పైన పులి.. కింద మొసలి.. మధ్యలో ఎలుక ఉన్నాయన్న సంగతే మరిచి పోయాడు. ఇంతలో ఓ తేనెటీగ చటుక్కున వచ్చి అతణ్ణి కుట్టింది. తటాలున లేచి కూర్చున్నాడా వ్యక్తి. కళ్లు నలుపుకుంటూ.. ఇదంతా కల! హమ్మయ్య బతికాను అనుకొని ఊపిరి పీల్చుకున్నాడు.



తెల్లారాక తన స్వప్న వృత్తాంతాన్నంతా ఓ పండితునికి వివరించాడు. అప్పుడా పండితుడు.. 'నిన్ను వెంబడించిన పులి నీ మృత్యువు. అనుక్షణం అది వెంబడిస్తూనే ఉంటుంది. నోరు తెరచి నీ కోసం ఎదురుచూసిన మొసలి ఉందే.. అది నీవు శాశ్వతంగా నిద్రించాల్సిన స్థలం. బావిలోకి నువ్వు దిగడానికి ఊతమిచ్చిన ఊడ ఆయుష్షు. ఆ ఊడను కొరికిన నలుపు-తెలుపు ఎలుకలు రాత్రింబవళ్లు. ఇవన్నీ మరచిపోయి ఏ కమ్మని తేనె వెనుక పడ్డావో అది ప్రాపంచిక వ్యామోహం' అని స్వప్న సారాంశాన్ని వివరించాడు. 'సమాధి మన కోసం ఎదురు చూస్తోంది. జీవితం మంచులా కరిగిపోతుంది. ఇవన్నీ మరచి.. ప్రాపంచిక వ్యామోహాల్లో పడిపోవద్దు' అన్న ప్రవక్త (స) సందేశం అనుసరణీయం.

– యం.డి.ఫారూఖ్‌జునైద్ ఖాన్

ఈనాడు సినిమా



కల్యాణ్ రామ్

కలిసి నటిస్తున్నారా?

త్వరలో నందమూరి మల్టీ స్టారర్ రాబోతోందా? నందమూరి కథానాయకులు కలిసి నటించబోతున్నారా? అవుననే సమాధానం వస్తోంది ఫిల్మ్ నగర్ వర్గాల నుంచి. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఇది మల్టీస్టారర్ అని, ఈ చిత్రంలో మరో కథానాయకుడు కూడా కనిపిస్తారని కల్యాణ్ రామ్ ఇది వరకే చెప్పేశారు. ఆ కథానాయకుడు ఎవరన్న ఆసక్తికరమైన చర్చ మొదలైందిప్పుడు. ఆ పాత్రలో నందమూరి బాలకృష్ణ కనిపిస్తారన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం. బాలయ్య ఇంకా కథ వినలేదని, కథ వింటే గనుక... తప్పకుండా ఒప్పుకుంటారని, ఆయన ఒకవేళ 'నో' అంటే... అప్పుడు మరో కథానాయడి పేరు పరిశీలిస్తారని, తొలి ఓటు మాత్రం... బాలయ్యకే అని తెలుస్తోంది. కల్యాణ్ రామ్ నటించిన 'ఎం.ఎల్.ఎ' శుక్రవారం విడుదల అవుతోంది. 'నా నువ్వే' మేలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఆ తరవాతే పవన్ సాధినేని సినిమా పట్టాలెక్కుతుంది.



బాలకృష్ణ

ఆ విషయంలో చాలా మారాను!



సమంత

పెళ్లి తర్వాత జీవితంలో చాలా మార్పులే వచ్చాయని చెబుతోంది సమంత. అయితే ఆ మార్పులు వ్యక్తిగత జీవితం పరంగానే తప్ప, కెరీర్ పరంగా పెద్దగా లేవంటోంది. "ఒక సినిమాలో నేను నటించాలంటే అందుకు బలమైన కారణం ఉండాలని భావిస్తున్నా. ఆ విషయంలో మరింత పక్కాగా ఉంటూ, ఆ తరహా కథల్నే ఎంచుకొంటున్నాను. అంతే తప్ప మిగతా వన్నీ మామూలే. సినిమా అంటే అదే తపన, అదే ప్రేమ. వ్యక్తిగత విషయానికొస్తే మాత్రం చాలా మారాను. నా ఆలోచనల్లోనే సంప్రదాయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇల్లాలికి ఇంటిపైనే దృష్టి ఉంటుంది కదా. నేనూ అంతే. ఈ జీవితాన్ని ఆస్వాదిస్తున్నా" అని చెప్పుకొచ్చింది సమంత. త్వరలోనే 'రంగస్థలం'తో రామలక్ష్మిగా సందడి చేయబోతోంది. అందులో పల్లెటూరి అమ్మాయిగానే సందడి చేయబోతోంది సమంత. "పట్నంలో పుట్టి పెరిగాను కాబట్టి పల్లెటూళ్లతో అంత అనుబంధం లేదు. 'రంగస్థలం' సినిమాతో నాలోనూ ఎక్కడో ఓ పల్లెటూరి అమ్మాయి ఉందనే విషయం అర్థమైంది" అని చెప్పింది సమంత.



గోపీచంద్

'పంతం' పట్టాడంటే...

గోపీచంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'పంతం'. ఫర్ ఎ కాజ్... అనేది ఉపశీర్షిక. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి (చక్రి) దర్శకత్వం వహిస్తున్నారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "ఒక మంచి సందేశానికి వాణిజ్యాంశాల్ని మేళవించి రూపొందిస్తున్న చిత్రమిది. 'బలుపు', 'పవర్', 'జై లవకుశ' తదితర చిత్రాలకి స్క్రీన్‌ప్లే సమకూర్చిన చక్రి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విధానం చాలా బాగుంది. గోపీచంద్ పాత్ర చాలా శక్తివంతంగా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి లాంటి 25వ చిత్రమిది. పంతం పట్టాక ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుదిరగని ధీరత్వమున్న వ్యక్తిలా గోపీచంద్ కనిపిస్తాడు. ఆయన పంతం ఎందుకోసమనేది మాత్రం తెరపైనే చూడాలి. మెహరీన్ కూడా ఒక మంచి పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రహణం చిత్రానికి ప్రధానబలం. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, సంభాషణలు: రమేష్ రెడ్డి, స్క్రీన్‌ప్లే: కె.చక్రవర్తి, బాబీ (కె.ఎస్.రవీంద్ర).

కొత్త కబుర్లు






ఈ జంట... రెండోస్సారి?

'గణేష్' చిత్రంలో జంటగా నటించారు రామ్, కాజల్. ఆ తరవాత... వీరిద్దరూ కలిసి కనిపించినదే లేదు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జోడీ కట్టబోతున్నారు. రామ్ కథానాయకుడిగా స్రవంతి మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని రూపొందిస్తోంది. రవికిషోర్ నిర్మాత. 'గరుడవేగ'తో ఆకట్టుకున్న ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రంలో కథానాయికగా కాజల్‌ని ఎంచుకున్నట్టు సమాచారం. ప్రేమ, వినోదం, యాక్షన్.. వీటన్నింటితో పాటు ప్రవీణ్ సత్తారు తరహా సరికొత్త కథా కథనాలు మేళవించిన చిత్రమిదని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

వైఎస్సార్‌గా మమ్ముట్టి



బయోపిక్‌ల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం ఎన్టీఆర్, సావిత్రి, పుల్లెల గోపీచంద్ జీవిత కథలు చలన చిత్రాలుగా రూపొందుతున్నాయి. ఈ జాబితాలో ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కథ కూడా తెరకెక్కబోతోంది. మహి.వి.రాఘవ దర్శకత్వం వహిస్తారు. వై.ఎస్.ఆర్ పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి కనిపించనున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. "మహి, మా సంస్థకు 'ఆనందో బ్రహ్మ' ద్వారా ఓ మంచి విజయాన్ని అందించాడు. ఈ చిత్రం అంతకు మించిన విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం ఉంది. త్వరలోనే పూర్తి వివరాలు ప్రకటిస్తామ"న్నారు నిర్మాతలు.

నారా రోహిత్‌తో నివేదా



నారా రోహిత్

ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకొనే కథానాయిక నివేదా థామస్. మధ్య మధ్యలో కాస్త విరామం అనిపించినప్పటికీ, చేసే ప్రతి సినిమాతోనూ తన నటనతో ప్రేక్షకులపై బలమైన ముద్ర వేస్తుంటుంది. 'జెంటిల్‌మేన్'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె, 'నిన్ను కోరి', 'జై లవ కుశ' చిత్రాలతో విజయాల్ని సొంతం చేసుకొంది. కాస్త విరామం తర్వాత మళ్లీ ఆమె ఓ కొత్త చిత్రాన్ని పచ్చజెండా ఊపింది. నారా రోహిత్ కథానాయకుడిగా మొదలైన 'శబ్దం'లో నివేదా కథానాయికగా నటిస్తోంది. పి.బి.మంజునాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్ మాటలు రాని ఓ యువకుడిగా కనిపించబోతున్నారు.



నివేదా థామస్

'మర్లపులి' గీతావిష్కరణ



వరుణ్‌సందేశ్

అర్చన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మర్లపులి'. వరుణ్‌సందేశ్ ప్రత్యేక పాత్రలో నటించారు. భాను, పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేష్, చమ్మక్ చంద్ర ముఖ్యపాత్రలు పోషించారు. డి.రామకృష్ణ దర్శకుడు. బి.సుధాకర్‌రెడ్డి, బి.భవాని శంకర్, ఖమ్మం శ్రీనివాస్ నిర్మాతలు. ఈ నెల 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో కథానాయిక భాను చేతులమీదుగా పాటలు విడుదలయ్యాయి. దర్శకుడు మాట్లాడుతూ "యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. నరసాపూర్ అడవిలో కేవలం 13 రోజుల్లోనే చిత్రాన్ని తెరకెక్కించాం" అన్నారు. నిర్మాతల్లో ఒకరైన బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ "ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తూ థ్రిల్‌ని పంచే చిత్రమిది. 1983లో జరిగిన ఓ సంఘటన స్ఫూర్తితో చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. నేనే స్వరాలు సమకూర్చా. పాటలు, చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం మాకుంది" అన్నారు. "వరుణ్‌సందేశ్ సరసన నేను నటించా. ఒక మంచి చిత్రంలో నటించిన తృప్తి ఉంది" అన్నారు భాను. ఈ కార్యక్రమంలో దేవరాజ్, శిరీష, ప్రశాంత్ కార్తీక్, అనిత ఆలపాటి, విజయ్, శివకార్తీక్, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనిషిలా బతుకుదాం



హిమాంశి కురానా, యోధ

బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ, యోధ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఏక్'. బీయింగ్ హ్యూమన్ అనేది ఉపశీర్షిక. సంపత్ దర్శకుడు. హరికృష్ణ కొక్కొండ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఈతరం చూడాల్సిన చిత్రమిది. మానవీయ విలువల్ని వెండితెరపై హృద్యంగా ఆవిష్కరించాం. 'మంత్ర' ఆనంద్ మంచి బాణీల్ని ఇచ్చారు. పాటలకు స్పందన బాగుంది. వచ్చే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

పంచ్ డైలాగ్

ఒక మనిషిని ద్వేషించడానికి కారణం ఉండొచ్చు. ప్రేమించడానికి కారణం ఉండకపోవచ్చు.

చిత్రం: నువ్వు నాకు నచ్చావ్

– పంపినవారు:

ఎస్.దేవదాసు, భీమవరం

చిరునామా: **సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512**

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

ట్వీటు తారా



మహేష్‌బాబు గారాలపట్టి సితారతో తీయించుకున్న ఓ ఫొటోను ట్విట్టర్‌లో పంచుకొన్నారు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన

చిత్ర విచిత్రాల 'రాజరథం'



అవంతికా శెట్టి, నిరూప్ భండారి

నిరూప్ భండారి, అవంతికా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రాజరథం'. రవిశంకర్, ఆర్య ముఖ్య పాత్రధారులు. అనూప్ భండారి దర్శకత్వం వహించారు. అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలు. శుక్రవారం విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక జరిగింది. సతీష్ శాస్త్రి మాట్లాడుతూ "బస్సు పాత్రకి రానా గాత్రదానం చేయడం, రవిశంకర్ 'చల్ చల్ గుర్రం' పాట పాడటం ప్రత్యేకతలు. నాయకానాయికలపై చిత్రించిన ఓ పాట ఊహ, వాస్తవాల మేళవింపుతో సాగుతుంది. ప్రేక్షకులకి కనువిందు కలిగిస్తుంది. బర్ఫీ, జగ్గా జాసూస్ చిత్రాలకి కళాదర్శకుడుగా పనిచేసిన రజత్‌సొద్దార్ వేసిన భారీ సెట్‌లో చిత్రించాం. కన్నడలోనూ విడుదల చేస్తున్నాం. ప్రతినాయకుడుగా ఆర్య లుక్, కాస్ట్యూమ్స్ చాలా కొత్తగా ఉంటాయ'న్నారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ "నృత్యదర్శకులు బాస్కో సీజర్, జానీ మాస్టర్ నేతృత్వంలో తెరకెక్కిన ఆరు పాటలూ ఆకట్టుకుంటాయ"న్నారు. నిరూప్ భండారి మాట్లాడుతూ "ఇది రొమాంటిక్ లవ్ స్టోరీ. ప్రేక్షకులు కోరే వినోదం ఉంటుంది. వీటితోపాటు ఎవరూ ఊహించని మరో కోణం కూడా ఉంది. అదేంటో సినిమాలోనే తెలుస్తుంద"న్నారు. మాటలు: అబ్బూరి రవి, పాటలు: రామజోగయ్యశాస్త్రి.

ఆ దుస్తులు నాకు ఇవ్వండి!

దీపికా పదుకొణె కెరీర్‌లో ఓ గొప్ప చిత్రంగా నిలిచిపోయింది 'పద్మావత్'. అందులో రాణి పద్మిని పాత్రలో దీపికా నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ముఖ్యంగా సినిమా ముగింపులో సామూహికంగా అగ్నికి ఆహుతయ్యే సన్నివేశాల్లో దీపిక పలికించిన భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కట్టిపడేశాయి. ఇందులో దీపిక ధరించిన దుస్తులు, ఆభరణాలు ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా క్లైమాక్స్‌లో దీపిక ధరించిన దుస్తులు మరింత కనువిందు చేస్తాయి. అందుకేనేమో ఆ దుస్తులపై దీపిక మనసు పారేసుకుంది. తన నటనకు గుర్తుగా వాటిని తనకు ఇవ్వాలని దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని ప్రత్యేకంగా కోరింది దీపిక. "పద్మావత్‌తో ప్రయాణం నా తుదిశ్వాస వరకు మర్చిపోలేను. ఇందులో నేను నటించిన ముగింపు సన్నివేశాల్లాంటివి ఇప్పటివరకూ పోషించలేదు. ఆ సన్నివేశాల కోసం నేను ధరించిన దుస్తుల్ని ఇవ్వాల్సిందిగా భన్సాలీ సార్‌ను అడిగాను" అని ఓ పత్రికతో మాట్లాడుతూ చెప్పింది దీపిక.



దీపికా పదుకొణె

ఎవరిని చూస్తున్నారో

శ్రీకాంత్, నితిన్, హేమలత నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'నిన్నే చూస్తు'. కె.గోవర్ధన్‌రావు దర్శకుడు. హేమలతారెడ్డి నిర్మాత. ప్రస్తుతం మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "మంచి కుటుంబ కథాచిత్రమిది. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ చక్కటి స్వరాలిచ్చారు. టైటిల్ గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మలేసియాలోని అందమైన ప్రాంతాల్లో పాటలు తెరకెక్కించామ"న్నారు. సుమన్, భాను చందర్, సుహాసిని ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కూర్పు: నాగిరెడ్డి, మాటలు, కరణ్‌గోపి, ఛాయాగ్రహణం: ప్రసాద్ ఈదర.



హేమలత

స్నేహం చిరకాలం..

చుట్టూ ఎంతమంది స్నేహితులు ఉన్నా కొందరు మాత్రమే మనసుకి దగ్గరవుతారు. ఇంకొందరితో ఎంత స్నేహంగా ఉందామన్నా కూడా ఆ బంధం నిలబడదు. ఎందుకిలా అంటారా?

● స్నేహం చేయడం అంటే అందరిలో కలిసి పోవడం. ఆప్యాయంగా మాట్లాడటమే. ఇలా ఉండగలిగితే చాలు..ఎంతమందిలో ఉన్నా సరే! మీరు మీ స్నేహబృందానికి ప్రత్యేకమే. ఈ తీరే మిమ్మల్ని అందరికీ దగ్గర చేస్తుంది. అదికూడా ఎదుటివారి భావోద్వేగాలకు అనుగుణంగా స్పందించగలిగినప్పుడే ఆ బంధం బలపడుతుంది.



● మీకంటూ ఓ స్నేహబంధాన్ని ఏర్పరుచుకోలేకపోవడానికి కారణం...ఎదుటివారిని మీరు సరిగా అర్థం చేసుకోలేకపోవడమేనేమో! చాలామంది ఎదుటివారిలో లోపాలు వెతకడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అయితే అలాంటి లోపాలు మీలోనూ ఉంటాయని మరిచిపోవద్దు. లేదంటే ఈ తీరు మీపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. దాంతో మీతో స్నేహం ఏర్పరుచుకునే విషయంలో ఎదుటివారూ ఆలోచిస్తారు.

● ఏదో ఆశించి మాత్రం ఎదుటివారితో స్నేహం చేయాలనుకోకండి. అవసరాలకు అనుగుణంగా ఏర్పడే స్నేహబంధం ఎక్కువకాలం నిలవదు. నిజమైన స్నేహంలో నియమ నిబంధనలుండవు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోగలుగుతారు.

న జ రా నా

బకెట్ నీళ్లలో నాలుగైదు చుక్కల రోజ్‌వాటర్ కలిపి స్నానం చేస్తే చెమట వాసన రాకుండా ఉంటుంది.

ఐస్... ఐస్... పండ్ల ఐస్!

ఎండలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. ఈ సమయంలో మనసు ఎక్కువగా కోరుకునేది చల్లని ఐస్‌క్రీంలే కదూ.. ఈసారి పాప్సికిల్స్‌ని ప్రయత్నించి చూద్దాం. అవేంటీ.. అంటారా.. అచ్చం ఐస్‌క్రీంల లాంటివే కానీ కాదు. వీటిని పండ్లతో తయారుచేస్తారు. అవేంటంటే...



దానిమ్మతో...

కావల్సినవి: దానిమ్మగింజలు - కప్పు, నిమ్మరసం - రెండు చెంచాలు, చక్కెర - రెండు చెంచాలు, నీళ్లు - అర కప్పు.

తయారీ: కొన్ని దానిమ్మ గింజలను తీసి పక్కన పెట్టుకోవాలి. మిగతా గింజలూ, నిమ్మరసం, చక్కెరా, నీళ్లు అన్నీ కలిపి మిక్సీలో వేసి తిప్పాలి. ఇది రసంలా తయారయ్యాక వడకట్టి తీపీ, పులుపూ సరిపోయాయో లేదో రుచి చూసుకోవాలి. అవసరం అనుకుంటే మరికొంచెం చక్కెరా కలుపుకోవచ్చు. ఆ తరవాత ఈ రసాన్ని పాప్సికిల్స్ మౌల్డ్స్‌లో పోయాలి. చివరగా గింజల్ని అన్నింట్లో సమానంగా వేసుకుని ఐస్‌క్రీం పుల్లల్ని ఉంచాలి. వీటిని డీప్ ఫ్రిజ్‌లో కొన్ని గంటలపాటు ఉంచి తీస్తే చాలు.



పుచ్చకాయతో...

కావల్సినవి: పుచ్చకాయ ముక్కలు - నాలుగు కప్పులు, నిమ్మరసం - పెద్ద చెంచా, తేనె - పెద్ద చెంచా.

తయారీ: పుచ్చకాయ ముక్కలూ, నిమ్మరసం, తేనె మిక్సీలో తీసుకుని రసంలా చేసుకోవాలి. ఆ తరువాత వడకట్టాలి. ఇప్పుడు ఈ పండు రసాన్ని పాప్సికిల్ మౌల్డ్స్‌లో పోసి ఫ్రిజ్‌లో కొన్నిగంటలపాటు పెట్టి తీస్తే చాలు.



పండ్ల ముక్కలతో...

కావల్సినవి: కివీ - రెండు, స్ట్రాబెర్రీ ముక్కలు - కప్పు, సన్నగా కోసిన పుచ్చకాయ ముక్కలు - కొన్ని, యాపిల్ రసం - రెండు కప్పులు.

తయారీ: కివీ పండ్ల చెక్కు తీసి చక్రాల్లా కోయాలి. తరువాత పండ్ల ముక్కల్ని కలిపి మౌల్డ్స్‌లో వేసుకోవాలి. తరువాత అన్నింట్లో ముప్పావువంతు వరకూ యాపిల్ రసం పోసి మూత పెట్టేయాలి. వీటిని ఓ రాత్రంతా ఫ్రిజ్‌లో పెడితే పండ్ల ఐస్‌లు సిద్ధం.

చాక్లెట్‌తో...

కావల్సినవి: వెనిల్లా ఐస్‌క్రీం - కప్పు, బాదంపాలు - అరకప్పు, చాక్లెట్‌పొడి - అర కప్పు, తేనె - పెద్ద చెంచా, బాదంపప్పు తరుగు- చెంచా

తయారీ: ఐస్‌క్రీం, బాదంపాలూ, తేనె మిక్సీలో తీసుకుని చిక్కగా చేసుకోవాలి. తరువాత ఈ మిశ్రమాన్ని పాప్సికిల్స్ మౌల్డ్స్‌లో వేసుకుని పైన చాక్లెట్‌పొడీ, బాదంతరుగూ వేసి మూత పెట్టేయాలి. వీటిని మూడునాలుగు గంటలపాటు ఫ్రిజ్‌లో పెడితే గట్టిపడతాయి.

గమనిక: పాప్సికిల్స్ మౌల్డ్స్ బజార్లో దొరుకుతున్నాయి. వీటిల్లో మిశ్రమం నింపి ఐస్‌పుల్ల గుచ్చి మూతపెట్టి ఫ్రిజ్‌లో పెడితే చాలు.



స్ట్రాబెర్రీ, పైనాపిల్‌తో..

కావల్సినవి : పైనాపిల్ ముక్కలు - రెండు కప్పులు, స్ట్రాబెర్రీ ముక్కలు - మూడు కప్పులు, పైనాపిల్ రసం - ఒకటిన్నర కప్పు, చక్కెర - అరకప్పు, నీళ్లు - కప్పు.

తయారీ: ముందుగా మిక్సీలో సగం పైనాపిల్ ముక్కలూ, కప్పు పైనాపిల్ రసం, చక్కెరా, అర కప్పు నీళ్లు తీసుకోవాలి. దీన్ని రసంలా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్లీ మిక్సీలోకి సగం స్ట్రాబెర్రీ ముక్కలూ, అరకప్పు పైనాపిల్ రసం, కొన్ని నీళ్లూ తీసుకుని జ్యూస్‌లా చేసుకోవాలి. ఇప్పుడు మౌల్డ్స్‌లో ముందుగా ఒక వరుస స్ట్రాబెర్రీ ముక్కలూ, దానిపై పైనాపిల్ ముక్కలు వేసుకోవాలి. వాటిపై స్ట్రాబెర్రీ, పైనాపిల్ రసాలు వేసుకుని మూత పెట్టేయాలి. వీటిని మూడుగంటలపాటు ఫ్రిజ్‌లో పెడితే సరిపోతుంది.



మేడ మీద మొక్కలా... మేం పెంచుతాం!

ఇరుకు గదులూ, అపార్ట్‌మెంట్ సంస్కృతి పచ్చని మొక్కల పెంపకానికి దూరం చేస్తున్నాయి. అయినా వాటిపై ఉన్న ఆసక్తితో ఇంటిమిద్దెనే చిన్నపాటి పొలంగా మార్చుకోవాలనుకునే వారు కొందరు. బాల్కనీనే చిన్నపాటి పెరటితోటగా చేయాలనుకునేవారు ఇంకొందరు. అలాంటి ఆలోచన మీకూ ఉందా! అయితే మా హోంక్రాప్ బృందం మీ సమస్యకు పరిష్కారం చూపుతుందంటున్నారు దాన్ని ప్రారంభించిన మన్విత రెడ్డి, షర్మిలా ఎల్లు.

‘వ్యాపారంలో లాభాలు రావాలీ, మరి కొందరికీ ఉపయోగపడాలి... ఇదే లక్ష్యంతో హోంక్రాప్‌ని ప్రారంభించాం. ఈ వ్యాపార ప్రయాణంలో ఎంతో అనుభవమే కాదు, పరిజ్ఞానాన్నీ సొంతం చేసుకుంటామనీ మేం ఊహించలేదు అంటారు’ మన్విత రెడ్డి. ‘పట్టణాల్లో నివసించేవారు ఆసక్తితో ఇంటిమిద్దెనే చిన్నపాటి పొలంగా మార్చేసుకుంటున్నారు. ఇంకొంతమంది దానిమీద ఆసక్తి ఉన్నా ఎలా ప్రారంభించాలో తెలీక ఆలోచనతోనే ఆగిపోతున్నారు. అలాంటి వాళ్లందరికీ మా హోంక్రాప్ ప్రియనేస్తం. డాబా మీదా, బాల్కనీల్లో మొక్కలు పెంచాలనుకుంటే దానికి కావాల్సిన అవసరాలన్నీ మేమే చూసుకుంటాం. నేరుగా స్లాబుపై మట్టిపోసి విత్తనాలు చల్లేస్తే లీకేజీ సమస్యలొస్తాయి. అందుకే ఫ్రేములాంటి నిర్మాణం, మట్టి బెడ్‌లను ఏర్పాటు చేస్తాం. దానిలో పెంచుకునేందుకు విత్తనాలూ, ఎరువూ వంటివన్నీ కిట్ రూపంలో అందిస్తాం. అక్కడితో మా పని అయిపోదు. ఆ తరువాత మొక్కలకు చీడపీడలు సోకకుండా వాటి నిర్వహణా చూసుకుంటాం. వాళ్లు మొక్క ఫొటో పంపితే దానికి కారణం వివరించి, పరిష్కారం సూచిస్తాం. ఇలానే కాదు ఎంచుకున్న ప్యాకేజీని బట్టీ నెలకు రెండుసార్లు మా ఉద్యోగులు వెళ్లి మొక్కల్ని పరీక్షిస్తారు.





అలా మొదలైంది..


ఏడాది క్రితం జనవరి నెలలో ‘హోమ్‌క్రాప్’ని కేవలం మూడు లక్షల పెట్టుబడితో ప్రారంభించాం. ఆచార్య జయశంకర్ యూనివర్సిటీలో మా సంస్థను ఇంక్యుబేషన్‌లో ఉంచాం. మా చదువులకు సంబంధంలేని వ్యాపారంలోకి అడుగుపెట్టాం కదా! అందుకే మొక్కల పెంపకంలో శిక్షణ తీసుకున్నాం. పట్టణంలో సాగు చేస్తున్న చాలామందిని కలిసి మెలకువలు తెలుసుకున్నాం. మొదట్లో మొక్కలను స్లాబును ఆనుకొని కాకుండా కాస్త ఎత్తులో ఉంచేందుకు మెటల్ ఫ్రేమును వాడేవాళ్లం. కేవలం దానికోసమే 15000 రూపాయలు ఖర్చయ్యేది. కానీ అంత ఖర్చు మొక్కల మీద పెట్టడానికి ముందుకొచ్చే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. అందుకే క్రమంగా ప్రత్యామ్నాయంగా పీవీసీ నిర్మాణాన్ని వాడటం మొదలుపెట్టాం.



ఏమేం చేస్తామంటే...

అవసరానికి అనుగుణంగా చాలా ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఉదాహరణకు... పన్నెండు చదరపు అడుగుల వైశాల్యంలో బెడ్ ఏర్పాటు చేస్తే.. దాంట్లో ఏవైనా నాలుగు రకాల విత్తనాలూ, స్థలానికి సరిపోయే మట్టీ, దాన్ని ఆరోగ్యంగా ఉంచే ఎరువులూ అందిస్తాం. బాల్కనీల్లో పెంచుకునేందుకు వీలుగా వర్టికల్ ప్లాంటర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. మొక్కల్ని పెంచేందుకు బయోడిగ్రేడబుల్ బ్యాగులు ఉంచుతున్నాం. ఈ క్రమంలో మాకెదురైన సమస్య మట్టీ, పనిచేసేందుకు సిబ్బందీ దొరక్కపోవడమే. అయితే మా ఆలోచన నచ్చి సేంద్రియ వ్యవసాయం చేసే సాయి మాకు తోడయ్యారు. దాంతో మట్టీ, ఎరువూ ఆయన వ్యవసాయం చేసే ఇరవైఎకరాల పొలం నుంచే తీసుకుంటున్నాం. ఇక సిబ్బంది అంటారా? వ్యవసాయ విద్యలో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులనే మా ఉద్యోగులుగా ఎంచుకున్నాం. ఇక, వినియోగదారులను సంపాదించుకోవడం అతిపెద్ద సవాల్. ఎక్కడ ఎక్స్‌పోలు, వర్క్‌షాపుల ద్వారా మా సేవల్ని వివరిస్తూ వారిని చేరుకున్నాం. ప్రస్తుతం మా వినియోగదారుల సంఖ్య 400 మంది. ప్రస్తుతం కేవలం హైదరాబాద్‌లోనే మా సేవలందిస్తున్నా త్వరలోనే ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తాం. ఇప్పుడిప్పుడే ఇబ్బందులు దాటుకుని పాతికలక్షల టర్నోవర్‌కు చేరుకున్నాం’ అంటారు షర్మిల.

బంగారం-వెండి



21 న ముగింపు-క్రితం

హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం (24క్యా)	31,310	31,290
ఆర్నమెంట్	29,240	29,230
వెండి (కిలో)	39,025	39,190
విజయవాడ		
బంగారం (24క్యా)	31,350	31,300
ఆర్నమెంట్	29,100	29,000
వెండి (కిలో)	39,500	39,500
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,250	31,220
ఆర్నమెంట్	28,940	28,980
వెండి (కిలో)	39,100	39,200
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	30,440	30,430
ఆర్నమెంట్	28,980	28,980
వెండి (కిలో)	41,000	41,100
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,110	31,110
ఆర్నమెంట్	28,920	28,920
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,899	2,898
వెండి (గ్రా)	41.10	41.20
		(రూ. లలో)

ఇవి దగ్గర ఉంచుకోండి..!!

మన అల్మారాలో కొన్ని రకాల దుస్తులూ, అలంకరణ సామగ్రి ఉండేలా చూసుకుంటే వాటిని వేటితోనైనా జత చేయడం సులువంటున్నారు ఫ్యాషన్ నిపుణులు.. ఇంతకీ అవేంటంటే...

★ కాలేజీలకే కాదు...ఇంటర్వ్యూలకూ హుందాతనాన్ని తెచ్చిపెడుతుంది తెలుపు రంగు. అందుకే ఇలాంటి చొక్కాను మీ బీరువాలో ఉంచుకోండి. దీనికి జతగా స్టేట్‌మెంట్ జ్యూయలరీ మెప్పిస్తుంది.

★ ట్రెండీగా కనిపించాలని అన్నీ ఎత్తుచెప్పులే కొంటున్నారా? ఇది మీ ఆరోగ్యానికీ అంత మంచిది కాదు. పైగా ఇప్పుడు వాటితో పాటు ఫ్లాట్స్ వేసుకోవడమూ ఫ్యాషనే. లెగ్గింగ్‌లూ, పలాజోల మీదకు ఈ తరహావి నప్పుతాయి. పైగా వీటిని వేసుకుని నడవడమూ సులువే.

★ ఎన్ని రంగులున్నా నలుపు రంగు ప్రత్యేకతే వేరు. కుర్తా, టీషర్ట్, అనార్కలీ ఏదైనా సరే..ఒకటి ఇలాంటిది తప్పనిసరి. అన్నిరకాల ఛాయల వారికీ ఇది బాగుంటుంది. నలుపు రంగు పొడవాటి గౌనూ లేదంటే జంప్‌సూట్ వేసుకుంటే దానికో బ్లేజర్ జతచేస్తే చాలు కొత్తలుక్ వస్తుంది.

★ ఎన్ని రకాల దుస్తులున్నా ఒకట్రెండు జీన్సు ప్యాంట్లు తప్పనిసరి. అవి అన్ని వేళలా ఉపయోగపడతాయి. అయితే అవి మరీ బిగుతుగా కాకుండా సౌకర్యవంతంగా ఉండేవి ఎంచుకోవాలి. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితుల్లో తొందరగా తయారై వెళ్లిపోవచ్చు.

★ విభిన్న సైజులూ, రంగుల్లో స్కార్ఫ్‌లు ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు వీటిని అనేక రకాలుగా వాడుతున్నారు. జుట్టుకీ, నడుముకీ కట్టేసుకుంటున్నారు. అంతే కాదు పైనుంచి కింది దాకా డ్రెస్సు ఒకే రంగులో ఉందనుకుంటే ఈ స్కార్ఫ్‌లతో లుక్ మార్చేయొచ్చు.


★ వీటితోపాటే పొడవాటి ట్రెంచ్ కోట్ ఒకటి దగ్గర పెట్టుకుంటే సందర్భానుసారంగా వాడుకోవచ్చు. వీటికోసం ప్రత్యేకంగా ఏమీ కొనుగోలు చేయక్కర్లేదు. మామూలు జీన్స్‌ప్యాంట్లు కూడా వీటి మీదికి సరిపోతాయి.



★ ష్రగ్‌లూ, కోట్లు..కూడా ఒకట్రెండు దగ్గరుంచుకుంటే అవసరానికి ఉపయోగపడతాయి.

అక్క... పెళ్లి అయ్యేదెలా!

డియర్ వసుంధర



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

■ నాకు ఒక అక్క. తనిప్పుడు ఉద్యోగం చేస్తోంది. ఎప్పుడూ తన నోటి నుంచి వినపడే ఒక పదం... ‘ఇండిపెండెంట్’ అని! ఏ పనికీ ఇతరుల మీద ఆధారపడదు. అలా ఉండాలనే పెళ్లి కూడా చేసుకోనంటోంది. నిజం చెప్పాలంటే నా బాధ్యతల్ని తనే తీసుకుని నాన్న లేని లోటు తీరుస్తోంది. కానీ ఈ మధ్య మితిమీరి తనేం చేసినా కనీసం అమ్మకు కూడా చెప్పట్లేదు. నాన్న లేని పిల్ల అని గారాబంగా పెంచితే ఇలా తయారయ్యిందని అమ్మ ఎప్పుడూ బాధ పడుతోంది. తననెలా మార్చాలో అర్థం కావడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం ఏంటి?

– ఓ సోదరి

మీ అక్కకు పెళ్లిపై ఉన్న అభిప్రాయం తన చుట్టూ ఉన్న పరిస్థితుల వల్లో, ఇంట్లో జరిగిన కొన్ని సంఘటనల వల్లో ఇలా బలపడి ఉండొచ్చు. అయితే తనకున్న స్వతంత్ర భావాలకూ, పెళ్లి మీద తనకున్న అభిప్రాయానికీ ఎలాంటి సంబంధం లేదు. ధైర్యంగా, ఎవరిమీదా ఆధార పడకుండా పనులు చేసుకోవాలనుకోవడం తప్పుకాదు. కానీ ఒకరితో కలిసి జీవితం గడుపుతూ కూడా ఈ స్వతంత్రాన్ని కోల్పోకుండా ఉండొచ్చన్న విషయం తనకు అర్థమయ్యేలా వివరించాలి. తనిప్పుడు స్వేచ్ఛగా ఉండటమొక్కటే సంతోషమనుకుంటోంది. కానీ, దానికి మించిన ఆనందం ఒక వ్యక్తితోనో, కుటుంబంతోనో చేరువైనా కూడా పొందొచ్చని తనకు తెలియాలి. ఆమె తను చేసే పనులు కూడా ఎవరికీ చెప్పకుండా చేస్తోందంటున్నారు. కానీ ఎందుకు చెప్పటం లేదో ఒక్కసారి ఆలోచించండి. ఒకవేళ చెప్పినా కూడా మీరు అర్థం చేసుకోలేరనే నిర్ణయానికి రావడమే దీనికి కారణం కావచ్చు. అందుకే ఆమె ఏ విషయాన్నీ మీతో చెప్పడానికి ఇష్టపడట్లేదు. ఒకసారి మానసిక వైద్యుల్ని కలిసి ఈ సమస్య గురించి ఆమెతో మాట్లాడించండి. అసలు తనిలా ప్రవర్తించడానికి కారణం తెలుసుకుంటే చాలు. ఆ తరువాత ఆమెకున్న అపోహలపై స్పష్టత ఇవ్వగలిగితే ఆమే సరైన నిర్ణయం తీసుకోగలుగుతుంది.

మీ ప్రశ్నలు ఇకపై **vasupsych@eenadu.net** కు పంపించగలరు.

ఇంజినీరింగ్ ●

ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల నుంచి నాలుగో ఏడాది అభ్యర్థుల వరకూ అందరికీ రెండో సెమిస్టర్ పరీక్షలు త్వరలో జరగబోతున్నాయి. ఏం చదవాలి, ఎలా చదవాలి, ప్రిపరేషన్‌లో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి, పరీక్షల్లో ఎంత రాయాలి.. తదితర విషయాలపై సరైన అవగాహన ఉంటే కష్టానికి తగిన ఫలితంగా మంచి మార్కులు పొందే వీలుంటుంది. ఇందుకోసం అర్థవంతంగా చదవడానికి, ఆశించిన మార్కులు సాధించడానికి ఉపయోగపడే సూచనలను నిపుణులు అందిస్తున్నారు.



సెమిస్టర్ పరీక్షల్లో సక్సెస్ సూత్రం!

ఇంజినీరింగ్ విద్యార్థులు ఏడాదంతా పరీక్షలు రాస్తున్నట్లే కనిపిస్తుంది. ఒక సెమిస్టర్ కాగానే రెండో సెమిస్టర్ సిద్ధమైపోతుంది. నాలుగేళ్లూ ఇలా గడిచిపోతాయి. థియరీ సబ్జెక్టులకు గరిష్ఠంగా 100 మార్కులు. అందులో 25 మార్కులకు అంతర్గత పరీక్షలను కాలేజీలు, మిగిలిన 75 మార్కులకు సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తాయి. పరీక్షలకు తయారవడం ఎప్పుడూ ఒత్తిడితో కూడుకున్నదే. అయినా చిత్తశుద్ధితో కొన్ని మెలకువలను పాటిస్తే పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవచ్చు.



నీలమేఘశ్యామ్ దేశాయ్
Career Dev.Cell
ACE ఇంజినీరింగ్ కళాశాల

నాణ్యమైన నోట్స్ తొలిమెట్టు

సిలబస్ ఇంకా పూర్తికాలేదని నోట్స్ తయారీని నిర్లక్ష్యం చేస్తే బ్యాక్‌లాగ్స్ బారిన పడతారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలకు జతగా అవసరమైన విషయసేకరణ చేసి నోట్స్ సమగ్రంగా సిద్ధం చేసుకోవాలి. సమయం తక్కువగా ఉన్నప్పుడు తరగతిలోని పాఠాల వేగాన్ని అందుకోవాలంటే ఇంటి దగ్గర రోజువారీ పద్ధతిలో చదవాలి. దాని వల్ల వెంట వెంటనే వచ్చే ఇంటర్నల్, ప్రాక్టికల్, సెమిస్టర్ పరీక్షలకు సిద్ధంగా ఉండవచ్చు. క్లాస్ నోట్స్ కఠినంగా అనిపిస్తే అర్థమయ్యే సులువైన పదాలతో తిరగరాసుకోవాలి. కష్టమైన, అర్థంకాని పదాలతో ఉన్న నోట్స్‌ను బట్టీ పట్టడం మంచిది కాదు. కాలేజీకి వెళ్లని రోజుల్లో జరిగిన పాఠాలకు నోట్స్‌ను ప్రత్యేక శ్రద్ధతో రాసుకోవాలి.

ప్రతి సబ్జెక్టుకీ కొన్ని ప్రత్యేక పదాలు ఉంటాయి. సమాధానాల్లో వాటిని తప్పకుండా వినియోగించాలి. అందరూ తప్పనిసరిగా చదివే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హ్యూమన్ వాల్యూస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ వంటి సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు సంపాదించాలంటే సరైన పదాల వాడుక అవసరం.

విద్యార్థులు తమ నోట్స్‌లను అధ్యాపకులకు ఇచ్చి పరిశీలించమని కోరాలి. అనుభవజ్ఞులైన లెక్చరర్ల దృష్టి నోట్స్ మీద పడితే దాని నాణ్యత పెరుగుతుంది. లోపాల సవరణ జరుగుతుంది.

సమయం సద్వినియోగం

ప్రతి వ్యాసరూప ప్రశ్నకు గరిష్ఠంగా 25 నుంచి 30 నిమిషాల సమయం ఉంటుంది. కానీ అంతకంటే తక్కువ సమయంలోనే జవాబు రాయడం ప్రాక్టీస్ చేయాలి. చివరి నిమిషం వరకూ రాయకూడదు. కొంత సమయాన్ని మిగుల్చుకొని అన్నీ చెక్ చేసుకోవాలి.

పరీక్షల్లో విజయం కోసం సమయానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆచరణయోగ్యమైన టైంటేబుల్ తయారు చేసుకోవాలి. రోజూ కనీసం రెండు సబ్జెక్టులు చదవడానికి ప్రణాళిక వేసుకోవాలి. దీని వల్ల ప్రతి సబ్జెక్టునీ వారంలో రెండుసార్లు చదవచ్చు. పునశ్చరణా జరుగుతుంది. ఇదే సమయంలో అసైన్‌మెంట్లు, రికార్డులు రాసే పని కూడా ఉంటుంది. వీటికి సమయాన్ని అదనంగా కేటాయించాలి. కాలేజీలో విరామ సమయాల్లో పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.

ఇంజినీరింగ్‌లోని అనువర్తన అంశాలకు ఇది తగిన విధానం.

సబ్జెక్టు బాగా అర్థం కావాలంటే రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు చదవాలి. నోట్స్ చదివేటప్పుడు పాఠ్యపుస్తకం దగ్గరే ఉండాలి. పాఠ్యపుస్తకాన్ని పరిశీలించాలి. అవసరమైన పాయింట్లు రాసుకోవాలి. సిలబస్ ప్రకారం నోట్స్‌ను సమీక్ష చేయాలి. ఇంజినీరింగ్‌లో ఇది చాలా ప్రధానం.

గత ప్రశ్నపత్రాల విశ్లేషణ

పరీక్షలకు కేవలం పాఠాలు చదివితే సరిపోదు. గతంలో జరిగిన మూడు లేదా అయిదు సంవత్సరాల పరీక్షల ప్రశ్నపత్రాలను విశ్లేషించాలి. అధ్యాయాలవారీగా ప్రశ్నల సరళిని పరిశీలించాలి. దీని వల్ల ఏయే అధ్యాయాలపై దృష్టి పెట్టాలో తెలుస్తుంది. ఆ ప్రశ్నలకు జవాబులు సిద్ధం చేసుకొని అధ్యాపకుల అభిప్రాయాన్ని తీసుకోవాలి. పరీక్షల నాటికి మొత్తం సిలబస్‌పై సంతృప్తికర స్థాయిలో తయారవ్వాలి. రోజువారీ రివిజన్ చేయాలి.

ఏ ప్రశ్నకు ఎంత సమాధానం?

సాధారణంగా కొన్ని ప్రశ్నలను రెండు లేదా మూడు మార్కులకు, మరికొన్నింటిని అయిదు లేదా పది మార్కులకు ఇస్తారు. వీటి జవాబుల పరిధి పట్ల స్పష్టత ఉండాలి. నిర్వచనాలు, మౌలిక సూత్రాల వంటివి రెండు లేదా మూడు మార్కులకు ఇస్తారు. మౌలికాంశాలపై వచ్చే ఈ ప్రశ్నలకు అయిదు లేదా ఆరు వాక్యాల్లో సమాధానాలు రాయాలి. అవీ స్థూలంగా, స్పష్టంగా ఉండాలి. సమయం వృథా చేయకూడదు. వ్యాసరూప ప్రశ్నలకు సమగ్రమైన జవాబులు తయారు చేసుకోవాలి. ఇవి సాధారణంగా నిర్వచనాలు, సిద్ధాంత నిరూపణలు, అనువర్తనాలపై ఆధారపడిన లెక్కల (న్యూమరికల్ ప్రాబ్లమ్స్)పై ఉంటాయి. వీటికీ సూటిగా చిన్న వాక్యాల్లో సమాధానాలు తయారు చేసుకోవాలి.

ఇంజినీరింగ్‌లో ఎందుకు ఎక్కువ ఫెయిల్?

ఇంటర్మీడియట్‌లో పాయింట్ల వారీగా జవాబులు రాయడానికి అలవాటు పడిన అభ్యర్థులు సెమిస్టర్ పద్ధతికి వెంటనే అలవాటు పడలేరు. పరీక్షలు వెంటనే వచ్చేసినట్లు ఉంటాయి. ప్రిపరేషన్‌కు సరిగా ప్లాన్ చేయరు. అనువర్తన కోణంలో వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో తడబడతారు. కొందరు పర్సంటేజీ పెంచుకుందాం అంటూ పరీక్షలను వాయిదా వేస్తారు. ఇంకొందరు ఇంజినీరింగ్ పరీక్ష విధానం పట్ల తగిన అవగాహన ఏర్పరచుకోరు. ఈ విధమైన లోపాల వల్ల సంప్రదాయం కోర్సులతో పోల్చినప్పుడు ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉంటోంది. వీటి పట్ల మొదటి నుంచి అప్రమత్తంగా ఉంటే బ్యాక్‌లాగ్‌లు లేకుండా మంచి మార్కులు సాధించుకోవచ్చు. సెమిస్టర్ గరిష్ఠంగా 750 మార్కులకు ఉంటే, అందులో ప్రాక్టికల్స్‌కి 150 లేదా 225 మార్కులు ఉంటాయి. సరిగా సిద్ధమైతే 20 నుంచి 30 శాతం మార్కులు వీటి నుంచే పొందవచ్చు.

పరీక్ష కేంద్రంలో...

- ❒ చివరి నిమిషం వరకు చదవద్దు. పరీక్ష రాసేటప్పుడు గుర్తు రాదేమోననే అనవసర భయాలు వదిలేయాలి.
- ❒ పరీక్షా కేంద్రానికి పావుగంట ముందే చేరుకోవాలి. కాసేపైనా మౌనంగా ఉండటం మంచిది.
- ❒ పరీక్షకు చదువుతున్న స్నేహితులకు అంతరాయం కలిగించవద్దు. వాళ్ల సందేహాలు తీర్చమని కోరితే క్లుప్తంగా ముగించాలి.
- ❒ కేటాయించిన సీటుకు పది నిమిషాల ముందే చేరాలి. ప్రశాంతంగా ఉండాలి.
- ❒ పెన్ను, పెన్సిల్, క్యాలిక్యులేటర్ వంటి వాటిని ముందే సిద్ధం చేసుకోవాలి. ఇతరులను అడగడం, వారికి ఇవ్వడం సరైనది కాదు.
- ❒ ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదవాలి. సమాధానాలు తెలిసిన ప్రశ్నలను గుర్తించాలి. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందు జవాబులు రాయాలి. తర్వాత మిగిలిన వాటని రాయాలి.
- ❒ వీలైనంత వరకు ఒక విభాగంలోని ప్రశ్నలకు ఒకే క్రమంలో జవాబులు రాయాలి.
- ❒ అవసరమైన చోట స్పష్టత కోసం బొమ్మలు వేయాలి.
- ❒ సమయం మిగుల్చుకొని అదనపు ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి.



- ❒ చివరి పావుగంటలో అన్ని జవాబులు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- ❒ పరీక్ష ముగిసిన తర్వాత అనవసర చర్చలు చేయవద్దు. ఒకవేళ తప్పులు దొర్లినట్లనిపించినా ఆందోళన పడాల్సిన పని లేదు.

ఇవీ జాగ్రత్తలు!

- పరీక్షల సమయంలో నిద్ర, తిండి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వాలి.
- సాత్వికమైన, పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలి.
- సినిమాలు, షికార్లు, మొబైల్ ఫోన్లు, అనవసర ముచ్చట్లు, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.
- పరీక్ష కేంద్రాలకు మొబైల్ తీసుకెళ్లకపోవడం మంచిది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూపీఎస్సీ

1) కంబైన్డ్ జియో సైంటిస్ట్, జియాలజిస్ట్ ఎగ్జామ్-2018

పోస్టులు: జియాలజిస్ట్, కెమిస్ట్, హైడ్రోజియాలజిస్ట్ తదితరాలు.
ఖాళీలు: 70 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత. **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.

2) ఐఈఎస్/ ఐఎస్ఎస్ ఎగ్జామ్-2018



ఖాళీలు: ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-14, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్-32
అర్హత: ఎకనామిక్స్, మ్యాథమేటిక్స్ సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత.
వయసు: 21-30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష/ వైవా/ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
దరఖాస్తు ఫీజు: రూ.200
చివరితేది: 16.04.2018
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఓఎన్‌జీసీ

సంస్థ: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్, డెహ్రాడూన్.
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ (హెచ్ఆర్/ ఫైనాన్స్/ అఫిషియల్ లాంగ్వేజ్), అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్.
ఖాళీలు: లీగల్ అడ్వైజర్-15, ఎగ్జిక్యూటివ్ ఖాళీలను తర్వాత వెల్లడిస్తారు.
అర్హత: 60శాతం మార్కులతో సంబంధిత స్పెషలైజేషన్లలో ఎంబీఏ/ పీజీ/ రెండేళ్ల పీజీ డిప్లొమా.
వయసు: 30 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలు, యూజీసీ నెట్-2018 స్కోరు, క్లాట్-2018 స్కోరు, ఇంటర్వ్యూ ద్వారా.
ఎగ్జిక్యూటివ్ పోస్టుల ఆన్‌లైన్ దరఖాస్తు: 06.04.2018 నుంచి 27.04.2018 వరకు.
లీగల్ అడ్వైజర్ ఆన్‌లైన్ దరఖాస్తు: 23.05.2018 నుంచి 21.06.2018 వరకు
వెబ్‌సైట్: http://ongcindia.com/

సుప్రీంకోర్టులో 78 పోస్టులు

పోస్టులు-ఖాళీలు: జూనియర్ కోర్ట్ అటెండెంట్-65, చాంబర్ అటెండెంట్-13
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత.
వయసు: 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 15.04.2018
http://supremecourtofindia.nic.in/

ఎన్ఎండీసీ, హైదరాబాద్


సంస్థ: నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ), హైదరాబాద్.
వర్క్ లొకేషన్: నాగర్నార్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, జగదల్‌పూర్, ఛత్తీస్‌గఢ్.
పోస్టులు: జూనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్
ఖాళీలు: 11 **అర్హత:** ఆయా సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, డిగ్రీ, పీజీ, డిప్లొమా. దివ్యాంగ అభ్యర్థులు మాత్రమే అర్హులు.
వయసు: 55 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
చివరితేది: 14.05.2018
వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

ఐటీఐ లిమిటెడ్

సంస్థ: ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ (ఐటీఐ) లిమిటెడ్, బెంగళూరు.
వర్క్ లొకేషన్: పాలక్కడ్ ప్లాంట్, కేరళ.
పోస్టు: కాంట్రాక్ట్ ఇంజినీర్
ఖాళీలు: 10
అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్.
చివరితేది: 07.04.2018
వెబ్‌సైట్: http://www.itiltd-india.com/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

లైబ్రరీ




కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.

ఆర్ఆర్‌బీ, పోస్టల్

1) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి 25 మోడల్ పేపర్లు, పేజీలు: 233, ధర: రూ. 108

2) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి మ్యాథమేటిక్స్, పేజీలు: 462, ధర: రూ. 180



3) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, పేజీలు: 230, ధర: రూ. 108

4) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ సైన్స్, పేజీలు: 246, ధర: రూ. 108

5) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ అవేర్‌నెస్-కరెంట్ అఫైర్స్, పేజీలు: 324, ధర: రూ. 144

6) పోస్ట్‌మాన్/మెయిల్ గార్డ్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్, టాప్ 31 మోడల్ పేపర్స్ (తెలుగులో), పేజీలు: 182, ధర: రూ. 81

7) పోస్ట్‌మాన్/మెయిల్ గార్డ్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్, టాప్ 21 పేపర్స్ (ఇంగ్లిష్‌లో), పేజీలు: 159, ధర: రూ. 81

ప్రచురణ: వీజీఎస్ బుక్ లింక్స్

Fit as a fiddle... ఏ అర్థంలో?

MODERN ENGLISH USAGE

'అతడి ఆరోగ్యానికేం.. దుక్కలా ఉన్నాడు' అని తెలుగులో అంటుంటాం. ఇంచుమించు ఇలాంటిదే ఇంగ్లిష్‌లో కూడా ఉంది. చాలా ఆరోగ్యంతో బలంగా ఉండటాన్ని సూచించే వ్యక్తీకరణ. అదేమిటో, దాన్ని ఎలా ఉపయోగించాలో చూద్దామా?



ఎం. సురేశన్

Narayana: Sunil is a good speaker. I don't know how he acquired the gift of the gab (సునీల్ మంచి వక్త. అంత వక్తృత్వం అతనికి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీడం లేదు).

Bhaskar: No surprise in it. His grandfather was a great speaker. He must have inherited it from his grandfather (అందులో ఆశ్చర్యం లేదు. అతని తాతయ్య మంచి వక్త. ఆయన దగ్గరినుంచి అతను ఈ వక్తృత్వం వారసత్వంగా పొందివుండాలి).

Narayana: The last time I met him, he was on a knife edge. He could not talk to me steadily because he had had something else on his mind (క్రితంసారి నేనతన్ని కలుసుకున్నపుడు అతను ముళ్ల మీదున్నట్టు కనిపించాడు).

Bhaskar: His uncle is under a cloud. He grabbed all the property of Sunil, and Sunil and his parents were not aware of it. That must have been the cause of his father's absent-mindedness (వాళ్ల బాబాయిని ఎవరూ నమ్మటం లేదు. సునీల్ ఆస్తిని కాజేశాడు. అయితే అది సునీల్‌కుగానీ అతని తల్లిదండ్రులకుగానీ తెలీదు. అది వాళ్ల నాన్న అన్యమనస్కుడై ఉన్నందువల్ల అయ్యుండొచ్చు).

Narayana: He and his dad are too innocent and trust everybody. That was how his uncle was able to cheat them (అతనూ, వాళ్ల నాన్నా మరీ అమాయకులు. అందరినీ నమ్మేస్తారు).

Bhaskar: Yea, I have had some experience of his uncle. He is always fit as a fiddle and I have never seen him fall ill. He is always under a cloud. None trusts him (అవును, వాళ్ల బాబాయిని గురించి నాకూ కాస్త అనుభవం ఉంది. ఎప్పుడూ చాలా ఆరోగ్యంగా ఉంటాడు, అతను జబ్బు పడటం నేను చూడలేదు. అతన్ని అందరూ సందేహిస్తారు. ఎవరూ అతన్ని నమ్మరు).

Narayana: Hope Sunil and his dad will wriggle out of the trouble and his uncle will be taught a lesson. (సునీల్, వాళ్ల నాన్న ఈ చిక్కుల్లో నుంచి బయట పడతారని వాళ్ల బాబాయికి బుద్ధి చెప్తారని ఆశిస్తున్నా).

Bhaskar: It is really shocking that his uncle has cheated his own close relatives (తన దగ్గరి చుట్టాలనే వాళ్ల బాబాయి మోసం చేయడం చాలా దిగ్భ్రాంతికరంగా ఉంది).

Narayana: Yea, the more you trust someone, the more they cheat you (అవును, నువ్వు ఇతరులను ఎంత నమ్మితే వాళ్లు నిన్నంత మోసం చేస్తారు).



Now look at the following expressions from the conversation:

1. Gift of the gab = Ability to talk fluently (ఉపన్యాస చాతుర్యం).

Jayanth: How good a speaker our friend Muralidhar! (మన మురళీధర్ ఎంత గొప్ప వక్త!)
Sampath: Oh, he is an excellent speaker. None else equals him in making fiery speeches. He has the gift of the gab (అవును అతను చాలా గొప్ప ఉపన్యాసకుడు. ఉద్వేగంతో ఉపన్యాసాలు ఇవ్వడంలో అతనికి ఎవరూ సమానం కాదు. అతనికి మంచి ఉపన్యాస పటిమ ఉంది).

2. Fit as a fiddle = Very healthy and strong చాలా ఆరోగ్యంతో బలంగా ఉండటం).

Jayakumar: Nataraj has always some health trouble or the other. His visits to the doctor are very frequent (నటరాజ్‌కు ఏదో ఒక ఆరోగ్య సమస్య వస్తుంటుంది. తరచుగా డాక్టర్‌ను కలుస్తుంటాడు).
Peter: His brother is the exact opposite. He is very robust and always fit as a fiddle (అతని తమ్ముడు అతనికి పూర్తిగా వ్యతిరేకం. అతను ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటాడు).

3. Under a cloud = Not trusted by anybody (ఎవరూ నమ్మకపోవడం).

Sankar: The officer is notorious for taking bribes. He is quite wealthy and owns a lot of properties (ఆ అధికారి లంచాల విషయంలో చాలా పేరు మోసినవాడు. అతను సంపన్నుడు, ఆస్తులు కూడా ఉన్నాయి).
Prabhakar: He has always been under a cloud. But recently the Anti-corruption Bureau trapped him. He has been suspended from service (ఎప్పుడూ అతను అనుమానించదగ్గ వ్యక్తే. కానీ ఈ మధ్యనే అవినీతి నిరోధకశాఖ అతన్ని పట్టుకుంది. అతన్ని తాత్కాలికంగా ఉద్యోగ విధుల నుంచి బహిష్కరించారు).

అధ్యయనంతోనే.. ప్రాజెక్టుల పునరాకృతి

- ఆయకట్టు పెరగడం వల్లనే అంచనాలు పెరిగాయి
- ఐదు ప్రాజెక్టుల పునరాకృతితో అంచనా వ్యయం రూ.61,487 కోట్ల మేరకు పెరిగింది
- గుత్తేదారులకు మేలు చేకూర్చడం లేదు
- ముంపును నియంత్రించేందుకే తుపాకులగూడెం
- అసెంబ్లీలో నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం

ఈనాడు - హైదరాబాద్

'రాష్ట్ర భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకునే ప్రాజెక్టులను పునరాకృతీకరించాం. ఆయకట్టు పెంచాం. రిజర్వాయర్ల సామర్థ్యాన్నీ పెంపొందించాం. వీటన్నింటి కారణంగానే అంచనా వ్యయాలు పెరిగాయి. ప్రాజెక్టుల సమగ్ర నివేదికలను(డీపీఆర్) రూపొందించకుండా, కేంద్ర ప్రభుత్వానికి పంపకుండా పనులు చేపట్టామన్నది అబద్ధం. కాళేశ్వరం ద్వారా 2021-22లోపు ఆయకట్టుకు నీటిని అందిస్తాం.' అని నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ మధుసూదనాచారి ప్రశ్నోత్తరాలను చేపట్టారు. నీటిపారుదల ప్రాజెక్టుల పునరాకృతులపై



ఎమ్మెల్యేలు జి.కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. 'గతంలో రూపొందించిన ప్రణాళిక ప్రకారం ప్రాణహిత చేవెళ్లను నిర్మిస్తే నీళ్లు లేని కట్టడంగా మిగిలిపోతోంది. అందుకే దాని ఆకృతి మార్చాం. దాని సామర్థ్యాన్ని 11 టీఎంసీల నుంచి 145 టీఎంసీలకు పెంచాం. తాము ప్రతిపాదించిన చోట నీళ్లు ఉన్నట్లు కేంద్ర జలవనరుల కమిషన్(సీడబ్ల్యూసీ) కూడా ఆమోదించింది. కాళేశ్వరం ప్రాజెక్టును గతంలో 16 లక్షల ఎకరాల ఆయకట్టుతో ప్రతిపాదించారు. తాము దాన్ని 37 లక్షల ఎకరాలకు పెంచాం. గోదావరిపై మూడు వారధులు నిర్మించి 365 రోజులూ నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నాం. కంతనపల్లి ప్రాజెక్టును ఆగం చేశామన్నది వాస్తవం కాదు. అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే 11 వేల ఎకరాల గిరిజన భూములు, 20 తండాలు ముంపునకు గురి అవుతాయి. అందుకే తుపాకులగూడెం వద్ద ప్రాజెక్టును నిర్మిస్తున్నాం. అక్కడ ఒక్క ఇల్లు కూడా ముంపు బారిన పడటం లేదు. 250 ఎకరాలు మాత్రమే ముంపునకు గురి అవుతోంది. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులను పునరాకృతీకరించి అభయారణ్యాన్ని కాపాడాం. ప్రాణహిత-చేవెళ్ల సుజల ప్రవంతి, జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల, ఇందిరమ్మ వరద ప్రవాహ కాలువ, పీవీ నరసింహారావు కంతనపల్లె సుజల స్రవంతి, సీతారామ ఎత్తిపోతల సాగు నీటి ప్రాజెక్టుల పునరాకృతి కారణంగా అంచనా వ్యయం రూ.61,487 కోట్లు పెరిగింది. పునరాకృతుల ద్వారా గుత్తేదారులకు మేలు చేస్తున్నామన్నది అవాస్తవం. పారదర్శకంగా ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత గుత్తేదారులకు ముందస్తు బయానాలిచ్చే (మొబిలైజేషన్ అడ్వాన్సులు) విధానాన్ని ఎత్తివేశాం. ఈపీసీ విధానాన్ని రద్దు చేశాం. గతంలో ప్రాజెక్టుల సమగ్ర నివేదిక రూపొందించే పేరుతో గుత్తేదారులు మూడు శాతం మొత్తాన్ని బయానాగా తీసుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వ ఇంజినీర్లే ఆ పని చేస్తున్నారు.' రానున్న వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం.' అని వెల్లడించారు.

పునరాకృతి వల్లనే అనుమతులొచ్చాయి

'నీటి వనరుల లభ్యత లేకుండానే మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను చేపట్టడంతో వాటికి అనుమతులు రాలేదు. తాము పునరాకృతి చేయడం వల్లనే కేంద్ర జలవనరుల కమిషన్ అనుమతులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేదని చెప్పటం లేదు' అని.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గొంగిడి సునీత, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, ఎన్.ఒదేలు(తెరాస), ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్(భాజపా) అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానంగా చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలితం వరంగల్ జిల్లాతోపాటు మునుపటి నల్గొండ జిల్లా పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకే దక్కుతుందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో ఒక్క పోలవరం ప్రాజెక్టును మాత్రమే జాతీయ ప్రాజెక్టుగా పేర్కొన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు కూడా చేర్చి ఉంటే కేంద్రం నుంచి నిధులు వచ్చేవని వివరించారు.



గుత్తేదార్లను తప్ప.. అన్నింటినీ మార్చారు

కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చారు. ఇప్పుడేమో ప్రాజెక్టుల అంచనా వ్యయాలను విపరీతంగా పెంచారు. కంతనపల్లి ప్రాజెక్టును రద్దు చేశారు. ఈ ప్రాజెక్టును నిర్మించకపోతే దేవాదుల ప్రాజెక్టుకు చేస్తున్న వ్యయం వృథా అవుతుంది. ప్రాజెక్టుల్లో గుత్తేదార్లను తప్పించి అన్నింటినీ మార్చారు. ఈ విధానాలన్నీ వారికి లాభాలు చేకూర్చేవే. డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టులను కట్టేస్తున్నారు.

– జి.కిషన్‌రెడ్డి, భాజపా



సుంకేసులను కాదని కేశవాపురం ఎందుకు

గ్రావిటీ ద్వారా వచ్చే ప్రాజెక్టులను చేపడితే వ్యయం తగ్గేది. దాన్ని వదిలేసి ఎక్కువ వ్యయం అయ్యే ప్రాజెక్టులనే చేపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో సుంకేసులను కాదని రిజర్వాయర్‌ను కేశవాపురం వద్ద ఎందుకు నిర్మిస్తున్నారు. రూ.1,100 కోట్లతో 50 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఉంటే రూ.4,396 కోట్లు ఎందుకు వ్యయం చేస్తున్నారు.

– కె.లక్ష్మణ్, భాజపా

నిలోఫర్‌లో చిన్నారుల గుండె చికిత్సల యూనిట్

మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నవజాత శిశువుల్లో వచ్చే గుండె సంబంధిత సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా బుధవారం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్ (మజ్లిస్), ఎన్.రాజేందర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, పువ్వాడ అజయ్ (తెరాస) అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'చిన్నారుల్లో గుండెకు సంబంధించిన పలు సమస్యలు వస్తున్నాయి. వీటి చికిత్సకు నిలోఫర్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తే పేదలకు ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్రంలోని నవజాత శిశువుల్లో ప్రతి వెయ్యి మందికి 30 మంది మృత్యువాత పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈ శాతం తగ్గింది అని మంత్రి చెప్పారు.

విజయా డెయిరీ సామర్థ్యం పెంపు: తలసాని

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ డెయిరీ సామర్థ్యం రెండు లక్షల లీటర్లు మాత్రమేనని, దాన్ని 8-10 లక్షల లీటర్లకు పెంచనున్నట్లు పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, సోలిపేట రామలింగారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. 'ఎన్డీసీ, నాబార్డు సహాయంతో విజయా డెయిరీని అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వాలని కోరగా ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు' అన్నారు. పహాడి షరీఫ్ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు.

మా ఊరి పేరును మార్చండి: ధర్మారెడ్డి

నా సొంత ఊరుపేరు దొంగల సింగడి నుంచి ప్రజలసింగడిగా మార్చేందుకు 1996లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా అమల్లోకి రాలేదని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శాసనసభ శూన్యగంటలో ప్రస్తావించారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు.

సమాధానాలు ఇవ్వటం లేదు: కిషన్‌రెడ్డి

శూన్యగంటలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు మంత్రులు లేదా అధికారుల నుంచి 15 రోజుల దాటినా సమాధానాలు రావటం లేదని ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ అంశంపై స్పీకర్ రూలింగ్ ఇవ్వాలని కోరారు. శాసనసభా వ్యవహారాల మంత్రి సమాధానమిస్తూ ఈ అంశంపై ఇప్పటికే ప్రధాన కార్యదర్శితో చర్చించామన్నారు. సమాధానాలు వస్తున్నాయన్నారు. తన మంత్రిత్వ శాఖ నుంచి 70 నుంచి 80 సమాధానాలు ఇచ్చామన్నారు. సభాపతి మధుసూదనాచారి జోక్యం చేసుకుని ఇప్పటికే ఒకసారి ప్రధాన కార్యదర్శితో చర్చించామని, ఈరోజు మళ్లీ మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేలు ఎ.జీవన్‌రెడ్డి, మొజంఖాన్, లక్ష్మణ్, మదన్‌లాల్, ఆర్.కృష్ణయ్య, గుణేష్‌గుప్తా, సున్నం రాజయ్య, వేముల ప్రశాంతరెడ్డి, కౌసర్ మొయినుద్దీన్, గొంగిడి సునీత పలు అంశాలను ప్రస్తావించారు.

ఉద్యోగాల భర్తీ లేక యువశక్తి నిర్వీర్యం: కృష్ణయ్య

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం వల్ల.. సమాజ ప్రగతికి పాటుపడాల్సిన యువశక్తి నిర్వీర్యమవుతోందని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని.. లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

రిజర్వేషన్లపై కేసీఆర్‌ది మోసపూరిత వైఖరి: షబ్బీర్‌అలీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: గిరిజన, ముస్లిం రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా వర్గాలను మోసం చేస్తున్నారని మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ ఆరోపించారు. తన పరిధిలో చేయాల్సింది పక్కనపెట్టి... కేంద్రంపై నెపం నెట్టేందుకు పార్లమెంటులో తెరాస ఎంపీలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర మాజీమంత్రి పి.బలరాం నాయక్‌తో కలిసి షబ్బీర్‌అలీ బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

మూడో కూటమి రాజకీయాలపై చర్చకు సిద్ధమా?: శ్రవణ్

దేశ వ్యాప్తంగా మోదీపై వ్యతిరేకత, రాష్ట్రంలో తెరాస ప్రభుత్వ వైఫల్యాలపై జరుగుతున్న విస్తృత చర్చ, కేటీఆర్‌ను సీఎం చేయాలనే ప్రయత్నం...వెరసి మూడో కూటమి నాటకానికి సీఎం కేసీఆర్ తెరలేపారని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ప్రతిపాదిస్తున్న మూడో కూటమి రాజకీయాలపై కేసీఆర్ బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

ఎగవేతదారులకే కేంద్ర సాయం!

- రైతు రుణ మాఫీ కోసం కనీస సహకారం కరవు
- మండలిలో మంత్రి ఈటల రాజేందర్

ఈనాడు, హైదరాబాద్: అప్పు చేయకూడదనేది కాలం చెల్లిన ఆలోచనని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. నిజాం కాలంలో వాడి, భద్రాచలం, కాజీపేట, విజయవాడ రైల్వే మార్గాల నిర్మాణానికి సాలార్‌జంగ్ అప్పులు తీసుకున్నపుడు కొందరు విమర్శించారని... కానీ, ఆ రోజు అప్పులు చేయకుంటే అభివృద్ధి కనిపించేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పలు పథకాల కింద నిధుల మంజూరు ఆశించినంతగా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యక్ష పన్నుల్లో 2.43 శాతం వస్తున్నా.. తెలంగాణకు ఇందులోనూ అన్యాయమే జరిగిందని ఆరోపించారు. పన్నులు, బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారికి కేంద్రం రుణమాఫీ అమలుచేస్తోందని ఎద్దేవా చేశారు. కానీ, తెలంగాణ రైతులకు రూ.17 వేల కోట్ల రుణమాఫీకి కనీస సహాయం చేయలేదని, ఆర్‌బీఐ కూడా సహకరించలేదని తెలిపారు. శాసనమండలిలో బడ్జెట్ ప్రసంగంపై జరిగిన చర్చకు ఈటల సమాధానమిచ్చారు. "డబ్బులు ఉన్నపుడే పనులు చేయాలనుకుంటే 50 ఏళ్లయినా అభివృద్ధి జరగదు. దేశంలో తలసరి ఆదాయం రూ.1.64 లక్షలు ఉంటే.. తెలంగాణలో రూ.1.74 లక్షలు ఉంది. రూపాయికే యూనిట్ విద్యుత్ లభిస్తోందని అంటున్నారు. ఇలాగైతే మిగతా రాష్ట్రాల్లో రైతులకు ఉచిత విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదు. కేంద్రం ఐసీడీఎస్‌కు నిధులు తగ్గించినా, రాష్ట్రం మరిన్ని నిధులు ఇస్తోంది. మైనార్టీ విద్యాసంస్థలకు సాయం చేయాలని కేంద్ర మంత్రి నఖ్వీని అడిగినా పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వమే ఒక్కోవిద్యార్థిపై రూ.1.05 లక్షల నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చు చేస్తోంది" అని ఈటల వివరించారు.

ప్రతిఒక్కరూ కాళేశ్వరం పనులు చూడాలి: స్వామిగౌడ్

కళ్లున్న ప్రతి ఒక్కరూ జలాలు రాకముందే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చూసి తీరాలని మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్సీలను మహబూబ్‌నగర్, ఖమ్మంలోని ప్రాజెక్టులకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

వచ్చే ఏడాదినుంచి తెలుగు తప్పనిసరి: కడియం

రానున్న విద్యాసంవత్సరం నుంచి తొలి విడతగా ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా బోధించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తొలుత ఇంటర్ వరకు అమలుచేయాలని భావించినా.. సాంకేతికంగా కొన్ని సమస్యలు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

ఆకాశమార్గాలకు రక్షణశాఖ అడ్డంకులు: కేటీఆర్

పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే మూసీ నది మీదుగా వంతెన నిర్మాణ పనులు చేపడతామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఉప్పల్ వద్ద ఆకాశమార్గాన్ని జాతీయ రహదారుల సంస్థతో కలిసి నిర్మిస్తామని.. త్వరలోనే టెండర్లు పిలుస్తామని వెల్లడించారు. బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిచ్చారు. "ఆదిలాబాద్, రామగుండం రహదారులను కలిపే ఆకాశ మార్గాలు నిర్మించేందుకు రూ.2500 కోట్లు సిద్ధం చేశాం. అయితే రక్షణ శాఖ తరచూ అభ్యంతరాలు పెడుతోంది. తొలుత 100 ఎకరాలకు 600 ఎకరాలు కోరగా అంగీకరించాం. ఆ తర్వాత ఏటా రూ.30 కోట్ల చొప్పున శాశ్వతంగా చెల్లించాలంటూ మెలిక పెట్టింది. ఎన్డీఏ హయాంలో ఇప్పటి వరకు పనిచేసిన ముగ్గురు రక్షణ మంత్రులతో సీఎం కేసీఆర్ చర్చించినా కేంద్రం పట్టించుకోవడం లేదు" అని పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడతామని ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్కొనగా... అనుమతి తీసుకొస్తే మీతోనే కొబ్బరికాయ కొట్టించి పనులు ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లో రూ.23 వేల కోట్లతో రోడ్ల అభివృద్ధి, వంతెనల నిర్మాణం చేపడుతున్నామని.. ఇందులో రూ.3 వేల కోట్ల పనులు ప్రారంభించామని వివరించారు. నగరం మరోసారి ఉత్తమ నివాస నగరంగా మెర్సర్స్ సంస్థ గుర్తించిందని వెల్లడించారు. దివ్యాంగుల కోసం స్వచ్ఛంద సంస్థల పరిధిలో నడుస్తున్న కేంద్రాలను ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఏప్రిల్ నెలాఖరుకల్లా కొత్త రేషన్ కార్డులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అర్హులందరికీ ఏప్రిల్ నెలాఖరుకల్లా కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. కొత్త కార్డుల కోసం 2.50 లక్షల దరఖాస్తులు అందగా వాటిలో ఇంతవరకు 77 వేల మంది అర్హులను గుర్తించినట్లు చెప్పారు. కార్డుల కోసం ఆందోళన చెందనక్కర్లేదనీ, ఎవరి కార్డుల్నీ తొలగించబోమని స్పష్టం చేశారు. రేషన్ డీలర్ల కమీషన్‌ను త్వరలో కిలోకు ప్రస్తుత 55 పైసల నుంచి 70 పైసలకు పెంచే యోచన ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, పౌరసరఫరాల పద్దులపై బుధవారం శాసనసభలో చేపట్టిన చర్చలో.. వివిధ పార్టీల సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి ఈటల సమాధానమిచ్చారు. ఐరిస్ విధానాన్ని కూడా అమల్లోకి తెచ్చి ప్రస్తుతం ఇ-పాస్‌లో ఉత్పన్నమవుతున్న వేలిముద్రల సమస్యను అధిగమిస్తామని, కేంద్ర ప్రభుత్వం సూచించిన ఆహార భద్రత గుర్తును రేషన్ కార్డులపై ముద్రిస్తామని వెల్లడించారు. వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఇవ్వదలచిన రూ.8 వేల పెట్టుబడి రాయితీ మొత్తాలను కౌలుదార్లకు ఇవ్వలేమన్నారు. కౌలుదార్లు మారిపోతూ ఉంటారు కనుక వారి పేరిట చెక్కుల్ని ఇవ్వడం వల్ల సమస్యలు ఏర్పడతాయనీ, అందువల్ల పట్టాదారుకే తాము చెక్కులను ఇస్తామన్నారు. పట్టాదారు, కౌలుదారు కలసి ఆ





సభలో మాట్లాడుతున్న మంత్రులు ఈటల, పోచారం

రాయితీ మొత్తంపై నిర్ణయం తీసుకోవాలన్నారు. చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేసుకొన్నప్పుడు పాత బకాయిల కోసం ఆ మొత్తాన్ని అక్కడి సిబ్బంది తీసేసుకొంటారనే దిగులు అక్కర్లేదనీ, ఏ బ్యాంకులోనైనా మార్చుకొని నగదు తీసుకొనే సౌలభ్యంగల చెక్కులను ఇస్తున్నట్లు చెప్పారు. ఇంతకుముందు రుణమాఫీ అమలైన సమయంలో.. రీషెడ్యూల్ చేసి ఉన్న రుణాలను కూడా మాఫీ చేయటంపై త్వరలోనే నిర్ణయం తీసుకొంటామన్నారు. రెండు, మూడు గ్రామాలకు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించతలపెట్టామని, ఇంతవరకు ఆయా ప్రాంతాల రైతులు ముందుకొచ్చి వాటి నిర్మాణానికి 20 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి మొదలుకొని ఇక ఎవరు ఆ గ్రామానికి వెళ్లినా ఆ వేదికపై నుంచే రైతులను ఉద్దేశించి మాట్లాడతారన్నారు. పంటల బీమాకు గ్రామాన్ని, మండలాన్ని కాకుండా రైతును యూనిట్‌గా తీసుకోవాలని కేంద్రాన్ని మరోసారి కోరనున్నామన్నారు. అంతకుముందు తెదేపా సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల కారణంగా పంట చేతికి అందక ఆత్మహత్యలు చేసుకొన్న సందర్భాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. చేపల ఉత్పత్తిని పెంచుతున్నందున వాటిని తినటం వల్ల ఒనగూరే ప్రయోజనాల గురించీ ప్రభుత్వం ప్రచారం చేయాలని సూచించారు. ఆయా వర్గాలవారికి ఆవులు, బర్రెలు కూడా ఇవ్వాలన్నారు. సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రేషన్ దుకాణాల సంఖ్యను పెంచి గిరిజనులకు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ కారణాలతో కార్డులను తొలగించిన వారందరికీ మళ్లీ కార్డులు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ శాఖలో పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. రకరకాల కారణాలను చూపి రేషన్ కార్డులను పెద్ద సంఖ్యలో రద్దు చేస్తున్నారని భాజాపా శాసన సభాపక్ష నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. మురికివాడలో 20 గజాల జాగాలో రెండు అంతస్తులను నిర్మించుకొన్న వారికి పక్కా భవనం ఉందంటూ అనర్హులుగా ఎలా ప్రకటిస్తారంటూ ప్రశ్నించారు.

మద్దతు ధరకు బోనస్ ఇవ్వరా?

- వ్యవసాయశాఖ పద్దుపై చర్చలో చింతల రామచంద్రారెడ్డి
- రైతు కళ్లల్లోకి చూస్తే బంగారు తెలంగాణ కనిపిస్తుంది: రసమయి

ఈనాడు, హైదరాబాద్: 'జాతీయ నేర విభాగం రికార్డుల ప్రకారం గత మూడేళ్లలో తెలంగాణలో 3,800 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.. ఇతర అధ్యయనాలు మాత్రం 6 వేల వరకు ఉండొచ్చని చెబుతున్నారు. మరి ఇది బంగారు తెలంగాణ ఎలా అవుతుంది'.. అని భాజపా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తరచూ చెబుతుంటారు.. రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారు. మరి రైతు ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదు?.. అని పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయ, పశుసంవర్ధక, పౌరసరఫరాల శాఖల డిమాండ్లపై చర్చ జరిగింది. ఆయన మాట్లాడుతూ గుజరాత్, పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వాలు పంట ఉత్పత్తులకు మద్దతు ధర లేకుంటే బోనస్‌లు ఇచ్చి ఆదుకుంటున్నాయి. గుజరాత్‌లో పత్తికి రూ.వెయ్యి, మహారాష్ట్రలో రూ.800 ఇస్తున్నారు. తెలంగాణలో బోనస్ ఇవ్వరా అన్నారు. దీనిపై ప్రశ్నించిన రైతులపై కేసులు పెట్టి బేడీలు వేస్తున్నారన్నారు. తెలంగాణను నెంబరు 1 విత్తన భాండాగారంగా చేస్తామని సీఎం చెప్పారు.. నకిలీ విత్తనాలతో రైతులు ఎందుకు నష్టపోతున్నారో ఆలోచించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రం నీరు గారుస్తోందని ఆరోపించారు. రైతులకు రూ.5 లక్షల బీమా చేస్తామంటున్నారు.. స్వాగతిస్తున్నామని చెప్పారు. దేశంలో 27 రాష్ట్రాల్లో 24 గంటల విద్యుత్తు ఇస్తుండగా తెలంగాణ ఒక్కటే అని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఇది మోదీ ప్రభుత్వ ఘనతేనన్నారు.

రైతు ఆత్మగౌరవంతో బతికే రాష్ట్రం ఇదే: రైతులు ఆత్మగౌరవంతో బతికే రాష్ట్రం ఏదైనా ఉంటే అది తెలంగాణ మాత్రమేనని తెరాస సభ్యుడు రసమయి బాలకిషన్ వ్యాఖ్యానించారు. ఇతర వృత్తుల వారంతా జీవించాలంటే రైతు బతకాలని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాత బాగు గురించి ఆలోచన చేశారన్నారు. రైతు కేంద్ర బిందువు కావాలన్నది సీఎం లక్ష్యమని, అందుకే రుణమాఫీ, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువుల సరఫరా తదితరాలెన్నో అమలు చేస్తున్నారన్నారు. రైతు కళ్లల్లో చూస్తే బంగారు తెలంగాణ కనిపిస్తుందని తెలిపారు. అంతకు ముందు డీజీపీ ఎంపిక, నియామకాన్ని తెలంగాణ ప్రభుత్వమే నిర్ణయించే బిల్లును మంత్రి హరీశ్‌రావు సభలో ప్రవేశపెట్టారు.

ఎదురు దాడి చేస్తున్న ప్రభుత్వం: లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్, ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నాలుగేళ్ల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అధికార పక్షం శాసనసభలో తమపై రాజకీయంగా ఎదురుదాడి చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్ర అసెంబ్లీలో భాజపా, ఇతర పక్షాలు ప్రశ్నిస్తే బయటకు పంపిస్తున్నారని.. పార్లమెంటు సమావేశాలు జరగకుండా తెరాస ఎంపీలు స్తంభింపజేయడం లేదా? అని ఆయన ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో, పార్టీ కార్యాలయంలోనూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని ప్రభుత్వం చెబుతోందని.. కానీ 2013లో రుణాలు తీసుకున్న 1,606 మంది దుబ్బాక రైతులకు ఇంకా మాఫీ కాలేదన్నారు. రుణాలు కట్టకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బ్యాంకులు సదరు రైతులకు తాఖీదులిచ్చాయన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 80వేల మంది అన్నదాతలు రుణాలను రీషెడ్యూల్ చేసుకున్నారని.. వీరి రుణాలను ప్రభుత్వం ఇప్పటికీ మాఫీ చేయలేదన్నారు. సమస్య పరిష్కారానికి కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో 23న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. బ్యాంకర్లతో రాష్ట్రప్రభుత్వం సమావేశం నిర్వహించాలని డిమాండ్‌చేశారు.



జూబ్లీహాలును సందర్శించిన సందర్భంగా నిజాం కాలం నాటి కళా నైపుణ్యంపై ఎమ్మెల్సీలతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

జూబ్లీహాలుకు పూర్వవైభవం

ఈనాడు, హైదరాబాద్: పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబ్లీహాలుకు పూర్వ వైభవం తేవాలని, గతంలో మాదిరే కలెక్టర్ల సమావేశాలు, ప్రముఖులతో భేటీలు, విందులను అక్కడ కొనసాగించే సంప్రదాయాన్ని మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ సచివాలయ అధికారులను ఆదేశించారు. బుధవారం శాసన మండలి సమావేశాలకు హాజరైన సీఎం ఈ సందర్భంగా జూబ్లీహాలును సందర్శించారు. దాదాపు అరగంట పాటు ప్రతి గదినీ పరిశీలించి హాలుకు చేరుకున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జూబ్లీహాలును సందర్శించడం ఇదే ప్రథమమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఏపీ శాసనమండలికి కేటాయించినందున దాన్ని చూసే అవకాశం కలగలేదన్నారు. ఇది మళ్లీ తెలంగాణకు రావడం ఆనందంగా ఉందన్నారు. తనకు స్ఫూర్తినిచ్చిన గొప్ప ప్రదేశాల్లో జూబ్లిహాలు ఒకటని తెలిపారు. తాను ఎంఏ చదువుతున్న రోజుల్లో జూబ్లిహాలుకు వచ్చి శాసనమండలి సమావేశాలను ప్రత్యక్షంగా చూసేవాడినని, గొప్పగొప్ప నేతల ప్రసంగాలను విని రాజకీయాల్లోకి రావాలని అప్పుడే నిర్ణయించుకున్నానని వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావానికి వేదికగా నిలిచిన స్థలాల్లో జూబ్లీహాలు ఒకటని గుర్తుచేశారు. ఇది నిజాం కాలం నాటి కళానైపుణ్యానికి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని చెప్పారు. జూబ్లీహాలును పునరుద్ధరించి..అందగా తీర్చిదిద్దాలని, కలెక్టర్లు, ఎస్పీల సమావేశాలు అక్కడే నిర్వహించేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రముఖులు సందర్శనకు వచ్చినప్పుడు విధిగా జూబ్లీహాలుకు తీసుకొని రావాలని సూచించారు. అనంతరం శాసనమండలి కార్యాలయాలను సీఎం సందర్శించారు. తనకు కేటాయించిన కార్యాలయాన్ని మంత్రులకు కేటాయించి, మంత్రులకు కేటాయించిన కార్యాలయాలను తనకు ఇవ్వాలని కోరారు. కార్యాలయాల్లో వాస్తుపరమైన మార్పులు, సౌకర్యాల గురించి సీఎం సూచించినట్లు తెలిసింది. మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లారాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ సలీం, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు సీఎం వెంట ఉన్నారు.

మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు వైద్య పరీక్షలు

గాంధీ ఆసుపత్రి, మెహిదీపట్నం, న్యూస్‌టుడే: మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ బుధవారం మరోమారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల శాసనసభలో జరిగిన సంఘటనలో ఆయన కంటికి గాయమైన నేపథ్యంలో సరోజిని ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం విదితమే. బుధవారం ఆసుపత్రికి వచ్చిన ఆయనకు మరోమారు వైద్య పరీక్షలు చేశారు. అక్కడి వైద్యుల సూచన మేరకు గాంధీ ఆసుపత్రికి వచ్చి రేడియాలజీ విభాగంలో సీటీ స్కానింగ్ చేయించుకొని నివేదికలు పొందారు. అనంతరం స్వామిగౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మూడ్రోజులపాటు సరోజిని ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని కట్టు విప్పాక ఇంటికి వెళ్లానని, ఒకరు ఇద్దరుగా కనిపిస్తుండడంతో మళ్లీ వైద్యులను సంప్రదించానని తెలిపారు.



కంటి చికిత్స కోసం సీటీ స్కానింగ్ చేయించుకుంటున్న మండలి ఛైర్మన్

వెంకట్‌రెడ్డి, సంపత్‌లకు ఓటు హక్కు లేదు

శుక్రవారం రాజ్యసభ ఎన్నికల పోలింగు

ఈనాడు, హైదరాబాద్: సభ్యత్వం రద్దయిన ఇరువురు శాసనసభ్యులకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వేసే అవకాశం లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(నల్గొండ), సంపత్‌కుమార్(అలంపూర్)ల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ శాసనసభ తీర్మానం చేసింది. సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సభాపతి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ రెండు స్థానాలు ఖాళీ అయినట్లు కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం నివేదించింది. కాగా రాజ్యసభ ఎన్నికల్లో వారికి ఓటు హక్కు కల్పించాలని శాసనసభ కార్యదర్శిని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ క్రమంలో శాసనసభ కార్యదర్శి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయగా బుధవారం ప్రత్యుత్తరం వచ్చింది. ఇందులో పోలింగు తేదీ నాటికి శాసనసభ్యులుగా ఉన్న వారికే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. సభ్యత్వం రద్దుపై ఇప్పటివరకు న్యాయస్థానం ఎలాంటి నిలుపుదల(స్టే) ఉత్తర్వులు జారీ చేయని నేపథ్యంలో వారికి ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. పోలింగు తేదీ రోజునాటికి ఉన్న సభ్యులకే ఓటు హక్కు ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ 'ఈనాడు'తో చెప్పారు. ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో శుక్రవారం పోలింగు జరగనుంది.

రాజ్యసభ ఓటర్ల జాబితాలో చేర్చండి

ఈసీకి కోమటిరెడ్డి, సంపత్‌ల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ, శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: రాజ్యసభ ఎన్నికల ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగించారంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ కుమార్‌లు ఫిర్యాదు చేశారు. బుధవారమిక్కడ టీపీసీసీ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీ అధ్యక్షుడు మర్రి శశిధర్ రెడ్డి నేతృత్వంలో ఎంపీ ఎంఏ ఖాన్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాలరెడ్డి, సంపత్ తదితరులు సీఈసీ రావత్‌తో భేటీ అయ్యారు. ఓటర్ల జాబితాలో తమపేర్లు చేర్చి రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించాలని వెంకట్‌రెడ్డి, సంపత్ విజ్ఞప్తి చేశారు. అనంతరం శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లు ప్రతిపాదన సంతకాలు చేశారని, నామినేషన్ సరిగానే ఉందని స్వీకరించి ఇప్పుడు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తీసేయడం సరికాదన్నారు. అంతకుముందు దిల్లీకి వెళ్లే ముందు వెంకట్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై 2019లో గజ్వేల్‌లో పోటీకి సిద్ధం అన్నందుకే తనను హత్య చేయడానికి కుట్ర పన్నారని.. అందులో భాగంగానే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి గన్‌మెన్లను తొలగించారని ఆరోపించారు.



దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్, రాజగోపాల్

కాంగ్రెస్ శాసనసభ్యులకు విప్ జారీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఈ నెల 23న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ విప్ జారీ చేసింది. పార్టీకి చెందిన 19 మంది శాసనసభ్యులకు శాసనసభలో కాంగ్రెస్ విప్ టి.రాంమోహన్‌రెడ్డి బుధవారం విప్ జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.బలరాం నాయక్‌కు ఓటేయాలని అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై 19 మంది విజయం సాధించగా అందులో ఏడుగురు శాసనసభ్యులు ప్రస్తుతం అధికార పార్టీ తెరాసలో చేరిన విషయం తెలిసిందే. పార్టీ మారిన ఏడుగురు ఎమ్మెల్యేలకు నేరుగా విప్ నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించగా వారు నిరాకరించారు. దీంతో వారి ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించే ప్రయత్నం చేయగా కొందరు తీసుకున్నారు. తీసుకోని వారికి వారి ఇళ్ల గోడలకు నోటీసులు అంటించివచ్చారు. రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు గురువారం ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి పార్టీ తెలంగాణ బాధ్యుడు రామచంద్ర కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డిలతో పాటు మిగతా ఎమ్మెల్యేలు హాజరవుతారని సమాచారం.

సెన్సెక్స్ ▲ 139 **33136**

నిఫ్టీ ▲ 31 **10155**

బంగారం 30,450 ▲ 50 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో

వెండి 38,000 ▼ 20 ముంబయిలో కిలో రూ.లలో

రూపాయి 65.21 ▼ 01 పైసలు (ఒక అమెరికా డాలరుకు)


ముడి చమురు 69.09 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+) నిఫ్టీ	21న	మార్పు %	గ్రహణం (-) నిఫ్టీ	21న	మార్పు %
BHARTI AIRTEL	418.20	4.45	TATA STEEL	582.25	-1.81
BAJAJ FINANCE	1704.55	2.85	ADANI PORT	363.70	-1.70
NTPC	170.35	2.37	BOSCH	17585.65	-1.63
ULTRATECH CEM	3999.20	1.59	TATA MOTORS	333.85	-1.46
INDIABULLS HSG FIN	1216.40	1.51	ZEE ENTERTAINMENT	566.85	-1.43
BPCL	430.65	1.35	HERO MOTOCORP	3463.60	-1.43
L & T	1309.35	1.23	BHARTI INFRATEL	337.15	-1.39
HDFC BANK	1858.90	1.05	EICHER MOTORS	27980.85	-1.34


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	59.33	68.79	బహ్రెయిన్ దీనార్	160.67	184.12
పౌండ్ స్టెర్లింగ్	83.14	96.41	కువైట్ దీనార్	179.70	223.71
యూరో	72.75	84.37	ఒమన్ రియాల్	157.34	180.00
జపనీస్ యెన్/100	55.73	64.62	సౌదీ రియాల్	15.77	18.69
ఆస్ట్రేలియా డాలరు	45.62	52.78	యూఏఈ దిర్హమ్	16.15	18.87
సింగపూర్ డాలరు	45.00	53.32	మలేషియా రింగిట్	14.80	18.19
థాయ్ బాత్/100	190.04	227.22	చైనీస్ యువాన్	7.29	11.82

బుధవారం నిఫ్టీ కదలికలు



సుజ్లాన్ భారీ పవన టర్బైన్ బ్లేడ్

దేశంలో పొడవైనది

దిల్లీ: దేశంలోనే పొడవైన పవన టర్బైన్ బ్లేడ్‌ను తమ పడుబిద్రి రోటార్ బ్లేడ్ కేంద్రంలో తయారు చేసినట్లు పవన విద్యుత్ సంస్థ సుజ్లాన్ గ్రూప్ ప్రకటించింది. కంపెనీ సొంతంగా డిజైన్ చేసిన ఈ అధునాతన బ్లేడ్ (ఎస్‌బీ 63) పొడవు 63 మీటర్లని, దీని ప్రత్యేకంగా సుజ్లాన్ కొత్త ఎస్128 పవన టర్బైన్‌ల కోసం అభివృద్ధి చేసినట్లు తెలిపింది. ఈ బ్లేడ్ రోటార్ వ్యాసం 128 మీటర్లు కావడం గమనార్హం. ఇక ఎత్తు పరంగా చూస్తే ఇండియా గేట్ కంటే 1.5 రెట్లు పొడవైనదని సుజ్లాన్ వెల్లడించింది. కార్బన్ గిర్డెర్‌తో తయారుచేసిన ఈ బ్లేడ్ తక్కువ గాలితో సైతం అధిక పనితీరు అందిస్తుందని పేర్కొంది. ఎస్128 సిరీస్ టర్బైన్‌లు 33 శాతం ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు.. ఎస్111లతో పోలిస్తే 32 శాతం అధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని కంపెనీ అంచనా వేస్తోంది. ఇంధన వ్యయాన్ని తగ్గించాలన్న మా సంకల్పం దిశగా వెళ్తున్నామని, మా పరిశోధనా, అభివృద్ధి బృందం వైవిధ్యమైన ఉత్పత్తులపై దృష్టి పెట్టిందని సుజ్లాన్ గ్రూప్ సీఈఓ జేపీ చలసాని పేర్కొన్నారు.

ఆరంభ జోరుకు కళ్లెం

- రాణించిన టెలికాం షేర్లు
- సెన్సెక్స్‌కు 139 పాయింట్ల లాభం

సూచీల లాభాలు వరుసగా రెండో రోజూ కొనసాగాయి. టెలికాం, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు దోహదపడింది. అయితే గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్ల లాభాల స్వీకరణతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు దోహదపడ్డాయి. అమెరికా ఫెడ్ సమావేశం నిర్ణయాలు వెలువడనుండటంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,090.82 పాయింట్ల వద్ద దూకుడుగా ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 33,354.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆరంభ లాభాలు కొంత ఆవిరయ్యాయి. చివరకు 139.42 పాయింట్ల లాభంతో 33,136.18 వద్ద స్థిరపడింది. ఇక



నిఫ్టీ సైతం 30.90 పాయింట్లు పెరిగి 10,155.25 దగ్గర ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,132.95- 10,227.30 పాయింట్ల మధ్య కదలాడింది.

చక్కెర షేర్ల జోరు: ఎగుమతులను ప్రోత్సహించడానికి ముడి, శుద్ధి చేసిన చక్కెరపై ఉన్న 20 శాతం ఎగుమతి సుంకాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో చక్కెర కంపెనీల షేర్లు రాణించాయి. బీఎస్ఈలో బలరాంపూర్ చీనీ 8.90%, కేసీపీ షుగర్ 5.28%, గాయత్రీ షుగర్స్ 2.54%, మవానా షుగర్స్ 1.70%, దాల్మియా భారత్ షుగర్ 1.20%, రానా షుగర్స్ 1.02%, ధంపూర్ షుగర్ 0.90%, ద్వారికేశ్ షుగర్ 0.72% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్ 4.61%, ఎన్‌టీపీసీ 2.47%, ఎల్ అండ్ టీ 1.14%, హెచ్‌డీఎఫ్‌సీ 1.05%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, మారుతీ సుజుకీ 0.90%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 0.88%, యాక్సిస్ బ్యాంక్ 0.85%, ఎం అండ్ ఎం 0.80% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ (1.85%), టాటా మోటార్స్ (1.58%), అదానీ పోర్ట్స్ (1.44%), హీరో మోటోకార్ప్ (1.25%), సన్ ఫార్మా (0.82%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 2.36% రాణించింది. స్థిరాస్తి, యంత్ర పరికరాలు, టెక్, విద్యుత్, చమురు- గ్యాస్, మౌలిక, ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. లోహ, ఆరోగ్య సంరక్షణ, వాహన షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

మార్కెట్ కబుర్లు

- తమిళనాడులోని ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నుంచి 2100 బస్సుల సరఫరా నిమిత్తం రూ.321 కోట్ల ఆర్డరును దక్కించుకున్నట్లు హిందుజా గ్రూప్ దిగ్గజ కంపెనీ **అశోక్ లేలాండ్** తెలిపింది.
- గుజరాత్‌లోని కంపెనీకి చెందిన ఫార్ములేషన్ ప్లాంటుకు యూఎస్ఎఫ్‌డీఏ మూడు అభ్యంతరాలను తెలిపినట్లు **అలెంబిక్ ఫార్మా** తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లలో రూ.1567.92 కోట్ల విలువైన రెండు రోడ్డు ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎన్‌హెచ్ఏఐ నుంచి దక్కించుకున్నట్లు **సద్భవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్** వెల్లడించింది.
- వాహనాల సీట్లను తయారీ చేసే అంతర్జాతీయ దిగ్గజం **ఏడియంట్**, **అరవింద్**లు భారత్‌లో వాహనాలకు సంబంధించిన ఫ్యాబ్రిక్‌ను తయారు చేసి, విక్రయించడానికి సంయుక్త సంస్థను ఏర్పాటు చేయనున్నాయి.
- **మైండ్‌ట్రీ**లో ఉన్న 3.34 శాతం వాటా(54,69,750 షేర్లు)కు సంబంధించి తమ ప్రమోటరు వి.జి. సిద్ధార్థ కంపెనీకి అనుగుణంగానే ఓటు వేస్తారని **కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్** తెలిపింది.
- రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన హెచ్ఎల్‌బీ పవర్‌తో సాంకేతిక సహకార ఒప్పందం(టీసీఏ) కుదుర్చుకున్నట్లు **భెల్** పేర్కొంది.
- **సంధార్ టెక్నాలజీస్** పబ్లిక్ ఇష్యూకు బిడ్డింగ్ చివరి రోజైన బుధవారం 6.18 రెట్ల స్పందన లభించింది.
- అనుబంధ సంస్థ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను బలోపేతం చేయడం కోసం రూ.5000 కోట్ల నిధులను సమీకరించడానికి **మాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్** బోర్డు డైరెక్టర్లు అంగీకారం తెలిపారు.

మహిళలు శ్రామిక శక్తిగా ఎదగాలి

- ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఎన్నో అవకాశాలు
- 'సీఐఐ కార్యక్రమం'లో ఐడబ్ల్యూఎన్ ఛైర్ ఉమన్ సుచిత్ర ఎల్లా

ఈనాడు, హైదరాబాద్: మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యూఎన్) ఎప్పటికప్పుడు కృషి చేస్తోందని ఐడబ్ల్యూఎన్ ఛైర్‌ఉమన్, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా అన్నారు. మహిళలందరూ ఒక బృందంగా ఏర్పడి, వారి ఆలోచనలు పంచుకోవడానికి ఇది ఒక వేదిక అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో సీఐఐ అనుబంధ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఐదో వార్షికోత్సవం జరిగింది. మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఐడబ్ల్యూఎన్ మహిళల్లో విద్య, ఆరోగ్య సంరక్షణ, పాలసీల రూపకల్పన తదితర అంశాల్లో కృషి చేస్తోంది. దేశంలోని 14 రాష్ట్రాలు, 1 కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం ఐదు జోన్లుగా విభజించి సేవలను అందిస్తోంది. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఉద్యోగ, వ్యాపారాల్లోనూ రాణిస్తున్నారన్నారు. గతంలో వారికి సరైన మార్గనిర్దేశకత్వం లేదనీ.. కానీ, ఇప్పుడు వారికి అవసరమైన సేవలను అందించేందుకు ఐడబ్ల్యూఎన్ ముందుంటోందన్నారు. పని ప్రదేశంలో మహిళలకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టేలా చూడటం, న్యాయ సేవలను అందించడంతో పాటు, పలు రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో మహిళలకు సంబంధించిన పాలసీలను రూపొందించడంలోనూ ఐడబ్ల్యూఎన్ కీలకంగా మారిందని పేర్కొన్నారు. పని చేసే



ఐడబ్ల్యూఎన్ వార్షిక నివేదికతో వనితా దాట్ల, శోభా దీక్షిత్, సుధాకర్ పాయ్, సుచిత్ర ఎల్లా, బి.సంతానం, కమల్ బాలి, రీనా వివేకానంద

చోట మహిళలు, పురుషులూ సమానమనే భావన ఇంకా పెరగాలన్నారు. మహిళలు పలు కారణాల వల్ల ఉద్యోగాలకు విరామం ఇస్తున్నారనీ, ఇలాంటప్పుడు వారు ఆయా రంగాల నుంచి దూరం కాకుండా, తిరిగి పని చేసేందుకు ప్రోత్సహించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం రాజధాని నగరాల్లోనే కాకుండా.. ద్వితీయ శ్రేణి నగరాల్లోని మహిళా పారిశ్రామికవేత్తలతోనూ కలిసి పనిచేస్తున్నామన్నారు. సీఐఐ వెబినార్ ప్లాట్‌ఫాంను ఉపయోగించుకొని, దేశంలోని పలు ప్రాంతాల్లోని మహిళలతో అనుసంధానం అవుతున్నట్లు తెలిపారు. సైంట్ గోబైన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ బి.సంతానం మాట్లాడుతూ.. దేశంలో ఉన్న మహిళలందరూ శ్రామిక శక్తిగా (వర్క్‌ఫోర్స్) మారితే జీడీపీలో 700 బిలియన్ డాలర్లు పెరుగుతుందని, ఇది 35శాతం అధికమన్నారు. దేశంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే.. దక్షిణాది నుంచి అధిక సంఖ్యలో మహిళా పారిశ్రామికవేత్తలున్నారని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించిన మహిళల్లో 70శాతం వరకూ అటు ఉద్యోగాల్లో చేరడం లేదు.. ఇటు పారిశ్రామిక రంగంలోకి రావడం లేదని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకునేప్పుడే.. నేను ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేయాలా.. లేక పారిశ్రామికవేత్తగా మారాలా అని ఆలోచించుకోవాలని సూచించారు. దేశంలో పెద్ద కంపెనీల్లో కూడా మధ్యస్థాయి యాజమాన్యంలో మహిళా ప్రాతినిధ్యం తక్కువగానే ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. వోల్వో ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి మాట్లాడుతూ.. ఓడిపోతామేమో అనే ఒక తెలియని భయమే పారిశ్రామికవేత్తలుగా మారకుండా అడ్డుకుంటోందని దీన్ని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. కర్లాన్ సీఎండీ టి.సుధాకర్ పాయ్, ఐడబ్ల్యూఎన్ సదరన్ రీజియన్ ఛైర్‌ఉమన్ ఎలికో వైస్ ఛైర్‌పర్సన్ వనితాదాట్ల, ఐడబ్ల్యూఎన్ తెలంగాణ ఛైర్‌ఉమన్ శోభా దీక్షిత్, ఐడబ్ల్యూఎన్ సదరన్ రీజియన్ డిప్యూటీ ఛైర్‌ఉమన్ రీనా వివేకానంద, పలు సంస్థలకు చెందిన ఉన్నతోద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నిర్మాణ రంగం వాహనాలకు పెరుగుతున్న గిరాకీ

- ఏటా 20 శాతం వరకూ వృద్ధి
- వోల్వో ఇండియా ఎండీ కమల్ బాలి

ఈనాడు, హైదరాబాద్: దేశంలో వాణిజ్య, నిర్మాణ రంగం వాహనాలకు గిరాకీ పెరుగుతోందని వోల్వో గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి తెలిపారు. గత రెండేళ్లుగా నిర్మాణ రంగ వాహనాల్లో 20శాతం, వాణిజ్య వాహనాల్లో 8-9శాతం వృద్ధి కనిపిస్తోందన్నారు. బస్సుల విక్రయాల్లోనూ 7-10శాతం వరకూ వృద్ధి రేటు కనిపిస్తోందన్నారు. వోల్వో కూడా ఈ రీతిలోనే అభివృద్ధి చెందుతోందని తెలిపారు. దేశీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో.. ఈ వృద్ధి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. భారత్‌లో ప్రవేశించి 20 ఏళ్లయ్యిందనీ.. ఇప్పటికీ ఇక్కడ దాదాపు రూ.3వేల కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. ప్రతి రెండుమూడేళ్లకోసారి పెట్టుబడులు పెడుతూనే ఉన్నట్లు తెలిపారు. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు, ప్రత్యామ్నాయ ఇంధనాన్ని వినియోగించే వాహనాలను తీసుకొచ్చే ప్రయత్నాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే ముంబయిలో 2 హైబ్రిడ్ బస్సులను ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నామనీ.. రానున్న రోజుల్లో వీటిని పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. అంతర్జాతీయంగా తమ సంస్థ నుంచి 3వేల బస్సులు ఉన్నాయనీ.. అయితే, భారత్‌లో పరిస్థితులు పూర్తిగా అనుకూలించిన తర్వాతే వీటిని విడుదల చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో ఫ్లాట్ గ్లాసు తయారీ కేంద్రం?

- సైంట్ గోబైన్ ఫ్లాట్ గ్లాస్ ఎండీ బి.సంతానం

ఈనాడు, హైదరాబాద్: గాజు తయారీ సంస్థ సైంట్ గోబైన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏదో ఒక చోట ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే ఆలోచనల్లో ఉందని సంస్థ ఫ్లాట్ గ్లాస్ విభాగం ఎండీ బి.సంతానం వెల్లడించారు. అయితే, ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదని పేర్కొన్నారు. దీనికోసం రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దాదాపు 500-600 మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. చెన్నైలో ఉన్న ప్లాంటులో మరో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టబోతున్నట్లు చెప్పారు. నిర్మాణాల సంఖ్య పెరగడం, అందులో గాజు వినియోగం పెరగడంతో ఈ రంగంలో వృద్ధి బాగుంటోందని తెలిపారు. 20 ఏళ్లుగా ఏటా 11శాతం వృద్ధి రేటు ఉందని తెలిపారు. వేడి బయట, వెలుతురు లోపలకు వచ్చే గాజుకు ఇప్పుడు కార్పొరేట్ సంస్థలు ఎక్కువగా వినియోగిస్తున్నాయని తెలిపారు. విదేశాల నుంచి గాజు దిగుమతి అధికమవుతుండటంతో దేశీయంగా ఈ పరిశ్రమకు కొన్ని చిక్కులు వస్తున్నాయని పేర్కొన్నారు.

మిధానీ ఐపీఓకు రేపటి వరకూ గడువు

తొలి రోజు 26% షేర్లకు దరఖాస్తు


ఈనాడు, హైదరాబాద్: రక్షణ, అంతరిక్షం, విద్యుత్ తదితర రంగాల్లో వినియోగించే ప్రత్యేక లోహ మిశ్రమాల తయారీ, అభివృద్ధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మిశ్ర ధాతు నిగమ్ (మిధానీ) పబ్లిక్ ఇష్యూకు తొలి రోజున 26 శాతం స్పందన లభించింది. 4,87,08,400 షేర్లను కేటాయించడానికి కంపెనీ ఇష్యూకు రాగా.. తొలి రోజు 1,25,20,350 షేర్ల కోసం దరఖాస్తులు అందినట్లు ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ద్వారా తెలుస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 11 శాతం షేర్లకు, అర్హులైన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ) విభాగంలో 46 శాతం షేర్లకు దరఖాస్తు చేశారు. ఇష్యూ 23న ముగుస్తుంది. దరఖాస్తుకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ87-90 ధర శ్రేణిని నిర్ణయించారు. ఇష్యూ 23 వరకూ తెరిచి ఉంటుంది.

చౌక గృహాల నిర్మాణంలోకి ఏటీఎస్

హోమ్‌క్రాఫ్ట్ పేరుతో కొత్త సంస్థ

ముంబయి: ఖరీదైన గృహాలను నిర్మించే ఏటీఎస్ గ్రూపు.. అందుబాటు గృహ నిర్మాణ రంగంలో కూడా అడుగుపెట్టింది. ఇందుకుగాను 'హోమ్‌క్రాఫ్ట్' పేరుతో కొత్త సంస్థను ఏర్పాటుచేసింది. దీని ద్వారా వచ్చే 3-5 ఏళ్లలో రూ.4,000-5000 కోట్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓ వైపు ఖరీదైన గృహాలపై దృష్టి సారించడాన్ని కొనసాగిస్తూనే, హోమ్‌క్రాఫ్ట్ ద్వారా ప్రత్యేకంగా మధ్యతరగతి ప్రజల కోసమే గృహాలను అందుబాటులోకి తెస్తామని ఏటీఎస్ తెలిపింది. 'తొలుత దిల్లీ ఎన్ఎస్ఆర్ ప్రాంతంలో రూ.30-70 లక్షల ధరల శ్రేణిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని చేపడతాం. ఆ తర్వాత మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం. రూ.4,000- 5,000 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నామ'ని హోమ్‌క్రాఫ్ట్ సీఈఓ ప్రసూన్ చౌహాన్ తెలిపారు.

21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
22వ తేదీకి		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

ఆర్‌బీఐ సమీక్షా సమావేశాలు ఈ తేదీల్లోనే



ముంబయి: వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాల కాలపట్టికను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లోని సెక్షన్ 45జడ్ఐ (1), (2) ప్రకారం.. రేట్ల నిర్ణయించే ప్యానెల్ ఏడాదిలో కనీసం నాలుగు సార్లు భేటీ కావడం తప్పనిసరి. ఏడాదిలో మొదటి సమావేశం జరగడానికి కనీసం వారం ముందే.. ఏడాది మొత్తం సమావేశాల కాలపట్టికను ప్రకటించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ గత ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేట్లను యథాతథంగా 6 శాతంగానే ఉంచింది. ప్రస్తుతం పరపతి విధాన కమిటీలో ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ పాత్రా, భారత గణక సంస్థ ప్రొఫెసర్ చేతన్ ఘటే, దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ పామీ దువా, ఐఐఎం అహ్మదాబాద్ అధ్యాపకుడు రవీంద్రా హెచ్. ఢోలాకియాలు ఉన్నారు.

సమావేశం	తేదీలు
1	2018 ఏప్రిల్ 4-5
2	జూన్ 5-6
3	జులై 31- ఆగస్టు 1
4	అక్టోబరు 3-4
5	డిసెంబరు 4-5
6	2019 ఫిబ్రవరి 5-6

వడ్డీరేట్లు పెంచిన అమెరికా



తేదీ	పెంపు	వడ్డీ రేట్ల శ్రేణి
2015 డిసెం 17	0.25%	0.25%- 0.5%
2016 డిసెం 15	0.25%	0.5%- 0.75%
2017 మార్చి 15	0.25%	0.75%- 1%
2017 జూన్ 14	0.25%	1%- 1.25%
2017 డిసెం 13	0.25%	1.25%- 1.5%
2018 మార్చి 21	0.25%	1.5%- 1.75%

ఊహించిందే జరిగింది. అమెరికా వడ్డీ రేట్లు మరికాస్త పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందన్న భావన కల్పిస్తూ ప్రామాణిక ఫెడరల్ ఫండ్స్ రేటును అమెరికా ఫెడరల్ రిజర్వ్ పావు శాతం పెంచింది. తాజా పెంపుతో ఫెడరల్ ఫండ్ రేటు 1.5- 1.75 శాతానికి చేరింది. ఈ ఏడాదిలో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచడం ఇదే మొదటిసారి. దేశ వృద్ధిరేటు అంచనాలు పెంచడం ద్వారా మున్ముందు మరిన్ని సార్లు వడ్డీరేట్లు పెంచొచ్చన్న సంకేతాలను ఫెడ్ ఇచ్చింది. ఆర్థిక సంక్షోభం చేసిన గాయంతో 2008లో వడ్డీ రేట్లను అమెరికా ఫెడ్ సున్నా స్థాయికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. మళ్లీ ఏడేళ్ల తర్వాత 2015 డిసెంబరులో వడ్డీ రేట్లను పావు శాతం పెంచింది. అనంతరం 2016లో ఒకసారి, 2017లో మూడు సార్లు పావు శాతం చొప్పున పెంచుకుంటూ వచ్చింది. ఈ ఐదు సందర్భాల్లోనూ జానెట్ యెలెన్ ఫెడ్‌కు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె పదవీకాలం ముగియడంతో కొత్తగా ఫెడ్ ఛైర్మన్ బాధ్యతలు చేపట్టిన జెరోమ్ పావెల్ నేతృత్వంలో తాజా వడ్డీ రేట్ల పెంపు నిర్ణయం వెలువడింది. సున్నా స్థాయి నుంచి అమెరికా వడ్డీ రేట్లు ఎలా పెరిగాయో ఆ వివరాలు పట్టికలో..

డోజోన్స్ 24963 ▲ 236

నాస్‌డాక్ 7406 ▲ 42

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.30కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 12:00 గంటలకు).

బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనడమే దేశంలో ఎక్కువ. డబ్బులున్న వారు నాణేలు, బిస్కెట్ల రూపంలో మేలిమి బంగారాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు. దాచుకునేందుకు నగదు రూపేణ కంటే తక్కువ స్థలం సరిపోవడం, ధర పెరిగినపుడు విక్రయించుకుని లాభపడటం ఇందుకు కారణం. డిజిటల్ రూపంలో అయితే రూపాయి మొదలుకుని, ఎంత డబ్బు ఉంటే, అంతమేర పసిడి కొనుగోలు చేసుకునే వీలు కూడా ఏర్పడటంతో, ఈ విభాగం కూడా క్రమేణ వృద్ధి చెందుతోంది.





స్మార్ట్‌గా పసిడి కొనుగోళ్లు!

● తక్కువ మొత్తాలకు 'డిజిటల్ గోల్డ్' సానుకూలం ● రూపాయి నుంచీ కూడబెట్టుకోవచ్చు
● మజూరు ఛార్జీలు చెల్లించాకే పసిడి పొందొచ్చు ● సామాన్యులు, యువతపై కంపెనీల ఆశలు

ఈనాడు వాణిజ్య విభాగం

నిత్య జీవితంలో 4జీ ఇంటర్నెట్ అనూహ్య మార్పులు తెస్తోంది. బ్యాంకింగ్ సేవలు, బిల్లుల చెల్లింపు, వాలెట్ల వినియోగం, బస్-రైలు-సినిమా-విమాన టికెట్ల కొనుగోళ్లు, నిత్యావసరాలకు ఆర్డర్లు, సన్నిహితుల ఖాతాలకు నగదు బదిలీ.. అన్నీ మొబైల్‌పై చేసుకోవడం అలవాటైంది. దేశీయులకు ఎంతో ఇష్టమైన బంగారాన్నీ ఆన్‌లైన్‌లో, అదీ రూపాయి నుంచీ మొదలు పెట్టుకుని, తాము అనుకున్న వరకు కూడబెట్టుకుని, అనంతరం పొందే వీలు ఏర్పడటం యువతను ఆకట్టుకుంటోంది. పెద్దనోట్ల రద్దు తరవాత, స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల్లో అత్యధికులు పేటీఎం వాలెట్ కూడా వినియోగిస్తున్నందున, డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు అవకాశమేర్పడుతోంది. దేశీయంగా రూ.2.20 లక్షల కోట్ల స్థాయిలోని పసిడి విపణిలో డిజిటల్ గోల్డ్ వాటా ఇప్పుడు అత్యంత స్వల్పంగా ఉన్నా, ఈ పద్ధతిలోని సానుకూలతల వల్ల భారీగా పెరుగుతుందని సంస్థలు అంచనా వేస్తున్నాయి.

ఆన్‌లైన్ కొనుగోళ్లు ఎందుకు ఆకర్షిస్తున్నాయంటే..: బంగారం కొనుగోళ్లకు నగదునే ఎక్కువగా వినియోగిస్తుంటారు. కానీ నగదు లభ్యత తగ్గడం వల్ల, ఆన్‌లైన్, కార్డ్ చెల్లింపులు పెరిగాయి. ఇందువల్ల ఈ రంగంలో పారదర్శకత వస్తోంది. ఆన్‌లైన్‌లో బంగారు నాణేలు, ఆభరణాల కొనుగోళ్లు కూడా జరుగుతున్నాయి. ఈ పద్ధతిలో కనీసం 1 గ్రాము (రూ.3,000కు పైగా) కొనుగోలు చేయాల్సి వస్తుంది.

- ✦ దీనికి అదనంగా రూపాయి నుంచీ అతి స్వల్పమొత్తాల్లో మేలిమి (999.9 స్వచ్ఛత) బంగారం కొనుగోలు చేసుకునే వీలును ప్రభుత్వరంగ ఎంఎంటీసీ-పాంప్ ఇండియా లిమిటెడ్ (స్విట్జర్లాండ్ పసిడి రిఫైనరీ పాంప్ అనుబంధం) సంయుక్త సంస్థ కల్పిస్తోంది. డిజిటల్ గోల్డ్‌గా వ్యవహరించే ఈ పథకాన్ని పేటీఎం ప్లాట్‌ఫామ్ ద్వారా అందిస్తోంది. డబ్బులున్నపుడల్లా ఆ విలువకు సరిపడా జతచేసుకుంటూ డిజిటల్ పద్ధతిలోనే నిల్వ చేసుకుని, తాము అనుకున్న మొత్తం సమకూరాక, డెలివరీ తీసుకునే వీలును, అవసరమైతే ఆన్‌లైన్‌లోనే విక్రయించుకునేందుకు, లేదా పూర్తి బీమాతో ఖాతాదారుకు ప్రత్యేకించిన ఖజానా (వాల్ట్)లో నిల్వ చేసుకునే అవకాశాన్నీ కల్పిస్తోంది.
- ✦ అనేక నగల దుకాణాలు వాయిదాల పద్ధతిలో నగదు జమచేసుకుని, ఏడాది గడిచాక, ఆభరణం తీసుకునే సదుపాయం తరహాలోనే కదా అనిపించవచ్చు. తేడా ఏంటంటే. . ఇది ఇంకా చిన్న మొత్తాల్లో బంగారం కొనుగోళ్లకు ఉపయోగ పడటం, ప్రభుత్వరంగ, స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ ప్రతిష్ఠ కలిగిన అతిపెద్ద సంస్థ నేతృత్వంలో, అత్యంత నాణ్యమైన పసిడిని, అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కొనుగోలు చేసుకోగలగడమే.
- ✦ డిజిటల్ గోల్డ్‌ను రోజులో ఏ సమయంలో అయినా, ఎక్కడనుంచైనా, పేటీఎంకు ఆన్‌లైన్‌లో చెల్లించడం లేదా వాలెట్‌లోని నిల్వతో కొనుగోలు చేసుకోవచ్చు. డెలివరీ తీసుకోవాలంటే, కనీసం 1 గ్రాము బరువుకు సరిపడా చెల్లింపులు జరిపాకే వీలవుతుంది. ఇందుకు తయారీ ఛార్జీ కూడా విధిస్తారు.
- ✦ మన ఖాతాలో ఎంత బంగారం కూడబెట్టుకున్నామో, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పరిశీలించుకుంటూ ఉండొచ్చు.

సామాన్యులకు వీలు

బంగారం కొనేందుకు అప్పు చేయకుండా, తమ దగ్గర ఉన్న చిన్న మొత్తాలను జతచేసుకుంటూ వెళ్లడం అనేది సామాన్యులకు అధికంగా ఉపకరిస్తుందని, ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. రాబోయే 1-2 ఏళ్లలో ఈ విధానంలో కొనుగోళ్లు అధికంగా జరుగుతాయనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తోంది.

ధరే కీలకం

దేశీయంగా పసిడిని ఆభరణాలు, లోహ రూపంలో కొనుగోలు చేయడం ఎంత ఎక్కువో, ధరను అత్యంత జాగ్రత్తగా పరిశీలించడమూ అధికమే. వాస్తవానికి అంతర్జాతీయ విపణి, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువకనుగుణంగా పసిడి ధర ఉంటోంది. కానీ పండగలు, సుముహూర్తాలు అధికంగా ఉన్నపుడు కృత్రిమ పద్ధతుల్లో దేశీయంగా బంగారం ధర పెరిగిపోతున్నందున, ఇతర సమయాల్లో కొనుగోలు చేసే వారి సంఖ్యా అధికమే. 40 శాతం కొనుగోళ్లు ఇలానే జరుగుతున్నాయని అంచనా. ధర తగ్గిందని తెలుసుకున్నపుడు, వెంటనే తమ దగ్గర నగదు ఉన్నమేర బంగారాన్ని డిజిటల్ పద్ధతిలో కొనుగోలు చేయడం అనేది కొనుగోలుదార్లను ఆకర్షించే అంశం. ధర అనుక్షణం మారుతుంటుంది.

దేశీయ కొనుగోళ్లు ఇలా

- ✦ 2017లో దేశీయంగా పసిడికి గిరాకీ 727 టన్నులు.
- ✦ 2018లో ఈ మొత్తం 800 టన్నులకు పెరుగుతుందని అంచనా.
- ✦ 2017లో చైనాలో పసిడికి గిరాకీ.. 953 టన్నులు
- ✦ 2017 ఏప్రిల్ నుంచి తొలి 6 నెలల్లో పేటీఎం ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు.. 18.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.120 కోట్లు)
- ✦ 2017కు పేటీఎం వినియోగదార్లలో పసిడి కొన్నవారు.. 14 లక్షల మంది
- ✦ డిజిటల్ గోల్డ్ కొనుగోలుదార్లలో 35 ఏళ్ల కంటే తక్కువవారు..70 శాతం
- ✦ 2015తో పోలిస్తే 2020 కల్లా పసిడి వినియోగంలో వృద్ధి.. 35 శాతం (అంచనా).

భారత్ ఉక్కు అచ్చులపై అమెరికా దిగుమతి సుంకం

వాషింగ్టన్: భారత్, చైనాల నుంచి దిగుమతి అయ్యే ఉక్కు అచ్చులపై దిగుమతి నిరోధక సుంకం విధించాలని అమెరికా నిర్ణయించింది. ఎగుమతిదార్లకు ఇరు దేశాలు సబ్సిడీలు అందజేస్తున్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చింది. చైనా, భారత్‌లు అమెరికాలో స్టెయిన్‌లెస్ ఉక్కు అచ్చులను వరుసగా 257.11%; 18.1-145.25 శాతం అధికంగా విక్రయిస్తున్నాయని.. ఇది వాస్తవిక విలువ కంటే ఎక్కువని అమెరికా వాణిజ్య శాఖ గుర్తించినట్లు మంగళవారం ఒక అధికారిక ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలోనే ఆ తర్వాతి రోజైన బుధవారం తాజా నిర్ణయం వెలువడింది.

బయోమెట్రిక్ పద్ధతిలో ప్రయాణికుల వివరాల పరిశీలన!

విమానాశ్రయాల్లో ఏర్పాటుకు కసరత్తు

దిల్లీ: హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, చెన్నై, దిల్లీ లాంటి రద్దీ విమానాశ్రయాల్లో ఇమిగ్రేషన్ కౌంటర్ల వద్ద పెద్ద వరుసలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ప్రయాణికులను లోనికి అనుమతినిచ్చే నిమిత్తం విమానాశ్రయం ప్రవేశ ద్వారం వద్దే బయోమెట్రిక్ ఆధారిత వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఇమిగ్రేషన్ కౌంటర్ల వద్ద కూడా ఇదే తరహా ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకునేందుకు సంబంధిత వాటాదార్ల అభిప్రాయాన్ని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) కోరనుంది. ఈ ప్రతిపాదన వాస్తవ రూపం దాలిస్తే ప్రయాణికులకు వరుసల్లో అధిక సమయం నిరీక్షించే సమయం తగ్గుతుంది. అంతర్జాతీయ ప్రయాణికులను పాస్‌పోర్ట్ ద్వారా, దేశీయ ప్రయాణికులను ఆధార్ కార్డు ద్వారా గుర్తించేలా ఈ బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రవేశ ద్వారం వద్దే ప్రయాణికుడు పేరు, ముఖం గుర్తించేందుకు యూఐడీఏఐ ఏజెంట్లను విమానాశ్రయం నిర్వాహకులు ఉంచుతారని హైదరాబాద్ విమానాశ్రయానికి చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

వినియోగదారు వద్దకే డీజిల్

పుణెలో ఐఓసీ ప్రయోగాత్మక సేవలు

దిల్లీ: వినియోగదారు వద్దకే డీజిల్ సరఫరాను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ప్రారంభించింది. ప్రయోగాత్మక సేవల కింద తొలుత పుణెలో దీనిని ప్రారంభించింది. ఇక్కడ ఏవిధమైన ఆదరణ లభిస్తుందో మూడు నెలల పాటు పరిశీలించి, ఆ తర్వాత దేశంలోని మిగతా నగరాలకు విస్తరిస్తామని ఐఓసీ ఛైర్మన్ సంజీవ్ సింగ్ తెలిపారు. అదే విధంగా పెట్రోలుకు కూడా ఈ తరహా సేవలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. 'వినియోగదారు వద్దకే డీజిల్ సరఫరాను ప్రారంభించిన మొట్టమొదటి సంస్థ మాదే. పెట్రోలియమ్ అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పెసో) నుంచి అనుమతులు లభించిన అనంతరం ఈ సేవలను ప్రారంభించామ'ని ఆయన చెప్పారు.

సరఫరా ఎలా: బంకుల్లో ఉండే పెట్రోలు/ డీజిల్ పంపు (డిస్పెన్సర్) లాంటి ఒకదానిని మధ్య సైజు ట్రక్‌లో ఉంచుతారు. ఇంధనం నిల్వ చేసే ఒక ట్యాంకును కూడా దానికి అనుసంధానిస్తారు. ఇలా వినియోగదారు వద్దకే ట్రక్కును తీసుకొని పోయి డీజిల్‌ను సరఫరా చేస్తారు.

తొలుత వీరికే: విద్యుదుత్పత్తి కోసం జనరేటర్లు ఎక్కువగా వినియోగించే షాపింగ్ మాళ్లు, వాణిజ్య సముదాయాలకు, అధికంగా ఇంధనాన్ని వినియోగించే రవాణా సంస్థలకు తొలుత ఈ తరహా సేవలను ఐఓసీ అందుబాటులోకి తేనుంది. ఐఓసీ మాదిరి హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లు కూడా త్వరలోనే వినియోగదారు వద్దకే ఇంధన సరఫరా సేవలను ప్రారంభించే అవకాశం ఉంది.



కొత్తగా ప్రవేశపెట్టిన హైడ్రోకార్బన్ల అన్వేషణ, లైసెన్సింగ్ విధాన వివరాలను వెల్లడిస్తున్న డీజీహెచ్ డైరెక్టర్ జనరల్ అతను చక్రవర్తి, పెట్రోలియం, సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి అమర్‌నాథ్

చమురు క్షేత్రాల్లో పెట్టుబడులు పెట్టండి

కొత్త కంపెనీలకు డీజీహెచ్ ఆహ్వానం

● 60% పెరగనున్న అన్వేషణ ప్రాంతం ● జనవరి నుంచి అమలులోకి వచ్చిన హెచ్‌ఈఎల్‌పీ

ఈనాడు - హైదరాబాద్

చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి రంగంలో ప్రవేశించడానికి కొత్త కంపెనీలకు అవకాశం కల్పించాలని, చిన్న కంపెనీలను ప్రోత్సహించి ఈ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని డైరెక్టరేట్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) డైరెక్టర్ జనరల్ అతాను చక్రవర్తి తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం చమురు అవసరాల్లో 70 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్నామని.. 2020 నాటికి చమురు దిగుమతుల్లో 10 శాతం తగ్గించాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్ణయించారని చక్రవర్తి వివరించారు. ఇందుకు అనుగుణంగా కొత్తగా హైడ్రోకార్బన్ల అన్వేషణ, లైసెన్సింగ్ విధానాన్ని (హెచ్ఈఎల్‌పీ) ప్రవేశపెట్టారని (2018, జనవరి) తెలిపారు. ఈ విధానంలో భాగంగా చమురు అన్వేషణకు ఓపెన్ ఎంకరేజీ లైసెన్సింగ్ ప్రోగ్రామ్ (ఓఏఎల్‌పీ) కింద తొలి విడత క్షేత్రాల కేటాయింపునకు బిడ్లను ఆహ్వానించే ప్రక్రియ ప్రారంభమైంది. బిడ్ల సమర్పణకు ఏప్రిల్ 3 చివరి తేదీ. చమురు అన్వేషణ, ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు ప్రచారం (రోడ్‌షో) కల్పించే కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్ జనరల్ హైదరాబాద్ విచ్చేశారు. చమురు, గ్యాస్ అన్వేషణ రంగంలో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి కృషి చేస్తున్నామని, ఆకర్షణీయ ప్రతిఫలాలను అందించే రంగంగా తీర్చిదిద్దుతున్నామని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి అమర్‌నాథ్ తెలిపారు. ఆదాయాన్ని పంచుకునే విధానంలో ఓఏఎల్‌పీ అమలు చేస్తున్నామన్నారు. మార్కెటింగ్, ధరల్లో స్వేచ్ఛ, నగదుపరమైన ప్రోత్సాహకాలు, అన్ని రకాల హైడ్రోకర్బన్లకు ఒకే లైసెన్స్ మొదలైనవి ఓఏఎల్‌పీ ప్రత్యేకతలు.

55 క్షేత్రాలకు బిడ్లు ఆహ్వానం..

ఓఏఎల్‌పీ కింద పదకొండు రాష్ట్రాల్లోని 55 క్షేత్రాలను అన్వేషణకు కేటాయించడానికి బిడ్లను ఆహ్వానించారు. వీటిలో అయిదు క్షేత్రాలు కృష్ణా, గోదావరి బేసిన్‌కు చెందినవి ఉన్నాయి. 55 క్షేత్రాల మొత్తం విస్తీర్ణం 59,282 చదరపు కిలోమీటర్లని చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం 1.02 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో అన్వేషణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. 55 క్షేత్రాల కేటాయింపు పూర్తయితే.. అన్వేషణ విస్తీర్ణం ఏకంగా 60 శాతం పెరుగుతుంది. బిడ్ల దాఖలుకు కంపెనీల నుంచి మంచి స్పందన లభిస్తోందని, బిడ్లను దాఖలు చేసే ఉద్దేశంతో దాదాపు 120 కంపెనీలు నేషనల్ డేటా రిపాజిటరీలో డేటాను పరిశీలించాయని వివరించారు. ఇప్పటి వరకూ ఎన్ని కంపెనీలు బిడ్లను దాఖలు చేసింది వెల్లడించలేదు.

డీఎస్ఎఫ్ రెండో విడతకు సన్నాహాలు..: చమురు రంగంలో పెట్టుబడులకు చిన్న కంపెనీలను ప్రోత్సహించడానికి ఇప్పటికే చమురు, చమురుకు సమానమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు గుర్తించిన చిన్న క్షేత్రాల్లో ఉత్పత్తికి పెట్టుబడులు పెట్టడానికి డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ (డీఎస్ఎఫ్) విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డీఎస్ఎఫ్ మొదటి విడత కింద చమురు, గ్యాస్ ఉత్పత్తికి 23 కంపెనీలతో 30 కాంట్రాక్టులు కుదిరాయని, 23 కంపెనీల్లో 13 కంపెనీలు కొత్తవేనని చక్రవర్తి వివరించారు. డీఎస్ఎఫ్ రెండో విడత కింద చమురు నిల్వలు ఉన్న 60 ప్రాంతాలను కేటాయించడానికి డీజీహెచ్ బిడ్లను ఆహ్వానించనుంది. ఈ ప్రక్రియ ఏప్రిల్‌లో ప్రారంభమై నవంబరు నాటికి ముగుస్తుందన్నారు. ఈ ప్రాంతాల్లో 19.47 కోట్ల టన్నుల చమురు, చమురుకు సమానమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. 2016లో డీఎస్ఎఫ్ మొదటి విడత కింద కేటాయించిన ప్రాంతాల్లో చమురు ఉత్పత్తి 2020 నాటికి ప్రారంభం కాగలదన్నారు. డీఎస్ఎఫ్ మొదటి విడతలో కేటాయించిన ప్రాంతాల ద్వారా ప్రభుత్వానికి మొత్తం రూ.14,300 కోట్ల ఆదాయం లభించే వీలుందన్నారు. 11-12 కోట్ల టన్నుల ముడి చమురుకు దేశంలో గిరాకీ ఉంటే.. కేవలం 3.7 కోట్ల టన్నులే ఉత్పత్తి అవుతోంది.

కేజీ బేసిన్‌లో అపార నిల్వలు..

కృష్ణా, గోదావరి బేసిన్‌లో దాదాపు 9.5 బిలియన్ టన్నుల చమురు, చమురుకు సమానమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయని డీజీహెచ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు. ఇంకా 7.5 బిలియన్ టన్నుల నిల్వలు ఎక్కడ ఉన్నాయో కనుక్కోవాల్సి ఉందన్నారు. ప్రధాన ఆపరేటరు 2021-23 నాటికి రోజుకు గరిష్ఠంగా 25-30 మిలియన్ మెట్రిక్ క్యూబిల గ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. ఓఎన్‌జీసీ ఉత్పత్తి 15-18 మిలియన్ మెట్రిక్ క్యూబ్‌లు ఉండగలదని వివరించారు. ఈ రెండింటి గ్యాస్ ఉత్పత్తే రోజుకు 40 మిలియన్ మెట్రిక్ క్యూబ్‌లను మించుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో రోజుకు 80 మిలియన్ మెట్రిక్ క్యూబిల గ్యాస్ మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. ఇటువంటి కీలకమైన బేసిన్లను కనుగొనాల్సి ఉందన్నారు.

విద్యుత్ వాహనాలకు అనుమతి నిబంధనలు వద్దు

నీతిఆయోగ్, సీఐఐ నివేదిక

దిల్లీ: విద్యుత్ వాహనాలకు అనుమతుల నిబంధనలను తొలగించాలని నీతి ఆయోగ్ సూచించింది. పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని ఈ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఏటా అనుమతులను పునరుద్ధరించుకోవడం వ్యయంతో కూడిన పనే కాకుండా, సమయం కూడా వృథా అవుతుందని సీఐఐతో కలిసి రూపొందించిన టాస్క్ ఫోర్స్ నివేదికలో నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. 'ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఉన్న అనుమతుల విధానంలో మార్పులు రావాల్సి ఉంది. భద్రతాపరమైన అంశాలపై చర్చ జరపాల్సిన అవసరం ఉంది. తద్వారా విజయానికి అవరోధాలు తొలుగుతాయ'ని అందులో పేర్కొంది. అలాగే అంతరాష్ట్ర ఎలక్ట్రిక్ బస్సులపై దీర్ఘకాలిక దృష్టితో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపింది. విద్యుత్ వాహన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ద్విచక్ర, త్రిచక్ర వాహన విభాగంలో అధిక అవకాశాలున్నాయని నివేదిక గుర్తించింది. అందువల్ల ఆ దిశగా దృష్టి సారించాలని సూచించింది.

ఎస్సార్ స్టీల్ వేలంలో యార్సెలర్ బిడ్ తిరస్కరణ

ముంబయి: బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు రూ.45,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్న ఎస్సార్ స్టీల్ కంపెనీ వేలం ప్రక్రియ మరింత ఆలస్యం అవ్వనుంది. ఎస్సార్ స్టీల్ కోసం నుమెటల్ (రష్యాకు చెందిన వీటీబీ బ్యాంక్, రేవంత్ రుయాలు నెలకొల్పిన ప్రత్యేకసంస్థ), యార్సెలర్ మిత్తల్ దాఖలు చేసిన బిడ్లను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని బ్యాంకర్ల బృందం (కన్సార్షియం) తిరస్కరించడమే ఇందుకు కారణం. దివాలా స్మృతి (ఐబీసీ) నిబంధనల ప్రకారం ఎస్సార్ కోసం బిడ్లు వేసేందుకు, ఆ సంస్థతో అనుబంధం కలిగిన వాటికి అర్హత ఉండదని, దీనికి అనుగుణంగా బిడ్లు తిరస్కరించాలని బుధవారం ఇక్కడ జరిగిన రుణదాతల సమావేశం (సీఓసీ)లో నిర్ణయించారు. ఈ రెండు సంస్థలు మాత్రమే ఎస్సార్ కోసం ఫిబ్రవరి 12న బిడ్లు దాఖలు చేయడం గమనార్హం.

ప్రపంచంలో 22.. ఆసియాలో.. 8

● పర్యాటకులు మెచ్చిన గమ్యస్థానాల్లో దిల్లీ స్థానం
● ట్రిప్ అడ్వయిజర్ అవార్డుల జాబితా

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు మెచ్చిన గమ్యస్థానాల్లో దిల్లీకి 22వ స్థానం లభించింది. ఆసియాలో చూసుకుంటే 8వ ర్యాంకు పొందింది. నోరూరించే ఆహార పదార్థాలు, మొఘల్ సామ్రాజ్య చారిత్రక సంపద, సాంస్కృతిక కట్టడాల ద్వారా దేశ, విదేశ పర్యాటకులను దిల్లీ ఆకర్షిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత సంవత్సరానికి పర్యాటకులు మెచ్చిన గమ్యస్థానాల అవార్డుల కోసం ప్రపంచవ్యాప్తంగా 25 నగరాలను ట్రిప్ అడ్వయిజర్ ఎంపిక చేసింది. ఈ జాబితాలో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌కు అగ్రస్థానం లభించింది. లండన్ (బ్రిటన్), రోమ్ (ఇటలీ), బాలీ (ఇండోనేషియా), క్రెటె (గ్రీస్)లు తొలి ఐదు నగరాల్లో ఉన్నాయి. అవార్డుల ఎంపిక నిమిత్తంహోటళ్లు, రెస్టారెంట్లపై సమీక్ష, రేటింగ్‌లు, 12 నెలల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఆ ప్రాంతం ఆకర్షించిన తీరు, పర్యాటకుల బుకింగ్ వివరాలు తదితరాలను ట్రిప్ అడ్వయిజర్ పరిగణనలోకి తీసుకుంది. ఆసియా జాబితాలో దిల్లీతో పాటు, గోవా (9వ స్థానం), జైపూర్ (16వ స్థానం)లకు చోటు దక్కింది. ఆసియాలో అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా బాలీకి అగ్రస్థానం లభించింది.

ఛాంపియన్స్



కెప్టెన్లు లేకుండానే ఆరంభోత్సవం

దిల్లీ: చెన్నై, ముంబయి ఇండియన్స్ కెప్టెన్లు మినహా ఐపీఎల్ ఫ్రాంఛైజీల కెప్టెన్లెవరూ ఏప్రిల్ 7న జరిగే ఆరంభోత్సవానికి హాజరు కాబోవట్లేదు. ఏర్పాట్లలో లోపాల కారణంగా.. ఆరంభ కార్యక్రమంలో వాళ్లిక పాల్గొనాల్సిన అవసరం లేదని బీసీసీఐ నిర్ణయించింది. ఎనిమిది జట్ల కెప్టెన్లు ఏప్రిల్ 6న వీడియో షూట్లో పాల్గొని తమ తమ నగరాలకు వెళ్లిపోతారని సమాచారం. తొలి మ్యాచ్ ముందు రోజు జరిగే ఆరంభోత్సవానికి సారథులంతా హాజరు కావడం నిరుటి వరకు ఓ ఆనవాయితీగా వచ్చింది. ఐతే ఈ ఏడాది మాత్రం ముంబయిలో ఏప్రిల్ 7న (ముంబయి × చెన్నై) తొలి మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవాన్ని నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఐతే ఐపీఎల్ అధికారులు ఇక్కడే తప్పులో కాలేశారు. ప్రణాళిక లోపం స్పష్టం. తర్వాతి రోజే మ్యాచ్‌లున్న నాలుగు ఫ్రాంఛైజీల కెప్టెన్లు ఆరంభోత్సవానికి ఎలా హాజరవుతారన్న విషయం మరిచిపోయారు. ఏప్రిల్ 8న రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. మొహాలిలో దిల్లీ × పంజాబ్ మ్యాచ్ సాయంత్రం 4 గంటలకు, కోల్‌కతాలో బెంగళూరు × నైట్ రైడర్స్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ఆరంభం కానున్నాయి. "ఐపీఎల్ అధికారులు సరైన వ్యూహరచన చేయలేదు. తెల్లవారే మ్యాచ్ ఆడాల్సి ఉన్న గంభీర్, అశ్విన్ ఆరంభ కార్యక్రమానికి వచ్చి వెళ్లడానికి చాలా శ్రమించాల్సివుంటుంది? వాళ్లు సరైన కసరత్తు చేయలేదు" అని ఓ బీసీసీఐ అధికారి అన్నాడు. "ఉదాహరణకు అశ్విన్, గంభీర్‌ల విషయాన్నే తీసుకుందాం. వాళ్లు ఆరంభ కార్యక్రమానికి హాజరైతే రాత్రి 9 గంటలకు ముంబయి-దిల్లీ విమానాన్ని మాత్రమే అందుకోగలరు. ఆ సమయంలో చండీగఢ్‌కు విమానాలు ఉండవు. దిల్లీకి వెళ్లాక ఆదివారం ఉదయం చండీగఢ్‌కు విమానం దొరకదు. ఎందుకంటే విమానాశ్రయం మూసి ఉంటుంది. అంటే వాళ్లు రాత్రిపూట లేదా మ్యాచ్ రోజు ఉదయం కారులో ప్రయాణించాలి. రాత్రిపూట ప్రయాణం ప్రమాదకరం. షెడ్యూలు విషయంలో ఐపీఎల్ అధికారుల కసరత్తు గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది" అని బీసీసీఐ అధికారి చెప్పాడు.

ఐపీఎల్లో డీఆర్ఎస్



ముంబయి: ఈ ఐపీఎల్‌లో నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్ఎస్)ని వినియోగించనున్నట్లు ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా బుధవారం తెలిపాడు. ఐపీఎల్లో డీఆర్ఎస్ ప్రవేశపెట్టాలనే ఆలోచన కొన్నేళ్లుగా ఉందని అన్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్లో ఒక జట్టుకు ఒకసారి సమీక్షను ఉపయోగించుకునే వీలుంది. బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం విచారణ పూర్తయ్యాక షమిపై నిర్ణయం తీసుకుంటామని రాజీవ్ శుక్లా అన్నాడు. అతడి ప్రైవేటు జీవితం గురించి తమకు అనవసరమని చెప్పాడు. "నీరజ్ కుమార్ నేతృత్వంలోని మా అవినీతి నిరోధక విభాగం షమిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతోంది. నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం. అతడి వ్యక్తిగత జీవితం గురించి మాకు అనవసరం. నీరజ్ కుమార్ నివేదిక అందగానే షమిపై నిర్ణయం తీసుకుంటాం" అని శుక్లా చెప్పాడు.

అప్పుడు ధోనీని వద్దన్నా..







ముంబయి: ముక్కోణపు సిరీస్ ఫైనల్లో అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్‌ గెలిపించిన దినేశ్ కార్తీక్‌ను ధోని స్థానంలో వన్డే, టీ20ల్లో జట్టులోకి తీసుకోవాలన్న డిమాండ్ల నేపథ్యంలో మాజీ సెలక్టర్ సందీప్ పాటిల్ స్పందించాడు. కార్తీక్ ఓ మంచి ప్రత్యామ్నాయమే అయినా.. ఇప్పటికీ ధోనీనే తొలి ప్రాధాన్య వికెట్‌కీపరని అభిప్రాయపడ్డాడు. ఐతే 2004లో ఈ ఇద్దరిలో ఒక్కరినే ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు తాను కార్తీక్‌వైపే మొగ్గుచూపానని చెప్పాడు. పాటిల్ అప్పుడు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత్-ఏ జట్టుకు కోచ్. ఓ రోజు ప్రధాన సెలక్టర్ సయ్యద్ కిర్మాణి అతడికి ఫోన్ చేశాడు. గాయపడ్డ పార్థివ్ పటేల్ స్థానంలో ఛాంపియన్స్ ట్రోఫీకి ధోని లేదా కార్తీక్ పేరును సూచించాలని అడిగాడు. అప్పుడు 'ఏ' జట్టులో ధోని తొలి ప్రాధాన్య వికెట్‌కీపర్ కాదు. తుది ఎలెవన్‌లో లేడు. దీంతో ఆ పర్యటనలో, అంతకుముందు సొంతగడ్డపై కార్తీక్ సొగసైన ఆట చూసిన సందీప్ పాటిల్.. ఎవరిని సూచించాలనే విషయంలో స్పష్టతతో ఉన్నాడు. "ఆ సాయంత్రం హరారెలో దినేశ్‌ను నేను హోటల్ గదికి పిలిచా. సెలక్టర్ల నుంచి నాకు ఫోన్ వచ్చిందని, నీ పేరును సూచించానని చెప్పాను. ఆ తర్వాత ధోనీని కూడా పిలిచా. తన పేరును కాకుండా కార్తీక్ పేరును ఎందుకు సూచించాల్సి వచ్చిందో వివరించా. ఏదో ఒక రోజు నీకు కూడా అవకాశమొస్తుందని అన్నాను. కార్తీక్ సెంచరీ కొట్టాడు. వికెట్ కీపింగ్ కూడా చేస్తున్నాడు. కానీ ధోని మ్యాచ్‌లు ఆడలేదు. దినేశ్ వెళ్లాక ధోని వెలుగులోకి వచ్చాడు. ఆ తర్వాత మేం కెన్యా వెళ్లాం. అక్కడ అతడు చెలరేగిపోయాడు" అని ప్రధాన సెలక్టర్‌గా కూడా పని చేసిన పాటిల్ అన్నాడు. అప్పుడు వన్డేల్లో అరంగేట్రం చేసిన కార్తీక్ స్థానంలో ఏడాది తర్వాత ధోని భారత జట్టులోకి వచ్చాడు. "అప్పుడు కార్తీక్ భిన్నమైన ఆటగాడు. భారత జట్టులో చోటు దొరకగానే.. స్ట్రెయిట్‌గా ఆడాలని చాలా మంది ఆటగాళ్లు భావిస్తుంటారు. తమ శైలి మరిచిపోతారు. కార్తీక్ విషయంలోనూ అదే జరిగింది. కార్తీక్ తనదైన ఆటను తగ్గించుకున్నాడు. ఆ తర్వాత వ్యక్తిగత సమస్యలు కూడా అతణ్ని ఇబ్బంది పెట్టాయి" అని సందీప్ పాటిల్ చెప్పాడు. "షాట్ ఆడితే ఔటైపోతామేమో అని యువ ఆటగాళ్లు భయపడుతుంటారు. రంజీ ట్రోఫీ, భారత్ 'ఏ' జట్టుకు ఆడేటప్పుడు కార్తీక్‌లో ఆ భయం లేదు. అందుకే జింబాబ్వే పర్యటనలో అద్భుత శతకం సాధించాడు. నన్నెంతో ఆకట్టుకున్నాడు" అని వివరించాడు. ఐతే ప్రస్తుత పరిస్థితుల్లో ధోనీనే తొలి ప్రాధాన్య వికెట్‌కీపరని అతడు అభిప్రాయపడ్డాడు.

కామన్వెల్త్‌కా విహారానికా..!

Gold Coast 2018
XXI Commonwealth Games

- అథ్లెట్లతో కుటుంబ సభ్యులు ఎందుకు?
- అధికారుల సంఖ్యనూ సమీక్షిస్తాం
- క్రీడల మంత్రిత్వ శాఖ



రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్

దిల్లీ

కామన్వెల్త్ క్రీడలు ఏదో సరదా కోసం వెళ్లే ఆటలు కాదని.. అథ్లెట్లతో వారి కుటుంబ సభ్యులను అనుమతించబోమని భారత క్రీడల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఏప్రిల్ 4న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఆరంభమయ్యే ఈ మెగా ఈవెంట్ కోసం భారత ఒలింపిక్ సంఘం 222 మంది అథ్లెట్ల పేర్లను ప్రకటించింది. వీరు కాకుండా 106 మంది అధికారులున్నారు. వీరిలో 57 మంది కోచ్‌లు, 19 మంది మేనేజర్లు, 41 మంది ఇతర సహాయక సిబ్బంది ఉన్నారు. మరో 41 మంది అధికారులకు క్రీడల మంత్రి నుంచి అనుమతి రావాల్సి ఉంది. 2014 కామన్వెల్త్ క్రీడల కన్నా ప్రస్తుత పోటీల్లో పాల్గొనే అథ్లెట్లు ఏడుగురు ఎక్కువ. ఆటగాళ్లతో వెళ్లే అధికారుల తుది బృందంపై క్రీడల శాఖ రెండురోజుల్లో నిర్ణయం తీసుకోనుంది. కామన్వెల్త్ సరదా కోసం వెళ్లే యాత్ర కాదని.. ఆటగాళ్లు, అధికారుల కుటుంబ సభ్యులకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వబోమని ఆ శాఖ చెప్పింది. "ఎంత పెద్ద స్టార్ అథ్లెట్ అయినా కుటుంబ సభ్యులను అనుమతించేది లేదు. ప్రభుత్వ సొమ్ము వారి కోసం ఎందుకు ఖర్చు పెట్టాలి. 41 మంది అధికారుల జాబితా ఇంకా నిలిపి ఉంచాం. అధికారులు ఆస్ట్రేలియా వెళ్లడానికి ఇదో అవకాశంగా భావిస్తున్నట్లు తెలిసింది. క్రీడాకారులకు చాలినంత అధికారులను మాత్రమే పంపాలని భావిస్తున్నాం" అని క్రీడల మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. రియో ఒలింపిక్స్ సమయంలోనూ భారత బృందం పంపే విషయంలో ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయి. భారీ బృందంతో వెళ్లిన భారత జట్టు రెండే పతకాలతో వెనుదిరగడంపై తీవ్ర విమర్శలు రేగాయి.

రియోలోనూ ఇంతే..

రియో ఒలింపిక్స్ జరిగినప్పుడు పతకవకాశాల గురించి కాకుండా భారీ భారత బృందంపైనే చర్చ జరిగింది. అథ్లెట్ల సంగతి పక్కనపెడితే వారితో పాటు వెళ్లిన సహాయ సిబ్బంది గురించి పెద్ద గొడవే నడిచింది. రియో ఒలింపిక్స్‌కు వెళ్లిన జట్టులో ఇద్దరు వైద్యులు ఉంటే.. వారిలో ఒకరు మాజీ క్రీడా పరిపాలకుడి బంధువు కావడంతో మరింత రచ్చ అయింది. 118 మంది సభ్యుల భారత ఒలింపిక్స్ బృందంలో చాలామంది అదనపు సభ్యులు ఎలాంటి అర్హత లేకుండానే విమానం ఎక్కారని విమర్శలు వచ్చాయి. అథ్లెట్లకు సంబంధించిన కుటుంబ సభ్యులు మార్గనిర్దేశకుడు, టీమ్ మేనేజర్ లాంటి అర్హతలు పెట్టుకుని జట్టుతో పాటు వెళ్లారనేది మరో విమర్శ. అంత పెద్ద బృందం వెళ్లినా భారత్‌కు దక్కింది రెండే పతకాలు కావడంతో ఆ విమర్శల జడి మరింత ఎక్కువైంది. అంత పెద్ద బృందం వెళ్లినా.. మహిళల మారథాన్ జరిగే సమయంలో మన క్రీడాకారిణులకు శీతల పానీయాలు అందించే అధికారి ఒక్కరూ లేరనే విమర్శలు వచ్చాయి. లండన్ పారాలింపిక్స్‌లోనూ ఇదే పరిస్థితి. ఆటగాళ్ల కన్నా సహాయ సిబ్బందే ఎక్కువ అయ్యారన్న వార్తలు వచ్చాయి. 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత బృందంతో పాటు వెళ్లిన అధికారుల ప్రయాణ, వసతి ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.1.75 లక్షలు ఖర్చు అయ్యాయని.. దీనికి వివరణ ఇవ్వాలని కూడా క్రీడల మంత్రిత్వశాఖ భారత ఒలింపిక్ సంఘాన్ని కోరింది. ఎప్పుడు భారీ క్రీడలు జరిగినా ఇదే తంతు నడుస్తోంది. అథ్లెట్లతో పాటు కోచ్‌లు, సహాయ సిబ్బంది వెళ్లడం మామూలే. కానీ దీన్నే అదనుగా తీసుకొని ప్రభుత్వ ఖర్చులతో అర్హత లేని వాళ్లు కూడా పోటీలకు వెళ్లడమే పెద్ద సమస్య అని క్రీడల శాఖ వర్గాలు అంటున్నాయి. అందుకే గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో ఇలాంటి అక్రమాలకు తావు లేకుండా చూసుకోవాలని క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ భావిస్తున్నాడు. కామన్వెల్త్ క్రీడలకు 222 మంది అథ్లెట్లు అర్హత సాధించగా.. వారితో మరో 106 మంది అధికారులు వెళ్లబోతున్నారు. వారిలో అర్హత లేని 41 మంది అదనపు సిబ్బంది గురించి ఆరా తీసే ప్రయత్నంలో ఉంది క్రీడల శాఖ. అధికారులు కుటుంబ సభ్యులను కూడా ఏదో ఒక రూపంలో ఈ జట్టుతో చేర్చడానికి ప్రయత్నిస్తున్నారనే వార్తలు వచ్చిన నేపథ్యంలో అలాంటి వారిని గుర్తించడానికి రంగంలో దిగింది. వీరి స్థానంలో కొన్ని ఆటల్లో అదనపు కోచ్‌లు అవసరం ఉండడంతో వారిని పంపించాలనే ప్రయత్నం చేస్తోంది. హాకీలో ఒకరు, బాక్సింగ్‌లో ఐదుగురు, స్క్వాష్, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక్కొక్కరు చొప్పున ఈ పోటీలకు వెళ్లబోతున్నారు. రియో ఒలింపిక్స్ సమయంలో భారత బృందం విషయంలో పెద్ద చర్చ నడవడంతో ఈసారైనా ఆ గొడవల నుంచి తప్పించుకోవాలని ఐఓఏ ప్రయత్నిస్తోంది. పోటీలకు వెళ్లే బృందం విషయంలో చాలా కఠినంగా ఉంటామని ఐఓఏ.. భారత అథ్లెటిక్ సంఘానికి స్పష్టం చేసింది.



విండీస్ వయా వాన

- ప్రపంచకప్‌కు అర్హత సాధించిన కరీబియన్ జట్టు
- డక్‌వర్త్ లూయిస్‌లో స్కాట్లాండ్‌పై విజయం

హరారె: వరుణుడు కరుణించడంతో వెస్టిండీస్ జట్టు 2019 వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. టోర్నీలో నిలకడైన ప్రదర్శన చేసిన స్కాట్లాండ్ నిరాశతో నిష్క్రమించింది. ప్రపంచకప్ క్వాలిఫయర్ సూపర్‌సిక్సెస్ మ్యాచ్‌లో బుధవారం విండీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఐదు పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్.. స్కాట్లాండ్ బౌలర్లు షరీఫ్ (3/27), వీల్ (3/34), లీస్క్ (2/35) ధాటికి తడబడింది. 48.4 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. గేల్ తొలి బంతికే ఔటయ్యాడు. లూయిస్ (66), శామ్యూల్స్ (51) రాణించారు. ఛేదనలో స్కాట్లాండ్ కూడా తడబడింది. ఓ దశలో 105/5తో నిలిచింది. రోచ్ (2/20) ధాటికి 25 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకుంది. బెరింగ్టన్ (33), మెక్‌లీడ్ (21) నిలవడంతో కోలుకుంది. నాలుగో వికెట్‌కు 42 పరుగులు జోడించాక మెక్‌లీడ్ వెనుదిగినా బెరింగ్టన్ నిలిచాడు. ముస్నే (32 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 38 పరుగులు జోడించి ఔటయ్యాడు. స్కాట్లాండ్ స్కోరు 105/5. విండీస్ విజయంపై కన్నేసింది. కానీ ప్రమాదకరంగా కనిపించిన ముస్నే... లీస్క్ (14 నాటౌట్)తో కలిసి స్కాట్లాండ్‌ను రేసులో నిలిపాడు. ఐతే ఆ జట్టు 31.4 ఓవర్లలో 125/5తో ఉన్న దశలో భారీ వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. మళ్లీ ఆట మొదలెట్టే అవకాశమే లేకపోయింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ విధానంలో విండీస్ ఐదు పరుగుల తేడాతో నెగ్గింది. నిజంగా అదృష్టం విండీస్ వైపు నిలిచిందనే చెప్పాలి. వాన వచ్చే సమయానికి అదే స్కోరు వద్ద స్కాట్లాండ్ నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి ఉంటే.. డ/లూ పద్ధతిలో ఆ జట్టే ముందంజ వేసేది. స్కాట్లాండ్‌కు మరింత బాధ కలిగించే విషయమేంటంటే, ఐదో వికెట్‌గా వెనుదిరిగిన బెరింగ్టన్.. అంపైర్ తీసుకున్న ఓ తప్పుడు ఎల్బీ నిర్ణయానికి బలయ్యాడు. ఈ విజయంతో విండీస్ సూపర్‌సిక్సెస్‌లో ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానం సాధించింది. ఈ నెల 25న జరిగే ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా సాంకేతికంగా విండీస్‌కు ఇంకా ఆశలుండేవి. కానీ ఫైనల్లో స్థానం చాలా ప్రమాదంలో పడేది. ఈ టోర్నీలో ఫైనల్ చేరిన రెండు జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి. జింబాబ్వే (5 పాయింట్లు), ఐర్లాండ్ (4 పాయింట్లు), అఫ్గాన్ (4 పాయింట్లు) జట్లు మరో స్థానం కోసం రేసులో ఉన్నాయి.



బుధవారం కోల్‌కతాలో జరిగిన 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో గంగూలీ, హర్భజన్, లక్ష్మణ్, పుజారా

అమ్మాయిలు పుంజుకునేనా?


- ఆస్ట్రేలియాతో పోరు నేడు
- ముక్కోణపు టీ20 సిరీస్



ముంబయి: భారత మహిళల క్రికెట్ జట్టు సొంతగడ్డపై మరో ప్రతిష్ఠాత్మక సమరానికి సిద్ధమైంది. గురువారం నుంచి ఆరంభమయ్యే ముక్కోణపు టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత్.. ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో వన్డేసిరీస్‌ను 0-3తో కోల్పోయిన భారత్ తిరిగి పుంజుకోవాలనే పట్టుదలతో ఉంది. ఎలాగైన విజయం సాధించి పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనే నిశ్చయంతో ఉంది. వన్డే సిరీస్‌లో వరుస అర్ధ సెంచరీలతో చెలరేగిన స్మృతి మంధాన తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాలని చూస్తోంది. బ్యాటింగ్ భారం ముఖ్యంగా మిథాలీరాజ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌లపైనే ఉంది. ఈ ఇద్దరూ ఆస్ట్రేలియా పేస్ దళానికి ఎదురునిలిచి జట్టుకు భారీ స్కోరు అందించాలి. మరోవైపు మిడిలార్డర్ వైఫల్యం భారత్‌ను కలవరపెడుతోంది. వేదా కృష్ణమూర్తి, పూజ వస్త్రాకర్, జెమిమా రోడ్రిగ్స్ సత్తాచాటాల్సిన అవసరం ఉంది. జులన్ గోస్వామి రాకతో భారత బౌలింగ్ బలంగా కనిపిస్తోంది. పేసర్ శిఖాపాండేతో పాటు స్పిన్నర్లు దీప్తి శర్మ, పూనమ్ యాదవ్ తమ బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు వన్డేసిరీస్ నెగ్గిన ఆత్మవిశ్వాసంతో ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ఆస్ట్రేలియా ఉంది. ఆ జట్టు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో పటిష్ఠంగా ఉంది. ఈ ముక్కోణపు టోర్నీలో ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లాండ్ కూడా పాల్గొంటుంది.

భారత టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, మిథాలీ రాజ్, వేదా కృష్ణమూర్తి, జెమిమా రోడ్రిగ్స్, అనుజ పాటిల్, దీప్తి శర్మ, తనియా భాటియా (వికెట్‌కీపర్), పూనమ్ యాదవ్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజ వస్త్రాకర్, రుమేలీధర్, మోన మేశ్రమ్, రాజేశ్వరి గైక్వాడ్.

ఆ సిక్స్ కొట్టి ఉండకపోతే..



విజయ్ శంకర్

ముంబయి: భారత్‌తో నిదహాస్ ట్రోఫీ ఫైనల్లో అటు బంగ్లా బౌలర్ సౌమ్య సర్కార్ ఆఖరి బంతిని వేయడానికి సిద్ధమవుతున్నప్పుడు.. కోట్లాది అభిమానులే కాదు.. డగౌట్లో ఉన్న విజయ్ శంకర్ కూడా దినేశ్ కార్తీక్ సిక్స్ కొట్టాలి.. సిక్స్ కొట్టాలి అని దేవుడిని ప్రార్థించి ఉంటాడు.. బంతి ఎంత వేగంగా పడిందో తెలియదు కానీ శంకర్ గుండె అంతకంటే వేగంగా కొట్టుకుని ఉంటుంది.. సర్కార్ ఆఫ్ స్టంప్‌కు దూరంగా వేసిన బంతిని కార్తీక్ లాఘవంగా కవర్స్ దిశగా ఫ్లాట్ సిక్స్ కొట్టడంతో అభిమానులు ఉబ్బితబ్బిబ్బయితే.. శంకర్ మాత్రం హమయ్య అని ఊపిరి పీల్చుకుని ఉంటాడు. అసలు కార్తీక్ ఆ సిక్స్ కొట్టి ఉండకపోతే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడం కష్టం అంటున్నాడు ఈ తమిళనాడు ఆల్‌రౌండర్. ఎందుకంటే కీలక సమయంలో బంతులు వృథా చేయడంతో పాటు ధాటిగా ఆడలేకపోడంతో అభిమానులు శంకర్‌ను తీవ్రంగా విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో అయితే 'టెన్నిస్ బంతితో ఆడుకో' అంటూ సలహాలు కూడా ఇచ్చారు. ఈ సంఘటన గురించి అతనేమంటున్నాడంటే..

"నా జీవితంలో కచ్చితంగా వీలైనంత త్వరగా మరిచిపోవాల్సిన సంఘటన నిదహాస్ ట్రోఫీ ఫైనలే. మ్యాచ్ జరిగి ఇన్ని రోజులు గడిచినా ఆ వైఫల్యాన్ని మరిచిపోలేకపోతున్నా. కేవలం 15,20 నిమిషాల వ్యవధిలోనే ఒత్తిడి, బాధ, ఆందోళన, ఆనందం ఇలా అన్ని ఉద్వేగాలను అనుభవించాను. ఆ కొద్ది సమయమే ఇంకా నన్ను వెంటాడుతోంది. ఇంకా ఆ దృశ్యాలు నా కళ్ల ముందు కదులుతున్నాయి. ఒకవేళ దినేశ్ కార్తీక్ ఆ సిక్స్ కొట్టి ఉండకపోతే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడమే కష్టంగా ఉంది. మ్యాచ్‌ను ఒంటిచేత్తో గెలిపించినందుకు డీకేకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. దేశవాళీ క్రికెట్లో ఇలాంటి పరిస్థితుల్లో చాలాసార్లు బ్యాటింగ్ చేశా. ముస్తాఫిజుర్ బౌలింగ్‌లో ఒకటి రెండు పరుగులు చేసి మిగిలిన బౌలర్లపై ఎదురుదాడికి దిగాలని అనుకున్నా. నిజానికి కవర్స్ మీదుగా బౌండరీలు సాధించడం నాకిష్టం కానీ ఒత్తిడిలో కనీసం బంతిని బ్యాట్‌కు తాకించ లేకపోయాను. అప్పుడు నా మెదడు ప్రెషర్ కుక్కర్‌లా ఉడికిపోయింది. బంతి లైన్‌ను గుర్తించకుండా వీలైనంత గట్టిగా ఆడాలని ప్రయత్నించడమే నా తప్పు"

ఓదార్పు ఇచ్చింది అతనే: "మ్యాచ్ పూర్తి అయిన తర్వాత హోటల్ గదికి వెళ్లిపోయి తలుపేసేసుకున్నా. కాసేపటి తర్వాత నా ఆప్తుడు దినేశ్ కార్తీక్ తలుపు తట్టాడు. తమిళనాడుకు ఆడే సమయంలో కార్తీక్ నాకెంతో నేర్పించాడు. స్ఫూర్తిగా నిలిచాడు. క్లిష్ట స్థితిలో ఉన్న సమయంలో మరోసారి కార్తీకే ఓదార్పునిచ్చాడు. అతను భుజం చుట్టూ చేయి వేసి మాట్లాడుతుంటే అదో ధైర్యం. మరీ ఎక్కువ ఆలోచించొద్దని.. ప్రశాంతంగా ఉండమని చెప్పాడు. తప్పులు తెలుసుకుని సత్తా చాటే సమయమిది అని అతను చెప్పిన మాటలతో ప్రశాంతంగా నిద్రపోయా. మళ్లీ ఇలాంటి పరిస్థితిలోనే బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించాలనే తపనతో ఉన్నా"

విరాట్ ఎంతో.. పుజారా అంతే

కోల్‌కతా: టెస్టుల్లో చెతేశ్వర్ పుజారా ఎంతో కీలక ఆటగాడని.. ఈ విషయం ఎక్కువమంది గుర్తించలేరని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. జట్టులో అందరూ విరాట్ కోహ్లినే చూస్తారని..కానీ అతనితో పాటు విలువైన ఆటగాడు పుజారాను గమనించరని అతనన్నాడు. "టెస్టుల్లో విరాట్ కోహ్లితో పాటు పుజారాకు మంచి రికార్డు ఉంది. పాత ఆటగాళ్ల మాదిరే అతని శైలి అందరి కంటే భిన్నం. కుదురుకుని నెమ్మదిగా పరుగులు చేస్తాడు. జట్టును గెలిపించే ఇన్నింగ్స్‌లు ఆడినా వాటిని ఎవరూ గుర్తించరు. ఉత్తమమైన జట్టుకెప్పుడూ మూడో నంబర్‌లో ఉత్తమ బ్యాట్స్‌మెన్ ఉంటాడు. రాహుల్ ద్రవిడ్ దీనికి ఉదాహరణ. ఇప్పుడు కూడా భారత్ ఉత్తమంగా ఆడుతోంది ద్రవిడ్ స్థానంలో పుజారా ఉన్నాడు. ఈ స్థానంలో వచ్చే ఆటగాళ్లు కొత్త బంతి మెరుపు పోగొట్టి తర్వాత ధాటిగా ఆడే వారికి బ్యాటింగ్ సులభం చేస్తారు. అందుకే ఈ జట్టులో పుజారా ఉండడం విరాట్‌కు చాలా మంచిది" అని దాదా అన్నాడు.

ఫ్రెంచ్ ఓపెన్ నగదు బహుమతి పెంపు

పారిస్: ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ నగదు బహుమతి మొత్తాన్ని దాదాపు ఎనిమిది శాతం పెంచారు. సింగిల్స్ విజేతకు ఇచ్చే మొత్తం లక్ష యూరోలు పెరిగి 2.2 మిలియన్ యూరోలకు చేరుకుంది. టోర్నీ మొత్తం నగదు బహుమతి మూడు మిలియన్ యూరోలు పెరిగి 39.197 మిలియన్ యూరోలకు చేరిందని టోర్నీ డైరెక్టర్ గై ఫర్గెట్ చెప్పాడు. ఫ్రెంచ్ ఓపెన్ మే 27న ఆరంభమవుతుంది.

భాజపాను వీడిన ఆ పార్టీ ఐటీ విభాగ వ్యవస్థాపకుడు

దిల్లీ: భాజపాకు అత్యంత కీలకమైన ఐటీ విభాగ వ్యవస్థాపకుడు ప్రద్యుత్ బోరా పార్టీని వీడారు! అసోంలో యువ నాయకుడి ఉన్న ఆయన... జాతీయ కార్యవర్గం నుంచి వైదొలిగారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్నీ రద్దు చేసుకున్నారు. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ ప్రజాస్వామ్య సంప్రదాయాలు మంటగలిసినందునే తానీ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మోదీ, అమిత్ షాల వ్యవహార్శైలిపైనా ఆయన విరుచుకుపడ్డారు. "ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే ముఖ్యమన్న పిచ్చి పార్టీని పట్టుకుంది. పార్టీ మూల సంప్రదాయాలు నాశనమైపోయాయి. 2004లో నేను చేరినప్పటిలా పార్టీ ఇప్పుడు లేదు" అని అధ్యక్షుడు అమిత్ షాకు పంపిన రాజీనామా లేఖలో బోరా పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ- "దేశానికి విభిన్నమైన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం. భాజపా అలా లేకపోతే ప్రజలు ఇతర పక్షాలను ఎంపిక చేసుకుంటారు. కాంగ్రెస్, ఆప్, ఏజీపీల నుంచి నాకు ఆహ్వానాలున్నాయి. వాటి గురించి ఇంకా ఆలోచించలేదు" అన్నారు. బోరా తన 40 పేజీల సుదీర్ఘ రాజీనామా పత్రంలో- ప్రధాని మోదీ, అధ్యక్షుడు అమిత్ షాల పని తీరుపై పలు ఇబ్బందికర ప్రశ్నలను సంధించారు. మంత్రివర్గ వ్యవస్థలో సమానుల్లో ప్రథముడిగా ప్రధాన మంత్రి వెలుగొందే దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను మోదీ తుంగలో తొక్కారని విమర్శించారు. అమిత్ షా పార్టీకి అంతా తానే అయినట్లు వ్యక్తిస్వామ్య, కేంద్రీకృత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

చూడకుండా లెక్కించేదెలా?

- అందుకే సభను వాయిదా వేస్తున్నా: మహాజన్
- 4వ రోజూ లోక్‌సభలో చర్చకు రాని అవిశ్వాసం

ఈనాడు, దిల్లీ: 'ఇక్కడి నుంచి నేనేమీ చూడలేపోతున్నాను. సభ సజావుగా లేనందున అవిశ్వాస నోటీసులను ముందుకు తీసుకురాలేకపోతున్నాను. అయామ్ సారీ' అంటూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వరుసగా నాలుగో రోజూ అవిశ్వాస తీర్మానాలను పక్కనపెట్టారు. గత శుక్రవారం నుంచి తెదేపా, వైకాపా సభ్యులు వరుసగా అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వడం, సభలోని వెల్‌లో ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు నిల్చొని ఆందోళన చేయడం... సభ సజావుగా లేనందున తాను 50 మందిని ఎంచలేకపోతున్నానని చెప్పి స్పీకర్ వాయిదా వేయడం పరిపాటిగా మారింది. బుధవారం కూడా అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. ఉదయం 11 గంటలకు మొదలై, నిమిషంలోనే వాయిదాపడ్డ సభ మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమయింది. వెంటనే కావేరి బోర్డు ఏర్పాటు కోసం ఏఐఏడీఎంకె, రిజర్వేషన్ల కోటా పెంపు డిమాండుతో



బుధవారం లోక్‌సభలో స్పీకర్ సుమిత్ర మహాజన్‌కు అడ్డుగా ప్లకార్డు

తెరాస సభ్యులు నినాద ఫలకాలు (ప్లకార్డులు) పట్టుకొని వెల్‌లోకి వచ్చారు. బిహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ ఆ రాష్ట్ర ఎంపీ పప్పూ యాదవ్ రెండు చేతుల్లో రెండు పెద్ద ప్లకార్డులు పట్టుకొని వెల్‌లోకి వచ్చారు. ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులతోపాటు ఆయనా ఆందోళనకు దిగారు. ఆ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ లేచి- మోదీ ప్రభుత్వంపై సభ లోపలా, బయటా పూర్తి విశ్వాసం ఉందనీ, అవిశ్వాస తీర్మానంతో పాటు ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వెల్‌లోని సభ్యులు వెనక్కు వెళ్లి సభా వ్యవహారాలు సాగడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఆయన మాటలను వెల్‌లోని వారు వినిపించుకోలేదు. స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడుతూ తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాల గురించి సభకు వెల్లడించారు. వాటిని సభముందు పెట్టాల్సిన బాధ్యత తనపై ఉందని, సభ సజావుగా లేకపోతే వాటికి మద్దతు ఇచ్చే 50 మందిని లెక్కించడం సాధ్యం కాదన్నారు. 'నేను ఇక్కడనుంచి ఏమీ చూడలేకపోతే సభ్యుల్ని ఎలా లెక్కించగలను? మద్దతిస్తున్న 50 మంది తమకు కేటాయించిన స్థానాల్లో నిలబడితేనే అవిశ్వాసానికి అనుమతించాలా? లేదా? అనేది నిర్ధారించుకోవడానికి వీలవుతుంది. అందువల్ల అందరూ వెనక్కు వెళ్లండి' అని సూచించారు. వెల్‌లోనివారు వినిపించుకోకుండా ప్లకార్డుల్ని స్పీకర్‌కు అడ్డంగా మరీ తెచ్చిపెట్టారు. పరిస్థితి అలాగే కొనసాగడంతో సభ సజావుగా లేనందున నోటీసులను సభ ముందుకు తీసుకురాలేకపోతున్నానంటూ సభను గురువారానికి వాయిదా వేశారు. మొత్తంగా బుధవారం లోక్‌సభ 10 నిమిషాల్లోపే ముగిసిపోయింది. గత నాలుగు రోజుల తరహాలోనే లోక్‌సభ టీవీలో విపక్ష సభ్యులెవ్వర్నీ చూపలేదు. అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నవారిని లెక్కించాల్సి ఉందని స్పీకర్ అన్నప్పుడు కాంగ్రెస్, తెదేపా, తృణమూల్, వైకాపా, వామపక్షాల సభ్యులంతా లేచి నిల్చొని చేతులెత్తినా ప్రయోజనం లేకపోయింది.

పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేవంటూ రూ.8,571 కోట్ల వసూలు

బ్యాంకుల జరిమానాలపై కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేవంటూ గత నాలుగేళ్లలో ప్రజల నుంచి రూ.8,571.47 కోట్ల జరిమానాను బ్యాంకులు వసూలుచేశాయి. దీనిలో ఒక్క ఎస్‌బీఐ వాటానే రూ.1982 కోట్లు. రాజ్యసభలో ఓ లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా ఆర్థికశాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా బుధవారం ఈ వివరాలు సమర్పించారు. జరిమానా వసూళ్లలో ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేటు బ్యాంకులు దూకుడు ప్రదర్శించాయి. "బేసిక్ సేవింగ్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్స్", "ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన అకౌంట్స్"కు ఎలాంటి కనీస నిల్వలూ అవసరంలేదని మంత్రి తన సమాధానంలో చెప్పారు. 2017 సెప్టెంబర్ నాటికి సాధారణ పొదుపు ఖాతాలు 52.2 కోట్లు, జన్‌ధన్‌ఖాతాలు 30.31 కోట్లమేర ఉన్నట్లు ఆయన వివరించారు. మిగతా పొదుపు ఖాతాలకు మాత్రం పాలకమండళ్ల ఆమోదంతో కనీస నిల్వలు నిర్వహించని ఖాతాదారుల నుంచి ఛార్జీలు వసూలుచేయడానికి బ్యాంకులకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఆ ఛార్జీలు హేతుబద్ధంగా, సేవలు అందించడానికి అయ్యే సగటు ఖర్చు ఆధారంగా ఉండాలని నిర్దేశించినట్లు వివరించారు.

వసూలు చేసిన జరిమానా వివరాలు రూ.కోట్లలో..

బ్యాంకులు	2014-15	2015-16	2016-17	2017-18 (డిసెంబర్ వరకు)
ప్రైవేటు	1,031.85	945.07	1,008.79	783.98
ప్రభుత్వ	687.57	801.07	779.42	2,533.72
మొత్తం	1,719.42	1,746.14	1,788.21	3,317.70

ఆయుష్మాన్ భారత్ ఆరంభానికి రంగం సిద్ధం

- పథకం ప్రారంభానికి మంత్రిమండలి ఆమోదం

దిల్లీ: పేద ప్రజల శ్రేయస్సు కోసం ఇటీవలి బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం 'ఆయుష్మాన్ భారత్' కార్యరూపం దాల్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన దిల్లీలో బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఈ పథకం ప్రారంభానికి అంగీకారం తెలిపింది. 'ఆయుష్మాన్ భారత్' కింద దేశవ్యాప్తంగా 10 కోట్లకుపైగా పేద కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల కవరేజీ దక్కనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన(ఆర్ఎస్‌బీవై), వృద్ధుల ఆరోగ్య బీమా పథకం(ఎస్‌సీహెచ్ఐఎస్) వంటి కేంద్ర ప్రాయోజిత పథకాలు 'ఆయుష్మాన్ భారత్'లో విలీనమవుతాయని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎస్)ను 2020 వరకూ కొనసాగించాలని దీనిలో ప్రతిపాదించింది. దీనికోసం రూ.85,217 కోట్లు నిధులు కేటాయించాలని నిర్ణయించింది.

సమావేశంలోని మరిన్ని ముఖ్యాంశాలు

- ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీలు) ఉప వర్గీకరణకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.రోహిణి నేతృత్వంలో ఏర్పాటైన ఐదుగురు సభ్యుల కమిషన్ పదవీకాలాన్ని ఈ ఏడాది జూన్ 20 వరకు పొడిగించారు.
- దేశంలో పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మూడేళ్లపాటు అమల్లో ఉండేలా రూ.2,161 కోట్లతో కేంద్ర ప్రాయోజిత సమీకృత పథకానికి ఆమోదం లభించింది.
- ఆఫ్రికా ఖండంలో ప్రాబల్యాన్ని పెంచుకునే ఉద్దేశంతో వచ్చే నాలుగేళ్లలో బుర్కినాఫాసో, కామెరూన్, జిబౌటి, సోమాలియా సహా మొత్తం 18 ఆఫ్రికా దేశాల్లో దౌత్య కార్యాలయాలను ఏర్పాటుచేయనున్నారు.
- 'ప్రవాస భారతీయుల భారత అభివృద్ధి సంస (ఐడీఎఫ్-ఓఐ)'ను ఈ నెల 31లోగా మూసివేయనున్నారు.
- దేశంలో సరోగసీ వాణిజ్యమయం కాకుండా నిషేధించేందుకు ఉద్దేశించిన సరోగసీ(క్రమబద్ధీకరణ) బిల్లు-2016 పార్లమెంటులో ఆమోదం లభించేలా అధికారిక సవరణలు చేపట్టేందుకు మంత్రిమండలి అంగీకరించింది.

ఆ రోజు జయలలిత స్నానాల గదిలో పడ్డారు

విచారణ కమిషన్‌కు వివరించిన శశికళ

ఈనాడు డిజిటల్, చెన్నై: జయలలిత మరణంపై విచారణ నిమిత్తం ఏర్పాటైన జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్‌కు చిన్నమ్మ శశికళ పలు విషయాలను వెల్లడించారు. 2016 సెప్టెంబరు 22న ఏం జరిగిందనే వివరాలను ఆమె తరఫున కమిషన్‌కు గత వారం దాఖలు చేశారు. అందులో.... ఆ రోజు రాత్రి 9:30కి పోయెస్ గార్డెన్‌లోని వేదనిలయంలో జయలలిత స్నానాల గదిలో పడిపోయారని, తాము గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్తామన్నా ఆమె తిరస్కరించారని శశికళ పేర్కొన్నారు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే వైద్యులను పిలిచానని తెలిపారు. వారు పరిశీలించి అంబులెన్సును రప్పించారని చెప్పారు. ఆమె ఆస్పత్రిలో ఉన్నప్పుడు ప్రస్తుత అప్పటి ఇన్‌ఛార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం, లోక్‌సభ ఉపసభాపతి తంబిదురై, ఆరోగ్య శాఖ మంత్రి విజయభాస్కర్, అన్నాడీఎంకే నేతలు పలువురు చూశారని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా పన్నీర్‌సెల్వం, తంబిదురై గతంలో తాము ఆస్పత్రిలో 'అమ్మ'ను చూడలేదని పేర్కొనడం గమనార్హం. ఇద్దరు భద్రతాధికారులు కూడా జయలలితతో మాట్లాడారని శశికళ వివరించారు. మరికొందరు సన్నిహితులను మాత్రమే జయను చూడటానికి అనుమతించినట్లు చెప్పారు. జయలలిత ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆమె అనుమతితో నాలుగు వీడియోలు తీశామని... వాటిని కమిషన్‌కు సమర్పిస్తున్నట్లు తెలిపారు. 2016 సెప్టెంబరు 22వ తేదీ కంటే ముందే జయలలిత జ్వరంతో బాధపడ్డారని చెప్పారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి జయలలిత తీవ్ర ఒత్తిడికి గురైనట్లు వివరించారు.

హిందూ, జైన క్షేత్రాలతో సర్క్యూట్

ఈనాడు, హైదరాబాద్: ఆధ్యాత్మిక పర్యటకాన్ని ప్రోత్సహించేందుకు మరో పర్యటక సర్క్యూట్‌కు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఒక్క రోజులో హిందూ ఆలయాలతో పాటు జైన ఆలయాన్ని సందర్శించి వచ్చేలా తెలంగాణ పర్యటకశాఖ రూపొందించింది. టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ రాములు, ఎండీ మనోహర్ ఈ సర్క్యూట్‌పై కసరత్తు చేసి బుధవారం ఓకొలిక్కి తెచ్చారు. రూ.40కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు.

వరంగల్ రహదారికి సమాంతరంగా..: హైదరాబాద్ నుంచి బయల్దేరి కీసరగుట్ట ఆలయం, యాదాద్రి పుణ్యక్షేత్రం, ఆ తర్వాత కొలన్‌పాక ఆలయాల్ని సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. సిద్ధులగుట్ట, జీడికల్లు ఆలయాల్ని కూడా ఇందులో చేర్చారు. కొలన్‌పాకలో జైన ఆలయంతోపాటు చాళుక్యుల కాలంనాటి శివాలయం కూడా ఉంది. కొలన్‌పాకలో సోమేశ్వర, మహాలక్ష్మి వీరాంజనేయస్వామి ఆలయాల పునరుద్ధరణ పనులకూ రూ.ఆరు కోట్లతో ప్రతిపాదనలున్నాయి.

త్వరలో కేంద్రానికి ప్రతిపాదనలు: హిందూ, జైన ఆలయాలతో కూడిన సర్క్యూట్ ప్రతిపాదనల్ని త్వరలో కేంద్రానికి పంపనున్నట్లు పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేర్వారం రాములు 'ఈనాడు'తో పేర్కొన్నారు. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిని తాకకుండా హైదరాబాద్ నుంచి కీసర, యాదాద్రి, కొలన్‌పాక సమాంతర మార్గంగా రూపొందించామని తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం బయల్దేరి, సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకునేలా పర్యటకాభివృద్ధి సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఆధ్యాత్మిక పర్యటకుల కోసం మూడు హరిత హోటళ్లను కూడా నిర్మించాలని ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం వస్తే ఈ సర్క్యూట్ కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.

ఇన్‌సర్వీస్ కోటాను పునరుద్ధరించాలి

- ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్
- ఎంసీఐ నిబంధనలనే అనుసరించాలి: జూడాలు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్: వైద్య విద్య పీజీ సీట్ల భర్తీలో ఇన్‌సర్వీస్ కోటా రద్దును తక్షణమే విరమించుకోవాలనీ, గతేడాది మాదిరిగానే ప్రభుత్వ వైద్యంలో సేవలందిస్తున్న వైద్యులకు పీజీ సీట్లలో రిజర్వేషన్ కోటాను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీడీఏ) కోరింది. ఇన్‌సర్వీస్ కోటాను పునరుద్ధరించే వరకూ తమ పోరాటం ఆగదని పేర్కొంది. సత్వరమే కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి కరుణాకరరెడ్డిని తొలగించాలని ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. వీసీ.. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని ఆరోపిస్తూ ఆయన దిష్టిబొమ్మను కోఠిలోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయం ఎదుట దహనం చేశారు. అనంతరం వైద్యభవన్‌లో టీజీడీఏ అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. పీజీ సీట్ల ప్రవేశాల్లో మార్కులను అదనంగా జతపరిస్తే ప్రభుత్వ వైద్యులు తీవ్రంగా నష్టపోతారనీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అవసరమైతే ఓపీతో పాటు అత్యవసర సేవలనూ బహిష్కరిస్తామని టీజీడీఏ నేతలు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ వైద్యంలో చేరాలనుకునే ఔత్సాహిక వైద్యులకు ఇది నిరుత్సాహం కలిగించేలా ఉందని టీజీడీఏ నేతలు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ రవిశంకర్ తెలిపారు.

జూడాల అభ్యంతరం

ప్రభుత్వ వైద్యుల ఆందోళనలపై తెలంగాణ జూడాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పీజీ వైద్య సీట్లలో రిజర్వేషన్ల విధానం తొలగించి మార్కుల ప్రాధాన్యాన్ని కొనసాగించాలనేది భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) నిర్ణయమనీ, ఎంసీఐ ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. దీనిపై ఎవరికీ ఆందోళన అక్కర్లేదని తెలంగాణ జూడాల సలహాదారు డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నోట్లరద్దుపై స్థాయీసంఘ సభ్యుల భిన్నాభిప్రాయాలు

దిల్లీ: నోట్లరద్దు విషయంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ నేతృత్వం వహిస్తున్న ఈ సంఘంలో మొత్తం 31 మంది సభ్యులున్నారు. నోట్లరద్దు అంశంపై పార్లమెంటులో సమర్పించేందుకు ఈ సంఘం ముసాయిదా నివేదిక సిద్ధం చేసింది. అయితే నోట్లరద్దుపై ఈ నివేదికలో వ్యక్తం చేసిన విమర్శనాత్మక ధోరణి, అభిప్రాయాలపై.. సగానికిపైగా సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. భాజపాకు చెందిన 10 మంది సభ్యులు, ఆ పార్టీ మిత్ర పక్షాలకు చెందిన ఆరుగురు సభ్యులు నివేదికను ఆమోదించేందుకు నిరాకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సగానికిపైగా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో.. నివేదిక ఆమోదం పొందడం అనుమానంగా మారింది. ఇటు నోట్లరద్దు అతిపెద్ద సంస్కరణ అని.. అవినీతి, నల్లధనం, ఉగ్రనిధుల కట్టడికి ఇది దోహదపడిందని భాజపా సభ్యులు సంఘానికి తమ ప్రకటనలో తెలిపారు.

జడ్జీల నియామకంపై అనంగీకారమేదీ లేదు!

దిల్లీ: న్యాయమూర్తుల నియామకం అంశంపై కార్యనిర్వాహక.... న్యాయవ్యవస్థల మధ్య తీవ్రమైన అనంగీకారం అంటూ ఏదీ లేదని న్యాయశాఖ సహాయమంత్రి పీపీ. చౌధరి బుధవారం లోక్‌సభలో తెలిపారు. తీవ్రమైన అనంగీకారామంటూ ఏమీ లేదు...ఒకవేళ ఏవైనా బేధాభిప్రాయాలుంటే వాటిని పరస్పరం పరిష్కరించుకోవచ్చు అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నక్సల్ నేత అర్వింద్‌జీ గుండెపోటుతో మృతి!

దిల్లీ/రాంచీ: పేరుమోసిన నక్సల్ నాయకుడు, కమాండర్ అర్వింద్‌జీ బుధవారం గుండెపోటుతో మరణించినట్లు తెలుస్తోంది. ఆయన వయసు సుమారుగా 50 ఏళ్లు ఉండవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. గుర్రపు స్వారీలో ఆరితేరిన వ్యక్తిగా పేర్కొనే అర్వింద్‌జీని దేవ్‌కుమార్ సింగ్, నిషాంత్ అనే పేర్లతోనూ పిలుస్తుంటారు. ఝార్ఖండ్‌లోని బుధ పహాడ్ అడవుల్లో అతడు బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలుస్తోంది. అతడిని పట్టిచ్చిన వారికి రూ.కోటిన్నర రివార్డును ఝార్ఖండ్, బిహారు ప్రభుత్వాలు గతంలోనే ప్రకటించి ఉన్న విషయం గమనార్హం. బిహారుకు చెందిన అర్వింద్‌జీ ఉన్నత విద్యావంతుడు, సాంకేతిక నిపుణుడు కూడా. ఎన్నో ఏళ్ల నుంచి ఝార్ఖండ్ ప్రాంతంలో నక్సల్ కార్యకలాపాల వ్యూహకర్తగా, సూత్రధారిగా వ్యవహరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

యూపీలో 'దశ' తిరిగేదెవరికో..!!

ఈనాడు, దిల్లీ: ఇటీవల జరిగిన యూపీ ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమితో రగిలిపోతున్న భాజపా... ఈ నెల 23న జరగబోయే రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీలకు సవాల్ విసురుతోంది. ఆ రోజు 10 రాజ్యసభ సీట్లకు యూపీలో ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో అభ్యర్థి గెలవాలంటే 37 మంది శాసనసభ్యుల మద్దతు అవసరం. మిత్రపక్షాలతో కలిపి యూపీ శాసనసభలో భాజపాకి ఉన్న 325 మంది శాసనసభ్యుల బలంతో సునాయాసంగా 8 మందిని రాజ్యసభకి పంపించే అవకాశం ఉంది. పార్టీ మాత్రం తొమ్మిది మందిని పోటీ చేయిస్తోంది..! ఎస్పీ, బీఎస్పీలు చెరో అభ్యర్థిని నిలబెట్టాయి. 47 మంది ఎమ్మెల్యేలు ఎస్పీకి ఉండడంతో ఆ పార్టీ తన అభ్యర్థిని సులభంగా గెలిపించుకోగలదు. ఇంకా 10 ఓట్లు మిగులుతాయి కూడా. బీఎస్పీ వద్ద 19 ఓట్లే ఉన్నా, తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఈ 10 మిగులు ఓట్లు ఎస్పీ నుంచి పొందాలని భావిస్తోంది. అజిత్‌సింగ్‌కు చెందిన ఆర్ఎల్‌డీ కూడా బీఎస్పీకి మద్దతును ప్రకటించింది. ఎస్పీ ఓట్లకు గండి కొట్టాలని స్వయానా భాజపా అధ్యక్షుడు అమిత్ షా రంగంలో దిగారు. బుధవారం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్ నిర్వహించిన ముఖ్యమైన సమావేశానికి ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీంతో కమల దళపతి వేసిన ప్రతీకార పాచిక పారుతుందా అనే ఊహాగానాలు మొదలయ్యాయి.

భాజపాకు పరాభవం తప్పదు

- నాలుగేళ్లుగా ప్రజల్ని మోదీ మభ్యపెడుతున్నారు
- చివరి ఏడాది చేయగలిగిందీ ఏమీ లేదు
- కర్ణాటకలో కాంగ్రెస్‌దే జయభేరి
- ప్రచారంలో జోరు పెంచిన రాహుల్
- మోదీ పాలనపై మండిపాటు
- కర్ణాటకలో జోరుగా ప్రచారం

ఈనాడు - బెంగళూరు

వచ్చే విధానసభ ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ జయభేరి మోగించనుండగా- అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఘోర పరాభవాన్ని చూస్తారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జోస్యం చెప్పారు. కర్ణాటక కాఫీ రాజధానిగా పేరుగాంచిన చిక్కమగళూరులో బుధవారం సాయంత్రం పార్టీ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. 'నాలుగేళ్లుగా హామీలతో జనాన్ని మభ్యపెడుతున్నారు. చేసిందేమీ లేదు. మిగిలిన ఏడాదిలో చేయగలిగిందీ లేదు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు పరాభవం



శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామి నుంచి ఆశీస్సులు పొందుతున్న రాహుల్‌గాంధీ

తప్పదు' అని ప్రకటించారు. 'ప్రజల పట్ల గౌరవాభిమానాలతోనే దేశాన్ని ప్రగతిపథంలోకి నడిపించగలం. మోదీ అంతటి కఠిన హృదయుణ్ని, ప్రజల పట్ల గౌరవాభిమానాల్లేని ప్రధానిని చూడలేదు' అంటూ వ్యాఖ్యానించారు.

- ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో మంగళవారం జరిగిన బహిరంగ సభల్లో మాదిరే ప్రధాని మోదీ, భాజపా నాయకత్వాలపై రాహుల్ విరుచుకుపడ్డారు. దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్న భాజపా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లకు వ్యతిరేకంగా పోరాడేందుకు, దేశంలోని అన్ని వర్గాల మధ్య సుహృద్భావాన్ని పెంచేందుకు తగిన శక్తి నివ్వాలని ప్రజలకు విన్నవించారు. కష్టకాలంలో తన నాయనమ్మ ఇందిరాగాంధీని ఆదుకున్నట్లే, తననూ ఆదరించాలని కోరారు. చిక్కమగళూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఇక్కడి ప్రజలకు ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు కృషిచేస్తానన్నారు. నాయనమ్మ మాదిరే తనకూ కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాలను ఆదుకోవటం ఇష్టమంటూ వ్యాఖ్యానించారు.
- 'గొప్పలు చెప్పను. చేసి చూపిస్తాను. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా, వైద్య సమస్యల్ని పరిష్కరిస్తా. రైతుల కన్నీళ్లు తుడుస్తా'నని' రాహుల్ భరోసా ఇచ్చారు. 'మతం అంటే సత్యం అని శృంగేరిలోని సంస్కృత విద్యాలయంలో చదువుతున్న ఓ విద్యార్థి చెప్పాడు. ఈ ధర్మ సూత్రం దేశాన్ని ఏలుతున్న మోదీకి తెలియకపోవటం సిగ్గుచేటు. నోరు విప్పితే అన్నీ అబద్ధాలే' అంటూ విరుచుకుపడ్డారు.
- అవినీతి ఆరోపణలతో చెరసాలకు వెళ్లి వచ్చిన మాజీ మంత్రులు, ముఖ్యమంత్రిగా పనిచేసినవారితో కలసి ప్రధాని మోదీ బహిరంగ వేదికపై అవినీతి అంతం గురించి గొప్పలు చెప్పుకొంటున్నారని రాహుల్ విమర్శించారు. నరేంద్ర మోదీకి అతి సన్నిహితులైన నీరవ్ మోదీ, ఆయన మామ మోక్సీ రూ.12వేల కోట్ల ధనంతో పరాయిదేశాలకు పారిపోతే ప్రధాని నోట మాట ఎందుకు రాదని ప్రశ్నించారు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా తనయుడు జేషా మూణ్నెల్ల వ్యవధిలో రూ.15వేలను రూ.80కోట్లుగా చేసినా మోదీకి అవినీతి కనపడదని ఎద్దేవా చేశారు. సరిహద్దులో డోక్లాం వద్ద చైనా రహదార్లు, విమానాశ్రయాలు నిర్మించినా నోరు మెదపటం లేదని తప్పుబట్టారు.
- ఉదయం మంగళూరు నుంచి శృంగేరి చేరుకున్న రాహుల్‌గాంధీ అక్కడ ఆది శంకరాచార్య స్థాపించిన శారదా మందిరాన్ని దర్శించారు. శృంగేరి పీఠాధిపతిని కలుసుకుని ఆశీస్సులు పొందారు. సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థులతో ముఖాముఖి భేటీ అయ్యారు.

చైనా వైఖరిపై మీరేమంటారు?: రాహుల్

దిల్లీ: దక్షిణ డోక్లామ్‌కు చైనా కొత్తదారులు వెతుకుతున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తాజాగా విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిపై మీ స్పందన ఏమిటంటూ మోదీని ప్రశ్నించారు. ఈమేరకు ట్విట్టర్‌లో 4 సమాధానాలు కూడా పెడుతూ రాహుల్ ప్రధానిని ఎద్దేవా చేశారు. "1. ఆలింగన దౌత్యం, 2. రక్షణమంత్రిని నిందించడం, 3. బహిరంగంగా గగ్గోలుపెట్టడం, 4. పైవన్నీ.." అని పేర్కొన్నారు. చైనా తెలివిగా కొత్త మార్గాలు వెతుకుతున్నట్లు వచ్చిన ఓ వార్తాకథనాన్ని కూడా రాహుల్ జతచేశారు. డోక్లామ్ అంశంపై కాంగ్రెస్ పార్టీతో పాటు, రాహుల్ తరచూ ప్రధానిపై విమర్శలు చేస్తున్నారు.

సుప్రీం ఆదేశాలను పునస్సమీక్షించాల్సిందే

- ఎస్సీ,ఎస్టీల చట్టాన్ని నీరుగార్చే యత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఆరోపణ
- దళిత వ్యతిరేక భావజాలానికి ప్రధాని మోదీ కొమ్ముకాయటం తగదని రాహుల్ ధ్వజం
- ఆరోపణలను తోసిపుచ్చిన భాజపా

దిల్లీ: ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని నిబంధనలను దుర్వినియోగపరుస్తూ దాఖలయ్యే తప్పుడు కేసుల ఆధారంగా ప్రభుత్వ అధికారులను ఏకపక్షంగా అరెస్టు చేయటం తగదన్న సుప్రీంకోర్టు ఆదేశాలు...దళితులు, బలహీనవర్గాల ప్రజల్లో అభద్రతను కల్పించేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాలు పేర్కొన్నాయి. ఎస్సీ,ఎస్టీ చట్ట స్ఫూర్తిని నీరుగార్చేలా ఉన్న మంగళవారం నాటి సుప్రీంకోర్టు ఆదేశాలను పునస్సమీక్షించేలా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సుప్రీంకోర్టులో దళితుల ప్రయోజనాలను పరిరక్షించటంలో నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలమయ్యిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. భాజపా/ఆరెస్సెస్ ఆలోచనా ధోరణి అయిన దళిత వ్యతిరేక భావజాలాన్ని సమర్థించుకోవటం కోసం ప్రధాని మోదీ తన విధులను విస్మరించటం తగదన్నారు. దళితులు, ఆదివాసీలపై జరిగే అణచివేత, వేధింపులు, దాడులను నిరోధించటంలో ఎస్సీ,ఎస్టీ చట్టం చాలా ముఖ్యమైన సాధనమని రాహుల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు, వేధింపులు అధికమయ్యాయని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పునస్సమీక్షించుకోకపోతే దురదృష్టకర పరిస్థితులకు అది దారితీస్తుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే తన వైఖరిని స్పష్టం చేయాలని, అటార్నీ జనరల్ ద్వారా తన అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు వెంటనే తెలపాలనీ డిమాండ్ చేశారు. అలాకాకుండా ప్రభుత్వం మౌనంవహిస్తే సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సమర్థించినట్లవుతుందన్నారు. సామాజిక న్యాయంపై దుష్ప్రభావం చూపేలా ఉన్న సుప్రీంకోర్టు ఆదేశాలపై తక్షణమే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని దళిత్ శోషణ్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) డిమాండ్ చేసింది. దుర్వినియోగం పేరుతో ఎస్సీ,ఎస్టీ చట్టంలోని సెక్షన్ 18ని మార్చితే అంతకంటే దురదృష్టకరమైన చర్య మరొకటి ఉండదని డీఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ,ఎస్టీల సాధికారతకు ఉద్దేశించిన చట్టాన్ని కుట్రపూరితంగా నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్న కాంగ్రెస్ పార్టీ నేతల విమర్శలను కేంద్ర మంత్రి, భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ తోసిపుచ్చారు. అసత్యాల ప్రచారంలో ప్రధాన విపక్ష పార్టీ ఆరితేరిందని దుయ్యబట్టారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ..దళితుల అభ్యున్నతి కోసం చేసిందేమీ లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాతే తన వైఖరి ఏమిటో వెల్లడిస్తుందని రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు.

మరిన్ని చిక్కుల్లో ఫేస్‌బుక్

- విచారణ మొదలుపెట్టిన అమెరికా ఎఫ్‌టీసీ
- శాన్‌జోస్ కోర్టులో కేసు నమోదు

వాషింగ్టన్, లండన్, న్యూయార్క్: సమాచార దుర్వినియోగం ఉచ్చు ఫేస్‌బుక్‌కు మరింత బిగుసుకుంటోంది. సంస్థపై అమెరికా ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (యూఎస్ఎఫ్‌టీసీ) బుధవారం విచారణ మొదలుపెట్టింది. మరోవైపు సంస్థతోపాటు "కేంబ్రిడ్జ్ అనలిటికా"పైనా శాన్‌జోస్ జిల్లా కోర్టులో కేసు నమోదైంది. తమ సమాచారాన్ని అనుమతి లేకుండానే ఉపయోగించుకున్నారంటూ మేరీల్యాండ్‌వాసి దీన్ని దాఖలుచేశారు. ఫేస్‌బుక్ షేర్ల పతనమూ కొనసాగుతోంది. ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని బ్రిటన్ సంస్థ అనలిటికా దుర్వినియోగంచేసిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సమాచారాన్ని ఫేస్‌బుక్కే బదిలిచేసి నిబంధనలు ఉల్లంఘించిందా? అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు యూఎస్ఎఫ్‌టీసీ అధికారులు తెలిపారు. అయితే కేంబ్రిడ్జి అనలిటికా సమాచార దుర్వినియోగంతో దిగ్భ్రాంతికి గురయ్యామని, తాము మోసపోయామని ఫేస్‌బుక్ ఓ ప్రకటన విడుదలచేసింది. 'ప్రజల సమాచారం పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. దీనికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటాం. ప్రస్తుత ఘటన తీవ్రతను గుర్తించాం. దీనికి సంబంధించి వాస్తవాలన్నీ వెలుగులోకి తెచ్చేందుకు, తగిన చర్యలు తీసుకునేందుకు ఫేస్‌బుక్ సీఈవో జుకెర్‌బర్గ్, సీవోవో శాండ్‌బెర్గ్ తమ బృందాలతో అహర్నిశలు శ్రమిస్తున్నారు'అని పేర్కొంది. తమఎదుట హాజరుకావాలని జుకెర్‌బర్గ్‌కు అమెరికా కాంగ్రెస్, బ్రిటన్ పార్లమెంటు, ఐరోపా కమిషన్ సమన్లుజారీచేశాయి.

కేంబ్రిడ్జ్ అనలిటికా సీఈవోపై వేటు: వివాదానికి కేంద్రబిందువైన అనలిటికా సంస్థ సీఈవో అలెగ్జాండర్ నిక్స్‌పై వేటుపడింది. సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆయన్ను బుధవారం పదవి నుంచి తప్పించారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిచేందుకు తాము క్రియాశీలంగా పనిచేశామంటూ ఆయన చెబుతున్న దృశ్యాలు మీడియాలో ప్రసారమైన కొద్ది గంటలకే తాజా పరిణామం చోటుచేసుకుంది. 'సమాచారం, విశ్లేషణ, ఎరలు వేయడం లాంటి పనులన్నీ మేమే చేశాం. పంపిన ఈ మెయిళ్లన్నీ నిర్దేశిత సమయం దాటిన తర్వాత డిలీట్ అయ్యేలా ప్రోగ్రాం చేశాం. దీంతో ఎలాంటి ఆధారాలూ లేకుండా చేయగలిగాం'అంటూ ఆయన చెబుతున్నట్లు దృశ్యాల్లో కనిపిస్తోంది. నిక్స్ వ్యాఖ్యలతో సంస్థకు సంబంధంలేదని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ప్రకటనలో తెలిపారు. తాము ఎలాంటి తప్పూ చేయలేదని వివరించారు.

'నన్ను బలి పశువుని చేశారు': మరోవైపు ఈ వివాదంలో తనను బలి పశువుని చేశారంటూ కేంబ్రిడ్జ్ వర్సిటీ పరిశోధకుడు అలెగ్జాండెర్ కోగన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈయన అభివృద్ధిచేసిన యాప్ సాయంతోనే కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని దుర్వినియోగంచేసినట్లు అనలిటికా ఆరోపణలు ఎదుర్కొంటోంది. 'అనలిటికా ప్రతినిధులు మొదట నా దగ్గరకు వచ్చారు. ఫేస్‌బుక్ సమాచార వినియోగం విషయంలో కొన్ని నిబంధనలతో కూడిన ఒప్పందాన్ని అందించారు. దీనిలో ఎలాంటి తప్పూ లేదనీ చెప్పారు. అయితే ఈ ఒప్పందాన్ని సమీక్షించే న్యాయవాదులు నా దగ్గర లేరు. సమాచార వినియోగంపై నేను ప్రశ్నలూ అడగలేదు'అని ఆయన అంగీకరించారు.

'ఫేస్‌బుక్ డిలీట్‌చేసే సమయం వచ్చింది': ఫేస్‌బుక్‌ను డిలీట్‌చేసే సమయం ఆసన్నమైందని వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ ఆక్టన్ వ్యాఖ్యానించారు. ట్విటర్‌లో ఆయన ప్రచారమూ ప్రారంభించారు. వాట్సాప్‌ను 2014లో ఫేస్‌బుక్ కొనుగోలుచేసింది. గత సెప్టెంబరులో బ్రియాన్.. ఫేస్‌బుక్‌ను వీడిపోయారు.



దిల్లీ యమునా నదిలో కాలుష్యపు నురగల మధ్యే ప్రార్థనలు చేస్తున్న ఓ మహిళ





తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద వితరణశాలలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యే బాలకృష్ణ తదితరులు ★ తితిదే ఈవో సింఘాల్ నుంచి విరాళానికి సంబంధించిన రశీదు అందుకుంటున్న దేవాన్ష్. చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు

తెలుగువారి ఆత్మగౌరవం కోసం దేవుడిని ప్రార్థించా

- **కుటుంబ సమేతంగా శ్రీవారి సేవలో తరించిన ఏపీ సీఎం చంద్రబాబు**

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రం కోసం జపాన్ తరహాలో ఆందోళన చేస్తూ అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఆందోళన చేసి అభివృద్ధి మర్చిపోతే మరల వెనకబడిపోతామని, అభివృద్ధి చేసుకుంటూనే.. మనకు జరిగిన అన్యాయంపై మాట్లాడకపోతే కూడా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సమేతంగా చంద్రబాబు బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ముఖ్యమంత్రి మాట్లాడుతూ "మా మనవడు దేవాన్ష్ మూడు సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకుని నాలుగో ఏడాదిలో అడుగుపెడుతున్నాడు. మా ఇంటి కులదైవం శ్రీవేంకటేశ్వరస్వామి. అందుకే దేవాన్ష్‌కు అన్నప్రాసన, అక్షరభ్యాసం తిరుమలలోనే చేశాం. పుట్టిన రోజున శ్రీవారిని దర్శించుకోవడం, సొంత నిధులతో ఒక రోజు భక్తకోటికి అన్నప్రసాద వితరణకు శ్రీకారం చుట్టాం. దేవాన్ష్ ఒక మంచి పౌరుడిగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను"అని వివరించారు. రాష్ట్రంలో తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఆత్మ విశ్వాసంతో ముందుకుసాగేలా ఆశీర్వదించమని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు. యాత్రికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రూ. 26 లక్షల విరాళం తాలూకు రశీదును దేవాన్ష్ ద్వారా ముఖ్యమంత్రి తితిదే ఈవోకు అందజేశారు.

అక్రమ రవాణా అడ్డుకట్టకు కమిటీలు!

- **జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో..**
- **20 రోజులకోసారి సమీక్ష**

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిఘాను విస్తృతం చేయాలని తెలంగాణ రవాణా శాఖ నిర్ణయించింది. ప్రైవేట్ వాహనాల దూకుడుతో తమ ఆదాయం తగ్గిపోతోందని ఆర్టీసీ పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తోంది. ఆర్టీసీ-రవాణా శాఖ అధికారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయించినా అది కార్యరూపంలోకి రాలేదు. తాజాగా జిల్లా కలెక్టర్ల ఆధ్యక్షతన కమిటీ నియమించి విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. మంగళవారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం సందర్భంగా ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆర్టీసీ ప్రస్తావించటంతో నిఘా కమిటీలను నియమించాలని ఉప సంఘం సూచించింది. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఐదుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనుంది. కమిటీకి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ఎస్పీ, ఆర్టీవో, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్, కార్మిక సంఘం ప్రతినిధి ఒకరు చొప్పున కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి 20 రోజులకు ఒకసారి సమీక్షించి, నివేదికను రవాణా శాఖకు పంపుతుంది. ఆ నివేదికలను రవాణా మంత్రి ఆధ్వర్యంలో అధికారుల బృందం సమీక్షించనుంది. అధికారుల అంచనా ప్రకారం ప్రైవేట్ వాహనాలు పన్ను చెల్లింపుల విషయంలో రాజీపడకపోయినా ఇతర అంశాల్లో నిబంధనలు పాటించని సందర్భాలు తరచూ కనిపిస్తున్నాయని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. పన్ను చెల్లించకుండా వాహనాలు నడుపుతున్నా, ఒకే నంబరుతో వేర్వేరు ప్రాంతాల్లో వాహనాలు నడిపినట్లు గుర్తించినా ఆయా బస్సులను సీజ్ చేస్తామని ఆ అధికారి వివరించారు. నిబంధనలు అతిక్రమించిన సందర్భాల్లో అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. కమిటీ నియామకానికి సంబంధించిన విధివిధానాల ఉత్తర్వులు ఈ వారంలో జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.

99 కేసులు

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ బస్సులపై రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం ఉదయాన్నే రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అన్ని జిల్లాల్లో 99 కేసులు నమోదు చేసి, రూ.1.62 లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు.

రేపటి నుంచి పీజీ వైద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: 2018-19 వైద్యవిద్య సంవత్సరానికి పీజీ వైద్యవిద్య ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం(ఈ నెల23) నుంచి పీజీ వైద్య సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. నీట్‌లో అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 28 లోపు పంపించాలని పేర్కొంది. ఈ నెల 30న ప్రాథమిక జాబితాను వెల్లడించి, 31న ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలుస్తోంది. 4రోజుల పాటు ధ్రువపత్రాల పరిశీలన అనంతరం వచ్చే నెల మొదటి వారాంతంలోపు వెబ్ ఆప్షన్లకు అవకాశమివ్వనున్నట్లు వర్సిటీవర్గాలు తెలిపాయి.

జనావాసాలపై పాకిస్థాన్ దాడులు

జమ్ము: పాకిస్థాన్ మళ్లీ దాడులకు తెగబడింది! జమ్ము-కశ్మీర్‌లోని పూంచ్ జిల్లా బాలకోట్ సెక్టార్‌లో... నియంత్రణరేఖ వెంబడి బుధవారం పొద్దుపోయాక కవ్వింపు చర్యలకు పాల్పడింది. సరిహద్దు గ్రామాలు, జనావాసాలను లక్ష్యంగా చేసుకుని మోర్టార్ షెల్స్, తేలికపాటి ఆయుధాలను ప్రయోగించింది. ఈ దాడులను భారత సైన్యం అంతే దీటుగా తిప్పికొట్టింది.

తగ్గుతున్న రహదారి ప్రమాదాలు

- **అధికారుల చర్యలే ఇందుకు కారణం**
- **అవగాహన కార్యక్రమాలు.. చైతన్య సదస్సులు**
- **నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు జరిమానాలు**

ఈనాడు, హైదరాబాద్: ప్రతి రెండు గంటలకు ఐదు రహదారి ప్రమాదాలు.. రోజుకి 18 మరణాలు. వెరసి కాలు బయటపెట్టాలంటేనే భయపడాల్సిన స్థితి. ఇదీ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి. అయితే గత కొంతకాలంగా ప్రమాదాల తీవ్రత కాస్త తగ్గినట్లు కనిపిస్తోంది. జాతీయ సగటుతో పోల్చుకుంటే రాష్ట్రంలో గత మూడేళ్లలో రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గాయి. ముఖ్యంగా ప్రమాద తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు చాలావరకూ దోహదం చేస్తున్నాయి. చైతన్యం కల్పించేందుకు రకరకాల కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది రాష్ట్రంలో వాహనచోదకుల నుంచి రూ.195 కోట్ల అపరాధ రుసుము వసూలు చేశారంటే జరిమానాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో రహదారి ప్రమాదాలు, మరణాలకు సంబంధించిన వివరాలను రైలు, రహదారి భద్రత విభాగం డీజీపీ కృష్ణప్రసాద్ బుధవారం విడుదల చేశారు.

తగ్గిన మరణాలు

ప్రతి వంద ప్రమాదాలకు 2015లో దేశంలో 29.1 మంది చనిపోగా మరుసటి ఏడాదికి ఈ సంఖ్య 31.4కు పెరిగింది. ఇదే సమయంలో తెలంగాణలో ప్రమాదాల తీవ్రత 33.5 నుంచి 31.9కి తగ్గింది. 2017 నాటికి ఇది 29.4కి చేరింది. అంటే గతేడాది రాష్ట్రంలో ప్రతి వంద ప్రమాదాలకు 29.4 మంది చనిపోయారన్నమాట. రాష్ట్రంలో ప్రమాదాల తీవ్రతను 2016తో పోల్చుకుంటే 2017లో 2 శాతం తగ్గగా, మరణాల తీవ్రత 9 శాతం తగ్గింది.

సదస్సులు, జరిమానాలు

గత రెండేళ్ల నుంచి అధికారులు చేపడుతున్న చర్యల కారణంగా రాష్ట్రంలో రహదారి ప్రమాదాల తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇందుకు ప్రధాన కారణం ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం.. నిబంధనలు ఉల్లంఘించేవారిపై కొరడా ఝుళిపించడమే. నిబంధనలు ఉల్లంఘించే వాహనచోదకులపై నమోదైన కేసులు 2016తో పోల్చుకుంటే 2017లో 71 శాతం పెరిగాయి. వీరి నుంచి వసూలు చేసే అపరాధ రుసుము వందశాతం పెరిగింది. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని పట్టుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలలో ప్రత్యేక సదస్సులు నిర్వహించి ప్రమాదాల నివారణపై రూపొందించిన చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ఆటోడ్రైవర్లు, లారీ డ్రైవర్లకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టారు. వీటన్నింటి ఫలితమే రాష్ట్రంలో రహదారి ప్రమాదాలు, వాటి తీవ్రతలో క్షీణత కనిపిస్తోంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG